తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:56, Issue: 05
October - 2025, Price Rs.20/-.

అక్టోబరు 2025
వెల రూ. 20/-
పుటలు - 56



తిరుమల శ్రీవారి పుష్పయాగమహోత్సవం
(30-10-2025)




# నూతన కార్యనిర్వహణాధికారివారికి హార్దిక శుభాకాంక్షలు

తి.తి.దే. నూతన కార్యనిర్వహణాధికారిగా 10-09-2025న మాజీ కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., వారినుండి రెండవసారి బాధ్యతలు స్వీకరించిన శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. వీరికి తిరుమల శ్రీవారి రంగనాయకులమండపంలో పండితుల వేదాశీర్వచనంతో, శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అదనపు కార్యనిర్వహణాధి కారి సి.హెచ్.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్., వారు అందించారు. వీరు మునుపు తి.తి.దే.లో ఎన్నో గొప్ప గొప్ప సంస్కరణలు చేశారు. తి.తి.దే. సప్తగిరి మాసపత్రిక గౌరవసంపాదకులుగాకూడా ఉంటారు. వీరికి ‘సప్తగిరి’ గౌరవ సంపాదకులుగా హార్దిక శుభాకాంక్షలు. ఇందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు, సభ్యులు మరియు ప్రముఖులు.



# ఆత్మీయ వీడ్కోలు

శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్. వారు 2024, జూన్ నుండి తి.తి.దే. కార్యనిర్వహణాధికారిగా విధులు చేపట్టి అనేక నూతన సంస్కరణలు గావించారు. మరియు ‘సప్తగిరి’ గౌరవ సంపాదకులుగా వ్యవహరించిన వీరు 09-09-2025న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) మరియు సాధారణ పరిపాలనావిభాగంనకు బదిలీ అయిన సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు తెలుపుతోంది ‘సప్తగిరి’. ఇందులో పాల్గొని తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., ముఖ్య నిఘా మరియు భద్రతాధికారి శ్రీ కె.వి.మురళీకృష్ణ, ఐ.పి.ఎస్., ఎఫ్.ఏ. & సి.ఏ.ఓ. శ్రీ ఓ.బాలాజి మరియు ఉన్నతాధికారులు తమ ఆత్మీయ వీడ్కోలు తెలిపారు.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిష్యసి ।**
**తతస్స్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-33వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అథ= ఇక; త్వమ్= నీవు; ఇమమ్= ఈ; ధర్మ్యమ్= ధర్మయుక్తమైన; సంగ్రామమ్= యుద్ధమును; న కరిష్యసిచేత్= చేయకుందువేని; తతః= అందువలన; స్వధర్మమ్= స్వధర్మమును; కీర్తిం చ= కీర్తిని; హిత్వా= విడిచి; పాపమ్= పాపమును; అవాప్స్యసి= పొందగలవు.

**భావం:** ఇక నీవు ధర్మయుక్తమగు ఈ యుద్ధమును చేయకుందువేని, దానిచే నీవు స్వధర్మమును నిరసించినవాడవై, కీర్తిని పోగొట్టుకొని పాపమును పొందగలవు.

## భూలోకమున నీకు అంగరంగ వైభవ పుష్పయాగము!!



పూజలందరు జేసేదే పుష్పయాగము
ఆజి నర్జునుడు చేసినది పుష్పయాగము

మొదల శ్రీసతి చేతి మోహన కమలమే
పాదల నీ కెపుడును పుష్పయాగము
గుదిగొన మిమ్ముద్దరి గూడించే మరువిరులు
పొదిగి పూజించిన పుష్పయాగము

మాలాకారుడిచ్చిన మధురలో పూదండ
పోలింప నీకు నదె పుష్పయాగము

కేలితో నారదుడొసగిన పారిజాతము
భూలోకమున నీకు పుష్పయాగము

తొరలి అలమేల్మంగ తురుమున విరులే నీకు
పొరసి నీవురముపై పుష్పయాగము
సిరులతో మునులెల్ల శ్రీవేంకటాద్రీశ నీకు
పొరి పొరి జేసెరు పుష్పయాగము

ఆధ్యాత్మసంకీర్తన సంపుటం 26- సంకీర్తన 207





# అఖిలాండం - అఖండదీపం

- శ్రీ యం.వి.యస్.రామశేషు,

"రుద్రాభిషేక పూజాదే - దీపం ప్రజ్వాలయేత్సుధీః।
అఖండ దీప హీనాయా - సాపూజా నిష్ఫలాభవేత్॥"

అని రుద్రకల్పంలో ఉంది. అఖిల+అండం అంటే ఈ సృష్టిమొత్తాన్ని బొజ్జలో నింపుకొన్నవాడు ఆ పరమాత్మ అని అర్థం. ఆయనముందు వెలిగేది అఖండదీపం. సృష్టిని కాపాడేది దీపం. మనశ్శాంతిని కలిగించేది అఖండం. ఇది ఎప్పుడూ వెలుగుతూనే ఉంటుంది. భక్తి, ఆశయం మరియు ఆత్మశుద్ధికి ప్రతీక. భగవంతుని రెండునేత్రములు సూర్యచంద్రులు. అవి కాంతివంతంగా వెలుగుతూ నిరంతరం సృష్టిని కాపాడే దీపాలు. ఐతే ఆ దీపకాంతి మనకు పగలు రాత్రి తేడాలను కలుగజేస్తుంది.

స్వామిముందు వెలిగే అఖండదీపం సర్వకాలసర్వావస్థలయందు ప్రజ్వరిల్లుతూ కాంతులు వెదజల్లుతుంటుంది. కాంతి అంటే వెలుగు. వెలుగు అంటే జ్ఞానం అని అర్థం. ఆ జ్ఞానకాంతుల్లో భగవంతుని దర్శించడమే మానవజీవితం పరమార్థం.

తిరుమల శ్రీవారిఆలయగోపురానికి ఎదురుగా ఉన్న అఖిలాండంలో అఖండదీపం నిత్యము వెలుగుతూ ఉంటుంది. పూర్వం 20అడుగుల ఎత్తైన దీపస్తంభాన్ని కంచిస్వామివారు శ్రీవారికి ఇవ్వటం జరిగింది. ఒకప్పుడు శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న మెట్లమీద ఆ అఖండదీపస్తంభం అఖిలాండం ఉండేది. ఆలయపరిసరప్రాంతాలు విస్తరింపచేసిన తరువాత ఆ దీపస్తంభం ఆలయగోపురానికి ఎదురుగాఉన్న బేడి ఆంజనేయ స్వామికిఎదురుగా ఏర్పాటు చేయబడింది. ఇప్పుడు మధ్యలో ఒక పెద్దదీపస్థంభం దానికి ఇరువైపులా రెండేసి దీపస్తంభాలున్నాయి. ఒక్కొక్కస్తంభంపైనభాగాన శంఖచక్రాలు, నామము, గరుడాళ్వార్, ఆంజనేయస్వామి ఉన్నారు. అలిపిరినుంచి మెట్లమీదుగా నడిచివచ్చినవారు స్వామిని దర్శించడానికి తిరుమలకు వచ్చిన భక్తులు ముందుగా అఖిలాండాన్ని దర్శించి మొక్కుబడులను తీర్చుకుంటారు.

రాతియుగంలో రాతితోనే దీపపుస్తంభాలుగా మలిచి దీపారాధనలు చేసేవారు. ఆలయంలోపల ఉన్న స్వామిని దర్శించడానికే భక్తులకు సమయం చాలదు. ఇక ఆలయంలో వెలిగే అఖండాన్ని దర్శించడానికి భక్తులకు వీలు కాదు. అందువలన భక్తులు దర్శనానికి ముందుగానే ఆలయ గోపురానికి ఎదురుగా ఉన్న అఖిలాండంలో ఆవునెయ్యి, కర్పూరం, వత్తులువేసి కొబ్బరికాయలుకొట్టి తమకోరికలు తీర్చమని స్వామిని వేడుకుంటారు. కొందరు ముందుగానే మొక్కుకుని ఆ మొక్కుబడిని తీర్చుకోవటానికి దీపారాధనచేసి కొబ్బరికాయలు కొడతారు. మొక్కుబడిని తీర్చుకున్న ఆ కొబ్బరి చిప్పలను అక్కడే ఉన్న ప్రత్యేకహుండీలో వేస్తారు. తరువాత వాటిని భక్తుల ప్రసాదనిమిత్తం వినియోగిస్తారు.

భక్తులు ఆ దీపకాంతుల్లో స్వామిని దర్శించి పుణ్యాన్ని పొందుతారు. నిరంతరం అఖండంగా వెలిగేది దీపం. తిరుమల శ్రీవారిఆలయం మహావిష్ణువు పవిత్రస్థలం వైకుంఠంగా భావిస్తారు భక్తులు. వైకుంఠస్వామి కలియుగంలో భక్తుల ఆపదలను తీర్చడానికి ఆపదమొక్కులవాడై తిరుమలలో వేంచేసి నివసిస్తున్నాడని నమ్మకం. ఈ అఖండం దేవుని అనుగ్రహం. శాశ్వతమైన వెలుగు. అంతేకాక భగవంతుని ఉనికికి చిహ్నంగా భావిస్తారు. అఖిలాండంలో వెలిగే అఖండదీపం స్వామి మహిమతో ఏ కాలంలోనైనా కాంతులు వెదజల్లుతూ భక్తులకు దర్శనమిస్తుంది. అదే స్వామిమాహాత్మ్యం.

శుభం కరోతు కళ్యాణం ఆరోగ్యం సుఖం సంపదమ్!
శత్రుబుద్ధివినాశకం దీపజ్యోతి ర్నమోస్తుతే!!

అన్న శ్లోకాన్ని పఠిస్తూ, స్వామిని మనసులో నిలుపుకొని అఖిలాండంలో వెలిగే అఖండజ్యోతిదర్శనమే భక్తులకు మోక్షహేతువు ఔతుంది.



ఎంత దూరంగా ఉంటే అంత విలువ, ఎంత తక్కువగా మాట్లాడితే అంత మర్యాద

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 56 అక్టోబరు, 2025 సంచిక : 05

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| అఖిలాండం - అఖండదీపం | శ్రీ యం.వి.యస్.రామశేషు | 04 |
| తిరుమల మహాపుణ్యక్షేత్రం | శ్రీ కొండూరి కాశీవిశ్వేశ్వరరావు | 07 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 09 |
| శ్రీవేంకటేశ్వర అవతార విశేషాలు | శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి | 10 |
| దైవాసురసంపదలు-16 (గేయం) | డా॥రెడ్డి సుబ్రమణ్యం గాడి | 11 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 12 |
| పోతన భాగవతంలో.. బాలకృష్ణుని క్రీడావినోదములు | డా॥ జి.హేమావతి | 15 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 18 |
| రసోద్దీప్త సత్యభామ | డా॥ మైలవరపు లలితకుమారి | 20 |
| దివ్య దివ్య దీపజ్యోతుల వేడుక-దీపావళి | యోగశ్రీ ఆచార్య డా॥సి.ఎస్.రాయుడు | 23 |
| తిరుప్పుళింగుడి (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| సనాతనధర్మం ఆచారవ్యవహారాలు | శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు | 31 |
| "నరకాసురవధ" సందేశం | శ్రీ యం.రవితేజ | 33 |
| చంద్రగ్రహారాధన-మనోవైకల్యనివారణ | శ్రీ సదాశివుని లక్ష్మణరావు | 35 |
| కానివానిస్నేహం తగదు (వేమన శతకం) | కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు | 37 |
| ఇదే ఐశ్వర్యం!! | శ్రీ పింగళి పాండురంగారావు | 38 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 39 |
| కల్యాణస్వామి | శ్రీమతి కె.అలేఖ్య | 41 |
| తిథులు- వాటి దేవతలు | శ్రీమతి కె.నిర్మల | 42 |
| భగవన్నామస్మరణమహిమ | శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ | 44 |
| అర్జున గర్వభంగం | శ్రీమతి ఆసూరి ఉషారాణి | 45 |
| గున్నను రక్షించిన గణపతి | తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర | 46 |
| ముల్లంగి | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| గురువులను గౌరవిద్దాం (చిత్రకథ) | కథ: మొలకా ఉత్తరఫల్గుణి<br>చిత్రాలు: డా॥ శ్రీధరన్ కొలికి | 48 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన-కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య | 50 |
| క్విజ్ | | 51 |
| బాలవినోదం | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| శ్రీపదకేళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, తిరుమల

వెనుకచిత్రం: శ్రీ మనవాళ మహామునులు (చిత్రకారుడు- శ్రీ యం.ఈ.రుద్రమూర్తి)

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి॥

గౌరవ సంపాదకులు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-సంపాదకులు,
ప్రధాన సంపాదకులు (ఎఫ్.ఏ.సి.)
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉప సంపాదకులు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకులు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఎడ్.,
ఉపకార్యనిర్వహణాధికారి, (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
ప్రధానసంపాదకులు-0877-2264363
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

సంపాదకీయం

# దీపావళి ఆస్థాన మహోత్సవం

**"దీపజ్యోతిః పరబ్రహ్మం దీపజ్యోతి జనార్దనః!**
**దీపోహరతు యే పాపం దీప జ్యోతిః నమోస్తుతే!!"**

దీపం వెలుగులను విరజిమ్ముతూ చీకట్లను తొలగిస్తుంది. సృష్టి సమస్తము త్రిమూర్త్యాత్మకం. బ్రహ్మ సృష్టి చేస్తే, విష్ణువు స్థితికారకుడు. ఈశ్వరుడు లయకారకుడు. జనార్దనుడు స్థితికారకుడు కనుక దీపజ్యోతి జనార్దన అన్నారు. జీవి జీవనానికి ఆనందాన్ని, శుభాలను కలిగించి వెలుగులను పంచువాడు జనార్దనుడు. కేవలం చీకట్లను తొలగించటం మాత్రమే కాదు జనుల పాపాలనుకూడా తొలగించు జ్యోతిస్స్వరూపుడైన నారాయణునికి తొలి నమస్కారం. సూర్యనారాయణుడు ఇరవైనాలుగు గంటలూ ప్రకాశిస్తూ వెలుగులను పంచే ప్రత్యక్షదైవం. నిత్య చైతన్యమూర్తి.

తిరుమల శ్రీవారిఆలయంలో ప్రతినిత్యం దీపోత్సవాలు చేస్తారు. దీపంనుండి వెలువడే కాంతి చీకటిని, అజ్ఞానాన్ని, చెడును తొలగిస్తుంది. కాబట్టి దీపం వెలుగు శ్రేయస్సును కలుగజేస్తుంది. నిత్యము తిరుమల శ్రీవారిఆలయం బయట జరిగే సహస్ర దీపాలంకరణసేవను చూచిన భక్తులందరూ తమ పాపాలను తొలగించుకుంటారు. ఆలయం వెలుపల మాత్రమే కాకుండా అయినామహల్ అనే అద్దాలమండపంలోకూడా ఈ సహస్రదీపాలంకరణ ఉత్సవం జరుగుతుంది. ఆరుబయట జరిగేది భక్తులందరూ దర్శిస్తారు. అద్దాలమండపంలో జరిగే సహస్రదీపాలంకరణసేవ ఆర్జితసేవ. అందువల్ల కొందరికి మాత్రమే ప్రవేశం ఉంటుంది. వారు మాత్రమే చూడగలరు. ఈ సహస్రదీపాలంకరణసేవ ప్రతినిత్యం సాయంకాలం ప్రదోషసమయంలో జరుపుతారు. సంధ్యాసమయంలో వెలిగించే దీపాలను చూస్తూ–

**"దీపం సర్వ తమోపహం దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపం నమోస్తుతే!"** అంటూ భక్తులంతా సహస్రదీపాలంకరణసేవను దర్శిస్తారు.

అలాగే శ్రీవారికి దీపావళిఆస్థానం నిర్వహిస్తారు. ఈ ఆస్థానం దీపావళిపండుగరోజున అనగా ఆశ్వయుజ బహుళ అమావాస్యరోజు నిర్వహిస్తారు. ప్రతిసంవత్సరం స్వామికి దీపావళిఆస్థానం శ్రీవారిసమక్షంలో నిర్వహిస్తారు. ఈ రోజున శ్రీవారికి తోమాల, అర్చన, కల్యాణోత్సవసేవలను నిర్వహించిన తరువాత ఆర్జితసేవలను నిలిపివేస్తారు. మొదటిగంటసేవలు అయినతరువాత శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామిని సర్వభూపాలవాహనంపై అధిష్ఠింపచేసి బంగారువాకిలి ముందున్న ఘంటామండపంలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా వేంచేపు చేస్తారు. మరొకపీఠంపై విష్వక్సేనుని దక్షణాభిముఖంగా వేంచేపుచేసి అర్చకులచే ప్రత్యేకపూజ, హారతి, నివేదన, తిరుచందనాలు సమర్పిస్తారు. శ్రీవారికి నూతనవస్త్రసమర్పణ, అక్షతారోపణ చేస్తారు.

ఈ దీపావళిఆస్థానం పూర్తైనతరువాత శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు నాలుగుమాడవీథులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. భక్తులంతా స్వామిని దర్శించి స్వామి కృపాకటాక్షములకు పాత్రులై పునీతులౌతారు.



# తిరుమల మహాపుణ్యక్షేత్రం

- శ్రీ కొండూరి కాశీవిశ్వేశ్వరరావు, 92909 69633

మనం తెలిసో తెలియకో పాపాలు చేయటం సర్వ సాధారణవిషయం. ఐతే చేసిన పాపాలనుండి విముక్తులవ్వాలంటే తప్పనిసరిగా భగవన్నామస్మరణతోపాటు పుణ్యక్షేత్రాల దర్శనంతో సులభమార్గంలో మోక్షం లభిస్తుంది.

కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలంటే తిరుపతిలోఉన్న తిరుమల ఏడుకొండలను ఎక్కవలసిందే. ఇప్పుడంటే రవాణాసౌకర్యాలు విరివిగా వచ్చాయి కాబట్టి తిరుమలయాత్ర చాలా సులభంగాను, ఎంతో సౌకర్యంగానూ ఉంది. అసలు ఈ ఏడుకొండల ప్రాముఖ్యత ఏంటి? మరియు విశిష్టతలు తెలుసుకుందాం.

**1) వృషభాద్రి-**

ఈ కొండపై సాక్షాత్ పరమశివుడు వృషభంపై కూర్చుని ఉంటాడు. ఆ ఎద్దుకు నాల్గుకొమ్ములుంటాయి. అవి భూత, భవిష్యత్, వర్తమానకాలాలు మరియు వేదతరంగాలతో కూడిన శబ్దం అని చెప్పొచ్చు.

**2) వృషాద్రి-**

వృషాద్రికొండ పరమ ధర్మప్రదమైనది. అంటే మనం ధర్మాచరణతోనే మన జీవితాన్ని గడపాలి. కేవలం ధర్మానుష్ఠానంద్వారానే సుఖసంతోషాలు లభిస్తాయి. ఒకవేళ అధర్మంతోకూడా విలాసవంతమైనజీవితం లభించినా అది అశాశ్వతమైనది.

**3) గరుడాద్రి-**

శ్రీమన్నారాయణునికి వాహనమేకాక, స్వామివారికి దాసానుదాసుడు గరుత్మంతుడు. ఎన్ని వాహనాలున్నా శ్రీవారికి అత్యంత ఇష్టమైన వాహనం గరుడవాహనం. ఎందుకంటే... తాను లోకాలన్నీ హాయిగా విమానమార్గాన విహరించవచ్చునీ, ముల్లోకములయందున్న ప్రాపంచికవిషయాలనూ, భక్తజన కష్టనష్టాలను గరుత్మంతునిద్వారా తెలుసుకొనే వీలుంటుందని శ్రీనివాసుడు గరుడవాహనాన్ని అధిరోహిస్తాడు. వీరిరువురి మైత్రి అనిర్వచనీయం. ఒకరంటే మరొకరికి ఎంతో ప్రీతిభావన. అందువల్ల మాసోత్సవంలో అత్యంత కనులపండువుగా జరిగే పున్నమి గరుడసేవను మనం దర్శించుకుంటే మన జన్మకు మోక్షం కల్గుతుందని పురాణపండితుల ఉవాచ.

**4) అంజనాద్రి-**

ఆంజనేయుని తల్లి అంజనాదేవి తపస్సు చేసిన పవిత్రమైన కొండ. ఇంద్రియాలను జయించినవాడు ఆంజనేయుడు. హనుమంతుడు వెయ్యియోజనాల సముద్రాన్ని అవలీలగా, వాయువేగంతో దాటగలిగాడు. అందుకే మనంకూడా ఏవైనా ఘనవిజయాల్ని సాధించాలంటే ఇంద్రియాలను జయించి తీరాలి.

**5) శేషాద్రి-**

శ్రీనివాసుని బ్రహ్మోత్సవాల్లో తొలివాహనమిది. మనలోని అనేక విషతుల్యమైన పాపాలను పోగొట్టేవాడు ఆదిశేషుడు.



పాపకర్మలు చేయటంద్వారా మానవులు రోజురోజుకీ విషపూరిత ఆలోచనలు, వికారాలకు లోనౌతారు. ఆ తర్వాత క్రమేపీ తమకుతాముగానే నాశనమైపోతారనే దివ్యసందేశం శేషాద్రి కొండను దర్శించటంద్వారా మనకు తెలుస్తుంది. అంతేకాకుండా మనకు రాబోయే కాలసర్పదోషాలు నివారించుకోవాలంటే శేషాద్రికొండను తప్పక దర్శించుకోవాలి.

**6) వేంకటాద్రి-**

వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన, వేంకటేశ సమో దేవో నభూతో న భవిష్యతి. లక్ష్మీదేవిని వెతుకుతూ, ఎంతో ఆవేదనతో వైకుంఠంనుండి భూలోకానికి వచ్చిన శ్రీమన్నారాయణుడు వేంకటాద్రికొండపై కొలువై ఉన్నాడు. వేం అనగా పాపాలు, కట అనగా పోగొట్టువాడు శ్రీవేంకటేశ్వరుడు కాబట్టి మనకై ఆ దేవదేవుడు వేంకటాద్రి కొండపై దర్శనమిస్తున్నది వేంకటాద్రికొండ. కొన్ని అనివార్య కారణాలవల్లగానీ, భక్తుల రద్దీలోకానీ శ్రీనివాసుని ప్రత్యక్షంగా దర్శించుకోలేనివారు శ్రీవిమానవేంకటేశ్వరుని దర్శించుకున్న ఫలితం లభిస్తుంది.

అథవా దూరంనుండి ఏడుకొండలను దర్శించుకొని నమస్కరించినా శ్రీనివాసుని కరుణకటాక్షములు తప్పక లభిస్తాయి. భక్తులకోసం పరితపించేవాడే భగవంతుడు. ఆయనే శ్రీనివాసుడు. ఆ శ్రీనివాసునికే మన కష్టనష్టాలన్నీ తెలుస్తాయి కదా.



**7) నారాయణాద్రి-**

నారాయణమంత్రం మోక్షాన్ని ప్రసాదించే వేద మంత్రం. నారాయణుడుకూడా శ్రీమహావిష్ణువుస్వరూపమే. నరులను ఉద్ధరించేవాడు నారాయణుడు. నారములు అనగా జలములు. స్వామి నదులయందూ, తటాకములయందూ, సముద్రములయందూ కొలువై ఉన్నాడు. నారాయణుడే విశ్వంభరుడు. ఆయన విశ్వమంతా వ్యాపించి ఉన్నాడు. ప్రతిజీవిలోనూ, ప్రాణిలోనూ జీవమై నిక్షిప్తమై ఉన్నాడు.

ఎందరో మునులు, ఋషులు, తపోధనులు, పండితులు ఈ ఏడుకొండలను దర్శించుకున్నారు. ఏ కొండలోనైనా, ఏ కోనలోనైనా ఉన్నాడు ఏడుకొండలవాడు. శ్రీనివాసుడు కొలువున్న ఏడుకొండలు వేదస్వరూపాలు కావున శ్రీరామానుజాచార్యులు తన మోకాళ్లతో ప్రాకుతూ ఏడుకొండలనూ ఎక్కి శ్రీనివాసుని దర్శించుకున్నాడు. తాను కాలినడకన ఎక్కితే తిరుమల ఏడుకొండలు అపవిత్రం అవుతాయని భావించి, రక్తం ధారలుగా కారుతున్నా ఏడుకొండ లెక్కిన మహాజ్ఞాని, సమతామూర్తి శ్రీరామానుజాచార్యులు.

శ్రీరామానుజుల భక్తితత్త్వాన్ని ఈనాటి భక్తులు అనుసరించాలి. మ్రొక్కులను తీర్చుకోవటానికి వచ్చిన భక్తులు కొందరు తమ పాతబట్టలను, దువ్వెనలనూ, చెత్తాచెదారాన్ని, చేతికి కట్టుకొని ఉన్న కంకణములను, కాశీదారములనూ తిరుమల కల్యాణకట్టలో పడేస్తున్నారు. ఇది చెప్పరాని అపచారం, పాపం అనికూడా గ్రహించాలి. తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఎంతో నిబద్ధతతో చేపట్టిన ప్లాస్టిక్‌నివారణ కార్యక్రమంలో మనవంతుగా వారికి సహకరించి పర్యావరణాన్ని, తిరుమలకొండలను పరిశుభ్రంగా ఉంచటానికి మనం పూనుకోవాలి.

ఒక్కసారైనా, ఒక్కక్షణమైనా శ్రీలక్ష్మీవేంకటేశ్వరుని దర్శించుకుంటే మన పాపాలు పటాపంచలైపోతాయి. తిరుమల విహారయాత్రప్రదేశం కాదు. 'తిరుమల మహాపుణ్యక్షేత్రం' అని గ్రహించి, తరిద్దాం.



యుద్ధంలో ఒంటరిగా పోరాడ్డం ఎంత కష్టమో సమాజంలో నిజాయితీగా బ్రతకటం కూడా అంతే కష్టం



# సందేహాలు సమాధానాలు

- శ్రీమతి యం.గీతాకుమారి

**ప్ర) 'పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి' అంటారు పెద్దలు. ఎందుకో తెలుపండి?**

**జ)** "పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి" అనేది సాధారణ తెలుగు సామెత. "పుర్రెకో బుద్ధి" అంటే అందరి ఆలోచనలు ఒకే రకంగా ఉండవు. ప్రతిఒక్కరి ఆలోచనావిధానం, అభిప్రాయాలు, అభిరుచులు ఒక్కొక్కరకంగా ఉంటాయి. ఒకరి ఆలోచన మరొకరికి నచ్చదు. ఎవరి ఆలోచన వారిదే. అలాగే "జిహ్వ కో రుచి" అంటే ప్రతిఒక్కరి నాలుక ఒక్కొక్క రుచిని కోరుతుంది. ఒకరికి పులుపు ఇష్టమైతే మరొకరికి కారం ఇంకొకరికి తీపి నచ్చుతుంది. అలా ఒకరికి నచ్చిన ఆహారం మరొకరికి నచ్చకపోవడం, ఎవరి నాలుకకు ఏ రుచి ఇష్టమో దానినే ఆనందంగా ఆస్వాదిస్తారు. దీనికే "పుర్రెకో బుద్ధి జిహ్వకో రుచి" అనే సామెత ఏర్పడింది.

**ప్ర) భక్తి, ముక్తి, రక్తి, శక్తి, యుక్తి అనే ఈ ఐదింటిలో ఏది ముఖ్యమో తెలుపండి?**

**జ)** ఈ ఐదింటిలో ఏది ముఖ్యమని అడిగితే ఇవన్నీ మానవ జీవితాన్ని ప్రభావితం చేసేవి అని చెప్పవచ్చు. ఇది వ్యక్తిగత ప్రాధాన్యత, వారి ఆలోచనలు, లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది.

**భక్తి** : కొందరు భక్తిపై నమ్మకం కలిగి ఉంటారు. భగవంతుని నమ్ముతారు.

**ముక్తి** : మరికొందరు జన్మరాహిత్యాన్ని కోరుకుంటారు. పునర్జన్మనుండి విముక్తిని కోరుకుంటారు.

**శక్తి** : జీవితంలో దేన్ని సాధించాలన్నా శారీరక, మానసిక బలం ముఖ్యమని భావిస్తారు. దీనినే శక్తిగా భావిస్తారు.

**రక్తి** : కొందరు జీవితంమీద ఆసక్తి, ఆనందాన్ని కోరుకుంటారు. వీరు జీవితమంటే ఆస్వాదించడానికి, ఆనందాలను అనుభవించడానికే అనుకుంటారు.

**యుక్తి** : ఇది మనిషి మేధస్సుకు సంబంధించింది. అంటే తెలివితేటలు అంటూ ఉంటే జీవితంలో ఏది ముఖ్యమో నిర్ణయించుకోవటం వ్యక్తిగత ఆలోచనపై ఆధారపడి ఉంటుంది.

వీనిలో ఏది ముఖ్యమో నిర్ణయించుకోవటం వ్యక్తి ఆలోచనపై ఆధారపడి ఉంటుంది. ఆధ్యాత్మికవిదులు భక్తి, ముక్తి ప్రధానమైనవంటారు. కొందరు జీవితంలో ఈ ఐదింటిపట్ల సమతుల్యత పాటిస్తారు. ఈ ఐదు ఒకదానిపై ఒకటి ఆధారపడి అనుసంధానమై ఉంటాయి. భక్తితో కూడిన జీవితం శక్తి యుక్తి కలిగి భగవంతునిసేవలో రక్తిని, ఆనందాన్ని పొంది చివరికి ముక్తిని పొందటానికి హేతువవుతుంది. ఈ విధంగా ఈ పంచవిధభావాలను ఒకదానినొకటి అనుసంధానం చేసుకుంటే మానవజీవితం ఆనందమయం అవుతుంది. విజయం వెన్నంటే ఉంటుంది.

**ప్ర) కైలాసం వెండికొండపై ఉందంటారు. వివరణ ఇవ్వండి?**

**జ)** శివపార్వతులు నివసించు పర్వతమే కైలాసగిరి. దీనికి మేరు, సుమేరు, సుషుమ్న, హేమాద్రి, రత్నసాను, కర్ణికాచలము, అమరాద్రి, దేవపర్వతము, గణపర్వతము, రజతాద్రి మొదలుగాగల పేర్లున్నాయి. ఇది స్వయంభువు. దీని వర్ణన పురాణాల్లో కనిపిస్తుంది.

రజతాద్రి సత్యమునకు, జ్ఞానమునకు, బ్రహ్మానందమునకు నిలయమై, సచ్చిదానందమై వెలుగొందుతుంటుంది. ఈ రజతాద్రిలో ఓంకారనాదం పర్వతసానువుల్లో ప్రతిధ్వనిస్తూ చూపరులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. భక్తులు పరమేశ్వరుడు తాండవమాడుతున్నట్లు అనుభూతిని పొందుతారు. ఈ పర్వతం తూర్పున స్ఫటికచ్ఛాయతోను, దక్షిణమున ఇంద్రనీలముగాను, పశ్చిమాన మాణిక్యకాంతితోను, ఉత్తరాన స్వర్ణకాంతితోను వెలుగుతున్నట్లు వర్ణించబడింది. పర్వతశిఖరంపై సూర్యకాంతి ప్రసరించినప్పుడు బంగారువర్ణంతో, పున్నమిచంద్రునికాంతులు ప్రసరించినప్పుడు ధవళచ్ఛాయతో వెండికొండవలె ప్రకాశిస్తుంటుంది. మంచుకొండల్లో ఉండి మంచుచేత ఆవరింపబడి ఉన్నందున ఇది సూర్యకాంతితో వెండికొండవలె భాసిస్తుంది. పరమేశ్వర ఆవాసమైన కైలాసశిఖరం మంచుకొండగా పిలువబడుతూ వెండికొండవలె ప్రకాశిస్తుంటుందని చరిత్ర మనకు చెప్తోంది.



# శ్రీవేంకటేశ్వర అవతార విశేషాలు

– శ్రీ నీలంరాజు రాధాకృష్ణమూర్తి,
99638 03015

శ్రీమహావిష్ణువు వైకుంఠంను వీడి, లక్ష్మీదేవికొరకు వెదకుతూ భూలోకం చేరి, వల్మీకంలో ఉండి ఆవుపాలను త్రాగి, కొంతకాలానికి శ్రీవకుళమాతముద్దుబిడ్డయై, కోరిన పద్మావతిదేవిని పెండ్లి చేసుకోవటానికి కావలసిన ధనంకోసం కుబేరునివద్ద ధనం ఋణంగా తీసికొని, గరుత్మంతునితో సకల దేవతలందరికీ శుభరేఖలు పంపి, అంగరంగవైభవంగా అందరి సమక్షంలో ఆకాశరాజు పుత్రిక శ్రీపద్మావతిదేవిని పరిణయ మాడి, ఆరునెలలు అతిథులుగా అగస్త్యమునిఆశ్రమంలో ఉండి, పిమ్మట ఏడుకొండలపై ఉండి, కోటానుకోట్లభక్తులకు వారి వారి సకలాభీష్టాలను తక్షణమే తీరుస్తున్నాడు.

భక్తుల కామక్రోధాదుల్ని సంహరింపజేసి, భక్తివైరాగ్య ములనిచ్చి, ఐహికాముష్మికఫలములనిచ్చువాడై, శ్రీనివాసచక్ర వర్తియై, అనంతవేదములతో తెలియజేయబడి, చక్షురాదీంద్రియ ములకు అగోచరుడై, నిత్యముక్తుడై, శేషాచలపర్వతంపై కొలువు దీరి ఉన్నాడు.

శ్రవణమాత్రంచేతనే పాపాలను పోగొట్టి, ఆ స్వామిని తిరిగి తిరిగి మననం చేసుకోవటంవల్ల పుణ్యవృద్ధి చేసే వాడయ్యాడు.

స్వామి తనకుతానే స్వచ్ఛమైన మత్స్యరూపం దాల్చి హయగ్రీవుడనే రాక్షసుడు తీసుకుపోయిన వేదాలను తిరిగి చతుర్ముఖబ్రహ్మకిచ్చాడు. మరియు స్వర్ణమయమైన మందర పర్వతం పాతాళలోకంలో ప్రవేశించటంవల్ల, భగవానుడు కూర్మరూపందాల్చి దానిని తనవీపుపై ఉంచుకొని అవలీలగా పైకి తేవటవల్ల దేవాసురులు క్షీరాబ్ధిని మథించి అమృతం సంపాదించారు.

పూర్వం దేవతలు విరోధియైన హిరణ్యాక్షుడనే దానవుడు తన వెయ్యిచేతులతో భూమిని లాగగా అది నీటిలో మునుగుతుండగా గమనించిన శ్రీమన్నారాయణుడు వరాహ రూపం దాల్చి అతణ్ణి సంహరించి, భూమిని రక్షించాడు.

ప్రహ్లాదుని సంతోషపరచి భక్తులయందు వాత్సల్యం గలవాడై భక్తరక్షకుడయ్యాడు. మరొకసారి అందమైన బ్రాహ్మణ వేషధారియై, వామనరూపియై బలిచక్రవర్తిచేత ఆకర్షితుడై ఆయనను మూడడుగులమేరకు భూమినడిగి, అతనిని పాతాళమునకు త్రొక్కి, దేవేంద్రునికి త్రైలోకాధిపత్యం ఇచ్చాడు.

పూర్వం భృగువంశమున జన్మించి పరశురాముడై ఇరవైఒక్కమార్లు తనగొడ్డలితో బలదర్పముగల దుష్టక్షత్రియు లను సంహరించి జగత్తునకు మేలు చేశాడు. సాధురక్షణ, దుష్టశిక్షణ ప్రధానమై శ్రీమన్నారాయణుడు సేతుబంధనాదులను చేయటానికి రావణాదులను సంహరించటానికి సూర్యవంశంలో, రఘుకులంలో కౌసల్యాదేవికి రాముడుగా అవతరించి, ఏకపత్నీ వ్రతుడయ్యాడు. పిమ్మట, వసుదేవుని పుత్రుడై, యాదవులలో ఉత్తముడై, దేవకీతనయుడై, ఆనందరూపుడై గోపబాలురతో ఆడుకొని యశోదాదేవికి ముద్దుబిడ్డడయ్యాడు.

తర్వాత ఒకానొకసమయంలో గోవులకు, గోప బాలురకు రక్షణ కల్పించటానికి, గోవర్ధనగిరిని తన చిటికెన వ్రేలుపైనెత్తి గోవర్ధనగిరిధారయ్యాడు ఆ కృష్ణయ్య. ద్వాపర యుగంలో కుచేలుడు శ్రీకృష్ణపరమాత్మవద్దకు వెళ్లి ఆ మహానుభావునితో అతిథిమర్యాదలు పొంది శ్రీమంతుడయ్యాడు. పిమ్మట కంసాదులను సంహరించటానికి, రావణాసురులను

కడతేర్చటానికి, పాండవులనుద్ధరించటానికి, చివరకు జగత్తు నంతటిని మోహింపజేసేవాడయ్యాడు.

సత్యభామాదేవికి పతి, భీమార్జునులకు గురువు, ద్రౌపదీరక్షకుడు, వ్యాసరూపుడు, అర్జుననకు సఖుడు, యదుకులోత్తముడైన కృష్ణరూపియై శ్రీనివాసుడయ్యాడు. అనసూయాదేవికి అత్రిమహర్షివలన ముగ్గురుపుత్రులు కలిగారు. వారే భాగవత్స్వరూపులైన 'దత్తుడు', రుద్రస్వరూపుడైన 'దుర్వాసుడు', నిష్ణుడైన 'సోముడు' మరియు చేతియందు సుధా పూర్ణమైన కలశమునందుకొని "ధన్వంతరి'గా అవతరించాడు.

ఓ వేంకటేశా! సకలదేవతలతో ప్రతినిత్యము స్తుతింప బడే నీ దివ్యచరణారవిందములు చాలా ప్రశస్తములైనవి మరియు పరిమళములు వెదజల్లేవిగా ఉన్నాయి. కలియుగంలో బ్రాహ్మణకుటుంబంలో పుట్టి జీవనం బహు కష్టమై గడుపుతున్న విష్ణుశర్మ శ్రీవేంకటేశ్వరుని శరణుకోరగా సర్వసౌఖ్యాలనిచ్చి రక్షించావు. అంతేగాక శ్రీసూతమహర్షిని శౌనకాదులు పూర్వ మడిగిన ప్రశ్నకు బదులుగా శ్రీవేంకటాచలయాత్రకేగి ఆ పరమాత్ముని అనుగ్రహం పొందమని ఉపదేశించాడు.

అశ్వారూఢుడు కల్కిమూర్తియైన శ్రీహరి అధర్మాసక్తుడు, భగవద్విరోధియగు 'కలి'ని సపరివారంగా వధించి తన భక్తులయందు జ్ఞాన, భక్తి, ధర్మములను స్థాపించుచున్నాడు.

ఓ శ్రీవేంకటేశా!! స్వామీ! నీవు అనంతరూపములు, అనంతనామములు, అనంతచరిత్రలు కలిగియుండి, భక్తుల దురితములను పోగొట్టువాడవై, భక్తిపూర్వకంగా నమస్కరించి, నిన్ను మనస్సులో ధ్యానించినంతమాత్రముననే మహదైశ్వ ర్యముల నిచ్చుచున్నావు. ఎవ్వనిచే సమస్త తత్త్వములు మరియు ఎవ్వనిచే సమస్త జగత్తు అధీనమైయున్నదో మరియు సమస్త ప్రాణులు లయకారమునందు బ్రహ్మాదుల కాశ్రయమైన పర బ్రహ్మమును పొందుచున్నారో అట్టి నీ పాదపద్మములయందు ధ్యానముంచి భక్తులందరూ శరణాగతిని పొందుతున్నారు.

గేయం

# దైవాసురసంపదలు-16

స్వభావరీత్య మనుజులు రెండు రకములు
ఒకరివి దైవీగుణములు మరొకరివి దైత్యస్వభావాలు!!

భయరాహిత్యము, తపము, ఆత్మనిగ్రహము,
సరళత్వము, సత్యము, అహింస, త్యాగము,
శాంతము, శుచిత్వము, దయాగుణము, ధైర్యము,
జ్ఞానసాధనము, సిగ్గు, స్వీయపవిత్రీకరణము!!

దానము, యజ్ఞాచరణము, క్రోధరాహిత్యము,
మృదుత్వము, స్థిరత్వము, క్షమాగుణము, తేజము,
వేదాధ్యయనము, అనసూయ, నిరాడంబరము,
దైవీగుణములు. ఇవి మోక్షమునకు అనుకూలము!!

అహంకారము, కోపము, అజ్ఞానము,
దురభిమానము, డంబము, క్రూరత్వము,
పరుషత్వము, గర్వము, మదము, మాత్సర్యము,
అసుర లక్షణములు. అవి బంధాలకు మూలము!!

ఈ జగత్తు అసత్యము. లేదు ఆధారము
నియామకుడే లేడు. దీనికి మూలము కామము
సంగమాభిలాషతో అయినది ఉత్పన్నము
ఇంద్రియార్థములకోరు అసురభావజాలము!!

అసురులుగ్రకర్మలందు నియుక్తులగుదురు
అధర్మమార్గములలో ధనార్జన గావింతురు
గర్వముతో యజ్ఞయాగాదులు చేయుదురు
ఇంద్రియాసక్తులై నరకములో పడుదురు!!

బలదర్పముల, కామక్రోధముల నాశ్రయింతురు
దైవముపై అసూయతో ధర్మమును దూషింతురు
అసుర జీవజాతులలో మరలమరల జన్మింతురు
ఇంకా హేయమైనస్థితికి పతనమగుదురు!!


కామక్రోధలోభములు మూడునరకద్వారములు
ఆత్మ పతనమగుటకు ఇవి మూలములు
వీటిని తప్పించుకొన్న జనులు ధన్యులు
శాస్త్రనియమములు తెలిసి అగుదురు ఉన్నతులు!!

– డా॥ రెడ్డి సుబ్రమణ్యం గాడి, 98499 39637

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000



గతసంచిక తరువాయి..

దేవర్షి నారదుడాడిన మాటలను మునులు విని ఏం చేయాలి? ఎలా చేయాలని తమలో తాము తర్కించుకున్నారు. మూర్తిత్రయంలో మోక్షప్రదుడెవడని నిర్ణయించగల వారెవ్వరని వారిలో సందేహం పొడమింది. చివరకు ఆ పరీక్ష చేయగలవాడు భృగుడొక్కడే అని ఏకగ్రీవంగా తీర్మానించుకొని ఆ బాధ్యతను భృగువుకు అప్పగించారు.

భృగువు త్రిమూర్తులలో బ్రహ్మను మొదటివానిగా గుర్తిస్తారని ముందు సత్యలోకంవైపు అడుగులు వేశాడు. సత్యలోకం చేరుకున్నాడు. తపోజనులమధ్య ఉన్న బ్రహ్మను చూశాడు. బ్రహ్మ కూర్చోమని ఆదేశించకముందే భృగువు తానే ఒక ఆసనం అలంకరించాడు. ఈ చర్యను ఒక విధేయతగానే బ్రహ్మ భావించి భృగువుకు కనీస మర్యాదకూడా పాటించక పలకరించను కూడా లేదు.

తన్ను లెక్కచేయనివాడు. తనకేసి చూడనివాడు రజోగుణస్వభావుడని భృగువు నిర్ణయించుకొని 'ఈ భూలోకంలో బ్రహ్మకు ఆలయం లేకుండుగాక' అని శపించి కైలాసంవైపు అడుగులు వేశాడు. ఆ కైలాసంలో పార్వతీ పరమేశ్వరులు క్రీడాసక్తులై ఉండడాన్ని గుర్తించాడు.

ఒక ముని తాము ఏకాంతంగా ఉన్న సమయంలో సామాన్య లౌకికధర్మాలను కూడా లెక్కచేయకుండా రావడాన్ని చూసి పార్వతి సిగ్గుపడింది.

పరమశివుడు భృగుని చూసి కోపంతో సతీపతులు ఏకాంతంగా ఉన్నవేళల్లో రహస్యస్థలానికి రావచ్చునా? అని మనసులో తర్కించుకొని మునితో మాటాడక మారుమొగం పెట్టాడు. అలాంటిస్థితిలో భృగుడు శివునివాలకం పసిగట్టి తమోగుణ స్వరూపుడని లెక్కగట్టి ఆ మూర్తి మోక్షప్రదాత కాడని నిర్ణయించుకొని ఈ మూర్తికి భూలోకంలో శరీరపూజ లేదు. కేవలం లింగాకృతికే పూజ అని నిశ్చయించాడు.

ఆ పై వైకుంఠం వెళ్లాడు.

అక్కడ రమాసమేతుడైన శ్రీనివాసుని చూచి వక్షఃస్థలంపై తన్నాడు. అనుకోని పరిణామానికి హరి దిగ్గున లేచి మునికి ప్రణామం చేసి అర్ఘ్యాదివిధులతో పూజించి కూర్చుని తనను తన్నిన ముని పాదాన్ని తన తొడపై పెట్టుకొని చిరునగవుతో భృగువును చూస్తూ ఇలా అన్నాడు.

మునీశ్వరా! మీరు రావడాన్ని గుర్తించకపోయాను. ఊరక పాన్పుపై పడుకున్నాను. మీ పట్ల నేను అపచారినే. దయతో నన్ను క్షమించండి. నా అపచారానికి తగిన శిక్షవేశారు. ఇది నా కిష్టమే. కఠినమైన నా ఉరోభాగాన్ని తన్నడంకారణంగా మీ పాదాలకు నొప్పి పట్టిందేమో? అయినా నేను చేయగలిగింది ప్రస్తుతం ఏమీ లేదు. నాకు ఏ మాత్రం నొప్పి లేదు. మీ పాదాలు కోమలం. అంతేకాదు చిగురుటాకులా మృదులం. ఆ కారణాన నాకేమాత్రం నొప్పిలేదు. మీ పదఘాతం నాకు భూషణమే అంటూ పాదప్రక్షాళనం చేసి ఆ ముని పాదప్రక్షాళనతీర్థాన్ని తలపై చల్లుకొన్నాడు.

స్వామి! విప్రుల పాదధూళిని తల ధరించేవాణ్ణి నేను. మీ చరణం నా ఉరోభాగస్పర్శచేత పవిత్రమయింది అని శాంతంగా మాట్లాడుతుంటే భృగువు చల్లబడ్డాడు. ఆపై స్వామీ! త్రిమూర్తులలో నీవే శాశ్వత సద్గుణమూర్తివి. నీవు నిఖిలోన్నతుడివి. నిన్ను స్తుతించడానికి మాటలు చాలవు అంటూ వైకుంఠసీమ దాటి సరాసరి గంగాతీరంలోని మునుల దగ్గరికి వెళ్లి బ్రహ్మాదుల స్వభావాలను విశదీకరించి హరి ఒక్కడే శుద్ధ సత్వగుణ స్వరూపుడనే తన నిర్ణయం తెలిపాడు.

భృగువు మాటలతో మునులు చాలా సంతోషించారు. నారదుడాడిన మాటలు వారికి గుర్తుకు వచ్చాయి. సందేహం పటాపంచలయింది. సకల క్రతు పుణ్యఫలాన్ని నారాయణునికే అర్పించారు.

అది వైకుంఠం. భృగువు రావడం, కోపంతో హరి వక్షఃస్థలంపై తన్నడం. హరి తనకే బాధ లేదని మునికి సత్కారం చేయడంలాంటివాటిని కళ్లారా చూసిన లక్ష్మీదేవి భృగువు వెళ్లిపోయాక కస్సుమంది.

'పరబ్రహ్మస్వరూపుడవు నీవని నీ వక్షంలో స్థిరనివాసం చేశాను కాని ఈనాడు పరపురుషుడు తన్నగా నీవు ఆ మునినే చాల ఇష్టంగా భావించావు. భృగుని సత్కరించావు. ఇది నాకు జరిగిన అవమానం. ఈ అవమానాన్ని నేను సహించలేను. దూరప్రాంతాలకు వెళ్ళి నిన్నే తలచుకొంటూ తపమాచరిస్తానంది.

హరి లక్ష్మిని సముదాయించాలనుకున్నాడు. సిరి! ఆ ముని తన్నడంవల్ల శుభపరిణామాలే జరుగుతాయి అంటే లక్ష్మి

'బాగా చెప్పారు. నీవు ఆత్మలకు ఆత్మవు. విశ్వకారకుడవు. నిన్ను పూజించకుండా ఆవేశంతో వచ్చిన భృగువు కాలితో తన్నాడు. అయినా అతని నేరాన్ని నీవు అంగీకరించడం బాగాలేదు. పైగా సమర్థించుకుంటున్నావు' అంది.

లక్ష్మికోపాన్ని అర్థం చేసుకున్న హరి ఒక క్షణం ఊరకున్నాడు. "సిరి!" ఒక్కసారి ఆలోచించు. బ్రహ్మ నీ కుమారుడు. భృగువు విధాతకు తనయుడు. అంతరాలు తెలియనివాడు. అంతేగాదు. నేను పరమాత్ముడననే జ్ఞానం ఏ మాత్రమూ భృగునికి లేదు అనగానే అందుకు లక్ష్మి మునిపాదం సోకినచోట నేను ఉండడం తగదు. నీకు దూరమైన ఎక్కడైనా వెళ్ళి నిన్ను ఆరాధించడమే నీతిగా అనిపిస్తుంది. సరేనంటే ఇప్పుడే నేను వెళ్లిపోతాను అని చెప్పగా హరి సిరితో..

'నిజమే! విరించి నా కొడుకు. భృగుడు మనుమడు. బిడ్డకు బిడ్డడు. నేను ఆ మునిని చిన్నవాడిగానే లెఖ్ఖగడతాను. కడుపులోని బిడ్డ తన్నితే తల్లి బిడ్డపై కోపపడుతుందా' జీవకోటులను నా పొట్టలో దాచుకొన్న నేను కోపపడవచ్చా! అయినా భృగువు సామాన్యుడు కాడే. బ్రహ్మ కుమారుడు. బ్రాహ్మణుడు. తాపసోత్తముడు. అంతేకాదు తత్త్వవేది. నా పట్ల భక్తిగలవాడు. నాకు అత్యంతప్రియుడు. మరి నేను భక్తి పక్షపాతిని. అలాంటివాని చిన్నిచేతను పెద్దచేసి తప్పుపట్టడం న్యాయం కాదు. అన్నీ మరిచిపో. శాంతమతిలా ఎప్పటికిలానే ఉండు!' అని చెబుతున్నా లక్ష్మి శాంతించలేదు.

'ఏమయినా భృగువు నా దృష్టిలో పరపురుషుడే. పరపురుషుని స్పర్శ నాకు కంటగింపు. నేను ఆ చేతను సమర్థిస్తే పతివ్రతను కానే కాను అంటూ పతి భృగువు బ్రాహ్మణోత్తముడనడాన్ని తప్పుపడుతూ బ్రాహ్మణులకు శాపం పెట్టింది.

బ్రాహ్మణులు దేవతలకు శత్రువులయిన రాక్షసులకు ఆప్తులవుదురు గాక! దేవతలకు అహితులగుదురు గాక. నిత్య కర్మలు వీడి నీచులతో సహవాసం చేయుదురు గాక! పేదలవుదురు గాక! తమ విద్యలను అమ్ముకొందురుగాక! అని శపించింది.

ఎంత సమర్థించుకొన్నా నీ తప్పు ఒప్పుకాదు. విప్రుని దండించకుండడం తప్పు. నీవు పిరికివాడవని అందరూ చులకన చేస్తారు. ఈ కారణాన సామాన్యుడయినా, గొల్లవాడయినా నిన్ను కొట్టడానికి సాహసిస్తాడు. ఆడవారలయినా రాళ్లతో కొడతారు. ఏది ఏమయినా శాంతి నీకూ లేదు నాకూ లేదు. నేను నిన్నే సదా మనసులో ధ్యానిస్తూ ఉంటాను. అంతేగాని నీ సమర్థనలకు సై అంటూ మరల

## శ్రీపదకేళి

### :: 117 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 వి | జ | య | 2 ద | శ | 3 మి | | 4 పా | శాం | కు | 5 శ |
| శ్వ | | | స | | త్రు | | | | | ల్యు |
| 6 క | లి | | 7 రా | జ | రా | జ | 8 న | రేం | ద్రు | డు |
| ర్మ | | 9 నా | | | లు | | ర | | | |
| | | గు | | | | 10 కై | క | | 11 ర | మా |
| | 12 వా | ల | ఖి | ల్యు | లు | | చ | | జి | |
| | | చ | | | | | తు | | | |
| 13 దీ | | 14 వి | జ | 15 య | | 16 క | ర్ద | ము | డు | |
| 17 పా | ర్వ | తి | | శో | | | శి | | | 18 శ |
| వ | | | 19 సు | ద | 20 క్షి | ణ | | | | ము |
| ళి | | | | | తి | | 21 శ | మీ | కు | డు |

## 2025, నవంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | ప్రబోధనైకాదశి, పేయాళ్వార్ వర్షతిరునక్షత్రం |
| 02 | క్షీరాబ్దిద్వాదశి, కైశికద్వాదశి |
| 05 | శ్రీకపిలేశ్వరస్వామివారి అన్నాభిషేకోత్సవం, తిరుపతి సువర్ణముఖరీతీర్థముక్కోటి, రుద్రపాదాలు, కార్తికపూర్ణిమ, జ్వాలాతోరణం |
| 14 | బాలలదినోత్సవం |
| 17- 25 | శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవం, తిరుచానూరు |
| 17 | ధన్వంతరిజయంతి |
| 26 | శ్రీపద్మావతిఅమ్మవారి పుష్పయాగమహోత్సవం, తిరుచానూరు; సుబ్రహ్మణ్యషష్ఠి |

వక్షఃస్థలవాసిని కానే కాను అంది. తానెన్ని మాటలన్నా హరిలో మార్పు కనబడకపోగా ఆత్మాభిమానంతో లక్ష్మి కొల్లాపురానికి వెళ్లిపోయింది. అక్కడి వారలకు ఆరాధ్యదేవతయింది అని సూతుడు చెప్పగా శౌనకాదులు లక్ష్మీదేవి వెళ్ళాక వైకుంఠంలోనే స్వామి ఉన్నాడా? లేదా? లక్ష్మి వెళ్లిపోయిందనే దిగాలుతో ఎలా గడిపాడని అడిగారు. అందుకు సమాధానంగా సూతుడు తరువాతి వృత్తాంతం మొదలెట్టాడు.

లక్ష్మీదేవి కొల్హాపురానికి వెళ్లిపోయిన హరిలో విరహ తాపం హెచ్చింది.

**ఆ నారుదుడు వేంకటాద్రిలో లేదని బ్రహ్మతో చెప్పనేల**
**అజుడు నారదునితో మునులు దగ్గరికి వెళ్లమని ఆదేశించనేల**
**ముక్తిప్రద ఎవరనదాన్ని తెలుసుకోవడానికి భృగువురానేల**
**భృగువు కోపంతో వక్షంపై తన్ననేల**
**తనకు అవమానం జరిగిందని లక్ష్మి పంతంతో వెళ్లిపోనేల?**

కర్మగతిని ఎవరూ తప్పించలేరు. అయినా భౌతికంగా లక్ష్మి వెళ్లిపోయి ఉండవచ్చుగాని చంద్రబింబాన్ని వదలి చంద్రిక వెళ్లలేదన్నట్లు ఆ లక్ష్మి నాలో సౌభాగ్యలక్ష్మిగా నిలిచి ఉంది.

లక్ష్మీదేవి హృదయంలోనే నేను ఉంటూ, ఆ లక్ష్మిని తప్పక నా హృదయంలో నిలుపుకొంటాను అని అనుకొన్నాడు. ఆ పై తన సర్వజ్ఞత్వాన్ని దాచాడు. శ్రీరమావనితగురించి పట్టించుకోలేదని, నేను నిర్దయుడనని అందరూ ఆడిపోస్తారు కదా. లౌకిక జనవ్యవహారాలను ఆకళింపు చేసుకున్నాడు. రమాదేవి ఎక్కడుందో తెలుసుకోవాలి అని అనుకొన్నాడు. భూనీళను పార్షదులరక్షణలో ఉంచాడు. రమాదేవి అన్వేషణకు వెడుతున్నానని భూనీళాదులకు నమ్మబలికాడు. వైకుంఠసంరక్షణ చేయవలసిందిగా పార్షదులకు ఆన చేశాడు. ఆ తరువాత వైకుంఠం వదలి వెంకటాద్రి చేరాడని సూతుడు విశదీకరిస్తుండే శౌనకాదిమహామునులు వేంకటాద్రిమీద విష్ణువు ఎలా గడిపాడని ప్రశ్నించారు.

వారి ప్రశ్నకు సంతోషిస్తూ...

మునులారా! హరి శ్రీవరాహస్వామికి పుష్కరకవి దక్షిణంవైపున్న చింతచెట్టు మూలలోని పుట్టలో దాగాడు. ఎవరికీ కనబడకుండా వల్మీకంలోనే కలియుగందాకా ఉన్నాడు. స్వామి భూలోకవాసుడు కావడంతో చోళరాజ్యం సుసంపన్నమయింది. వానలు సకాలంలో కురిశాయి. పంటలు బాగా చేతికందాయి. ఆవుల క్షీరధారలు పెరిగాయి. పతివ్రతలయిన స్త్రీలు, సతివ్రతులయిన పురుషులు ఆనందంతో గడిపారు. మాతా పితృభక్తిగల కుమారులు పుట్టారు.

కొల్హాపురలక్ష్మి తన పతి హరి వైకుంఠం వదిలాడని భూలోకంలో వేంకటాద్రిలో ఒక చెట్టుదగ్గరిపుట్టలో దాగి ఉన్నాడని తెలుసుకొని వాపోయింది.

నా కోసం స్వామి వైకుంఠం వదిలాడు. పుట్టలో దాగాడు. ఏకాకి అయ్యాడు. ఆకలితో అలమటిస్తున్నాడు. ఇలాంటిసమయంలో నేను వెళితే స్వామి తప్పక నన్నేలు కొంటాడు అని ఒకవైపు చింతిస్తూ మరోవైపు నా పంతం నా పంతమే అంటూ భీష్మించుకుంది. *(ఇంకా ఉంది)*

### సత్త్వగుణప్రధానుల లక్షణాలు

**వీరు ప్రశాంతత, జ్ఞానము కల్గిఉంటారు. మరణానంతరం ఉత్తమకర్మల నాచరించే జ్ఞానులైన శ్రీమంతుల ఇళ్ళలో జన్మిస్తారు. లేదా ఉత్తమయోగుల ఇళ్ళలో జన్మించి ముక్తిని పొందుతారు. లేదా పుణ్యలోకాలను పొంది సుఖాలను అనుభవిస్తారు.**

# పోతన భాగవతంలో...
# బాలకృష్ణుని క్రీడావినోదములు

- డా॥ జి. హేమావతి, 76749 98612



**పోతన భాగవతంలో బాలకృష్ణుని క్రీడావినోదములు ఎన్నో! ఎన్నెన్నో!! అవేంటో చూద్దాం.**

వ్రేపల్లెలో బాలకృష్ణుణ్ణి సంహరించడానికి కంసుడు అనేకమంది రాక్షసులను పంపగా కృష్ణుడే వారందరినీ సంహరించాడు. అలా దుష్టులను సంహరించి శిష్టులను రక్షించడానికై లీలామానుషధారిగా అవతరించాడు. మహాభాగవతమునందలి సామాజికాంశాలు వేటికవే సాటి. కుచేలుడికథలో కడు పేదరికం కనిపిస్తుంది. ప్రహ్లాదుడికథలో సంపన్న వాతావరణం కనిపిస్తుంది. అవే భగవంతునిచుట్టూ నాట్యమాడుతూంటాయి. వినోదాన్నంతటినీ "హల్లీసకం" లేదా రాసక్రీడ అంటారు. పోతన భాగవతంలో "దశమస్కందం"లో బాలకృష్ణుని క్రీడావినోదాలను అత్యద్భుతంగా వర్ణించాడు. క్రీడలవల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికవికాసం పెంపొంది స్తుందని యోగశాస్త్రం చెబుతుంది. భాగవతంలో వర్ణించిన క్రీడా వినోదములివి.

1)రాసక్రీడ 2)కాళీయమర్దనం 3)మల్లయుద్ధవినోదాలు 4)చిత్రలేఖనం 5)సంగీతం

**రాసక్రీడ-** 15వశతాబ్దంనాటి ప్రజలకు చెప్పాలంటే జీవిత మంతా వినోదమే! వారు కృష్ణునితో కలసిమెలసి భుజించారు, ఆడుకున్నారు. పాడుకున్నారు. అతడు మాయమైతే అన్వే షించారు. మహాభాగవతంలో 'రాసము" అనే ఒక ప్రత్యేకమైన విధానం కనిపిస్తుంది. అనగా చుట్టూ గోపికలు మధ్యన కృష్ణుడు. దీనిని మండేల భ్రమణ చిత్రవిలాసం అన్నాడు కవి. భగవంతునికి అంతాకావచ్చు, మరి నరునికి ఇదంతా వినోదమా అనే సందేహం కల్గవచ్చు. దీనికి సమాధానం చాలా సులభం. భగవంతుడు నరుడిగా ఆవిర్భవించాడు. నరులు ఆయనతో నివసించసాగారు. అంత సాన్నిహిత్యం జీవునికి, దేవునికి ఉంది.

అట్లే కాంతా సువిలాసం అన్నాడు. చివర రాసము అన్నాడు. అనగా నర్తనం, నాట్యం ఇలాంటివి ఎలా నాట్య భేదాలో రాసముకూడా నాట్యభేదమై ఉన్నది. వలయాకార నాట్యమే దీని విశేషం. కృష్ణుడు మధ్యన ఉంటాడు. ఉంటూ కూడా నటిస్తాడు. మురళి వాయిస్తాడు. ఇలా గోపికలు కృష్ణునితో నాట్యం చేసే అదృష్టానికి నోచుకున్నారు. వారిది ధన్యమైన జన్మ.

గోపికాస్త్రీలందరూ నడుములు జవజవలాడగ, చిరునవ్వులు హెచ్చుచుండగ మెడలోని దండలు అలా బెదరి చిక్కుపడగ, మొలనూళ్లు సడలగ, చూపులు నిగనిగలాడు చుండగా, ముంగురులు మోముపై ఆవరించి కదలి ఆడగా, చెమటలు కక్కగా చెవియందలి ఆభరణములు తళతళ మెరయగా, ఆ బింబాధరలు నీలిమబ్బులనడుమ మెరుపు తీగల్లాగా దీపిస్తూ ఒక్కొక్క కృష్ణునితో కూడుకొన్నవారై ఉల్లాసంగా ఆడారు. పాడారు. ఇలా ఆనాటి వినోదాలు మనో హరంగా వర్ణించబడ్డాయి. ఇంకా పలుసందర్భాల్లో బమ్మెర పోతన నాట్యవాతావరణాన్ని ఛాయాచాయిగా తెలిపారు.

**కాళీయమర్దనం-** మహాభాగవతంలో ఈ ఘట్టం చిత్రమైనది. చాలాకాలంనుండి కాళీయుడనే సర్పం కాళింది (యమున)లో సంచరిస్తోంది. క్రిమికీటకాదుల్ని మింగివేస్తోంది. హఠాత్తుగ వచ్చి కాటువేసి కబళిస్తోంది. ఒక సర్పమే కాదు. దాని సంతానం కూడా ఉంది. దాన్ని సంహరించడం బ్రహ్మతరంకూడా కాదు. దాని పడగ విశాలంగా ఉంది. రోజూ యమునాజలమంతా

సంచరిస్తోంది. చాలామంది యాదవులు, యాదవేతరులుకూడా కాళీయసర్పం చేసే ఆగడాలు పరమాత్మకు విన్నవించారు. అదివిని కన్నయ్య తిన్నగా యమునకు వెళ్లాడు. ఈతలు కొడుతూ కాళీయసర్పంపై చాలాసేపు నాట్యం చేశాడు. ఇది చిత్రాతిచిత్రమైనది. అర్భకుడేమి! పాము పడగపై చేసే నాట్యమేమి! అందరు విచిత్రంగా చూశారు. పరమాత్ముడుకూడా నాట్యం చేసినంతసేపు చేసి పామును సంహరించాడు. ఆనాటినుంచి జనులు స్వేచ్ఛగా నిర్భయంగా ఉన్నారు. మర్దనం



అనగా మర్దించటం, సర్పాన్ని మర్దించటం. అది చావటం ఒక అదృష్టవిశేషం. మునుపే చెప్పుకున్నట్లు రేణువునుంచి మేరువువరకు భగవంతుడు వ్యాపించి ఉన్నాడు. భగవత్సన్నిధిలో మృత్యువు మోక్షానికి మార్గం! ఈనాడు అక్కడ సర్పమంటే ఇక్కడ పరిగెత్తడమే. ఇక్కడ తేలంటే అక్కడ దాక్కోవడమే. అంటే విషప్రాణికి జనం బాగా భయపడుతున్నారన్నమాట! భయమే దేహారోగ్యాన్ని సగభాగం క్షీణింపజేస్తుంది. ఆనాడు ఏ చిన్న బాధ కల్గినా ప్రజలు కృష్ణపరమాత్ముణ్ణి ఆశ్రయించేవారు. ఆయన వారి బాధల్ని తక్షణమే నివారించేవాడు. భగవంతునికి అంత సన్నిహితంగా ప్రజలు, ప్రాణులు జీవించటం, మోక్షాన్ని పొందటం మహాభాగవతంలో కనిపిస్తుంది. ఈ ఘట్టమంతా చూపరులకు వినోదం. పామరులకు భయం భయం!

**మల్లయుద్ధవినోదాలు-** కువలయాపీడుడు అనే గజాన్ని శ్రీకృష్ణుడు అలవోకగా సంహరించాడు. మునుపే పేర్కొన్నట్లు భగవంతునికి సాధ్యాసాధ్యాలేవి ఉండవు. అంతా సంకల్పాన్ని బట్టి సాగిపోతుంది. కంసుడు మల్లయుద్ధరంగమును సిద్ధం చేయించిన క్రీడారంగము రాళ్లు, పుట్టలు, బురదలు లేనిదిగా ఉంది. ఆ మైదానం విశాలంగా ఉంది. బంగరువన్నెమట్టితో చేయబడింది. కస్తూరిజలంతో తడుపబడింది. దానిచుట్టూ మంచిగంధపు కర్రలున్నాయి. వాటికి పూలదండలున్నాయి. ధ్వజస్తంభాలున్నాయి. పతాకములతో అలంకృతమై ఆ మల్లరంగ మైదానం ఒక క్రీడారంగస్థలిగా కనిపించింది. అంతేగాక వాయిద్యాలు, మిట్టపల్లాలు, ముండ్లు లేకుండా ఉంది. లోకులందరికి వినోదాన్ని పంచిపెట్టేవిధంగ ఉంది. వేయేలా! ఆ మల్లరంగ మైదానం ఒక మహానుభావుని మనసులా ఉంది అని బమ్మెర పోతన అన్నాడు. అక్కడికి కృష్ణుడు వచ్చాడు. ఏనుగుతో పోరాటం. అందరు చిన్న చిన్న మృగాలతో కుస్తీపట్టారు. కృష్ణుడు మాత్రం ఏనుగుతోనే యుద్ధంచేశాడు. చూపరులకు ఎంతో ఉల్లాసం. అంచెలంచెలుగ యుద్ధంలో తొండంతో పెనవేసుకుని పెనుగులాడి ఆ ఏనుగు డస్సిపోయింది. కృష్ణుడు అదే అవకాశంగా కాలితో త్రొక్కి చేతితో దాని దంతాలు ఊడబెరికి బక్కచిక్కునట్లు చితకబాది ప్రాణాలు తీశాడు. ఇదంతా ఒక భయంకర దృశ్యం. ఏనుగంటే భయం. ఏనుగుతోనే యుద్ధం చేయడం మరీ భయంకరం. మైదానంలో అందరి కళ్లముందు గజం మరణించడం భయమే గాక ఆశ్చర్యం!

ఏమైనప్పటికీ శాపవశాన ఆ గజం కృష్ణునిచేతిలో మరణించింది. మరణమైనా సరే అది వినోదమే కదా. అట్లే తక్కిన విషసర్పములు మరణిస్తే ఎంతో హాయి. ఇక్కడ సాక్షాత్తు ఏనుగుతో పోరాటమంటే అల్పవిషయం కాదు. కృష్ణుడుకూడా బాలుడుగానే ఉన్నాడు. అయినా కుంజరాన్ని లీలగా భంజించాడు. ఇలాంటి వినోదాలు ఒకటా రెండా. సంధ్యాన్వేషణం ఒక వినోదం! అఘాసురసంహారం మరొక వినోదం!

గోపికల స్నానాలు! కృష్ణుడు వారి వలువలు అపహరించడం, కడిమిచెట్టుమీద దాక్కోవడం! గోపికలు అభ్యర్థిస్తే తిరిగి ఇవ్వటం జరిగింది. ఇదంతా వినోదం కాక మరేమవుతుంది. మానవునికే ఇది వినోదం! భగవంతునికి చెప్పనక్కరలేదు. యశోద మద్దిచెట్టుకు కృష్ణుని త్రాటితో కట్టి బంధించింది. ఎందుకంటే గోపికలు తమ ఇళ్లలో పాలను, పెరుగును అపహరించాడని చెప్పారు. అందుకు శిక్షగా 'యములార్జున భంజనం' అనే కథలో పోతన మనోజ్ఞంగా వర్ణించాడు. అంతేగాకుండా కృష్ణుని నోరు తెరువుమని యశోద కోరగా అక్కడ సమస్తవిశ్వం కనిపించింది. ఆమెకూడా భయపడింది. తరువాత విశ్వరూపాన్ని నోటిలోనే ఉపసంహరించుకున్నాడు. ఇంతకుమించిన వినోదం మరేముంటుంది! కావున, దశమస్కందంలో ఏ ఘట్టం చూచినా పరమమనోహరంగా బమ్మెరపోతన మాత్రమే దశమస్కందము రచించడానికి అర్హుడు.

మల్లుడు, చాణూరుడు అనే రక్కసులు కృష్ణునిమీదకు వచ్చారు. అంతేకాదు కవ్వించారు. రెచ్చగొట్టారు. రెండు కార్చిచ్చుల్లా, రెండు సింహాల్లాగా ఒక కృష్ణునితో తలపడ్డారు. చాణూరుని కాలిని తన కాలితో జంకక కీలుని విరిచి సంహరించాడు. ఇలా కొందరురాక్షసులు శాపాలనుబట్టి కృష్ణుని చేతిలో మరణించారు. అది పైకి శాపమే కాని నిజానికి అది వరం. దేవునిచేతిలో మరణించటం మోక్షానికి మార్గం. ఇలా తీసుకుంటే చాలా ఘట్టాలు వినోదాలుగ ఉన్నాయి. రాసం అనే నాట్యం వినోదాలకే వినోదం! కవియే చెప్పినట్లు అదొక చిత్రవిలాసం. కారణం కాంతా సువిలాసమై ఉంది. ఇంతకన్నా వినోదం మరేమైనా ఉందా!


**చిత్రలేఖనం-** భాగవతంలో కనిపించే ఆకర్షణీయమైన కళ చిత్రలేఖనం. అంటే ఒక బొమ్మను పలుమార్లు గీచి సంతృప్తి పడక పరిపక్వత వచ్చేదాకా ఆ బొమ్మను పలుమార్లు గీయాల్సిందే! గీచిన తర్వాత దాచుకోవచ్చు. ఒక మనిషిని చూచి ఇప్పటిలాగా ఫోటోలు తీసేవిధానాలు అప్పుడు లేవు. మనిషిని చూచి చిత్రలేఖకుడు అప్పటికప్పుడే అతనిబొమ్మను గీస్తాడు. తర్వాత తుదిమెరుగులు దిద్దుతాడు. ఈ విధానం భాగవతంలో రుక్మిణీకల్యాణం, ఉషాపరిణయంలో కనిపిస్తుంది. బొమ్మను చూచి, గుణగణాలు చూచి, వంశమర్యాదలు పాటించి ఆనాటి వివాహాలు జరిగేవి. శిశుపాలుడు ఎంత అడ్డగించినా కృష్ణుడు తరిమికొట్టి రుక్మిణినే పరిణయమాడాడు. బొమ్మ లేకుంటే కృష్ణపరమాత్మను వీక్షించే అవకాశం రుక్మిణికి లేదు. అగ్నిద్యోతనుడు లేకుంటే పరస్పరగుణాలు తెలిసేవికావు. వీరిది అష్టవివాహాలలో రాక్షసవివాహమని ఒక భేదం. ఆ ప్రకారంగా బొమ్మను చూచి కృష్ణుడు రుక్మిణి పరస్పరం వరించారు. వివాహం చేసుకున్నారు. దీనికంతా కారణం చిత్రమే. ఈ చిత్ర లేఖనవిద్యనుబట్టి చాలా చాలా చమత్కారాలు చేశారు ఒక కవి. "ఎన్నిసార్లు గీస్తే ఒక చిత్రం", "ఎన్నిసార్లు చెక్కితే ఒక శిల్పం", ఎన్నిసార్లు చస్తే ఒక జీవితం" అన్నాడు. మరణం అనగా కష్టం అని అర్థం. అంటే బొమ్మకు కుంచె, రంగులు మున్నగువాటితోపాటు చిత్రలేఖనానికి ఎంతో కళాచాతుర్యం ఉండాలి. అప్పుడు ఈనాటిలాగా పోటీలు లేవు. నిన్న మొన్నటి దాకా ఛాయాచిత్రాలు లేవు. బొమ్మలు లేవు. నేడు అత్యధికంగా బొమ్మలున్నాయి. మొత్తానికి బమ్మెర పోతనకాలంనాటి ప్రజలు చిత్రాలు గీస్తూ, వినోదిస్తూ హాయిగా జీవితాలను గడిపారు.

**సంగీతం-** సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, కవిత్వం ఈ చతుర్విధకళలు లలితకళలుగ ప్రసిద్ధినొందాయి. బమ్మెరపోతన కాలంనాటికి వీణావిద్య అమోఘంగా విస్తరించింది.

తుంబురుడు విష్ణుదేవుని కొలువు కూటంలో తన వీణాగానం చేశాడు. రుక్మిణి, సత్య భామలు సంగీత కళలో నిష్ణాతులు. ఈ విధంగా పోతన భాగవతంలో క్రీడా వినోదాలను మనోహరంగా వర్ణించాడు.



ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం...)*

అనిన రీతిగ పరావరతత్త్వముల యథార్థస్వరూపజ్ఞులైన శుకాది పరమయోగులును, ప్రహ్లాదాంబరీషాది మహాభాగవతులును ఈ తిరుమలకొండను భగవంతుని దేహముగనే తలచి పాదస్పర్శార్హమగు భూమియైన తిరుమల యడివారమునందే నివసించుచు భగవదనుభవము చేయుటయనెడు శిష్టాచారము స్కాంద వామనాది పురాణములందు సువ్యక్తముగ కన్పించుట వలనను 'మయర్వఱ మదినల మరుళ్పెత్త' (అజ్ఞాన గంధము లేని జ్ఞానభక్తులను అనుగ్రహింపగా పొందిన) అనిన చొప్పున భగవన్నిర్హేతుక కృపాపాత్రులైన ఆళ్వారులుకూడ 'వేంగడత్తైప్పేశు' అని భగవంతునకును శేషాద్రికిని అభేదమే అనుసంధించి 'వానవర్ వానవర్కోనొడుం' 'శుమందు మామలర్ నీర్ శుడర్ దూపంకొండు నమన్టెళుం దిరువేంగడమ్', 'విణ్ణోర్ తోళువదుమ్' (నిత్యసూరులు, సేనాపతితోడను), (మంచిపుష్పములు, తీర్థము, దీపము, ధూపము కొనివచ్చి సేవించు (శ్రీవేంకటాద్రి) దేవతలు కూడ అరాధించు ఇత్యాదులచేత నిత్యసూరి సంసేవ్యమనియు, 'ఆనై వెరులి అఱవొదుఙ్గుం వెఱ్పు' (ఏనుగు భయపడి నిలువగా పాములు దాగెడి కొండ), 'ఇళైప్పన్ తిరుక్కూడల్ కూడత్తామి రుంద తిరుమలై' (భగవంతుని కూడుటకై 'కూడల్వళైప్పు' వ్రాసెదను అనుచున్న వేంకటాద్రి) అనియు, 'శెఙ్గయల్ తిళైక్కుమ్శునై తిరువేంగడమ్' (మేలైన చేపలు విహరించెడు సోనలుగల శ్రీవేంకటాచలమును ఓ మనసా! ఆశ్రయింపుము) అనియు ఒకసారి చెప్పినట్లుగా తొమ్మిదిసారులు వీరే పరమప్రాప్యులని తమ శ్రీహృదయమునుద్దేశించి ఉపదేశించియు, 'పరన్ శెన్రుశేర్ తిరువేంగడమామలై ఒన్రుమే తొళనమ్ వినై ఓయుమే' (పరమాత్మ వచ్చిచేరిన శ్రీవేంకటాచల మనెడి శ్రేష్ఠమగు శైల మొక్కదానిని సేవించినచో మన పాపములన్నియు తీరిపోవును) అని తమ సర్వానర్థములకు వీరే నివర్తకులనియు, 'తిరువేంగడం నఙ్గట్కు శమఙ్గొల్ వీడుతరుమ్ తడఙ్గున్దమే' (శ్రీవేంకటనగము పరమసామ్యప్రాప్తిరూపమైన మోక్షము ప్రసాదించెడు సువిశాల శైలము) అని వీరే మనలబ్ధికి మోక్షమునకు ఉపాయభూతులనియు, పరోపదేశము చేయునపుడును 'శెన్రు వణఙ్గుమినో శేణుయర్ వేంగడత్తై' (ఆకాశమును తాకునట్లుగా ఎత్తైన శ్రీవేంకటాచలమునకు పోయి ప్రణమిల్లుడు) అనియు, వీరే సమస్త చేతనులకును పరమప్రాప్యులని 'వేంగడమే అనియు, వీరే అందరకును ఆపద్ధనమనియు, 'వేంగడమేమెయ్వినైనోయ్ తీర్పమవుమ్' (వేంకటాద్రియే ఆధివ్యాధులను పోకార్పగలది అనియు, 'పదియదు వేత్తి ఎళువదుపయనే' (ఆ తిరుపతిని స్తుతించి యుజ్జీవించుట సత్ఫలము) అనియు, 'వలఞ్జెయ్దు నాళుమ్ మరువుదర్ వళక్కు' (ఆ తిరుపతిని ప్రతిదినము ప్రదక్షిణము చేయుచు పొందియుండుట సత్సంప్రదాయము) అనియు, 'తొళక్కరుదువదే తుణివదు శూదు' (నమస్కరింప నుద్దేశించుటే ఒక మంచి యుపాయము) అనియు, ఈ మున్నగు వచనములచే ఈ తిరుమలయే స్తుతిప్రణామాదులచేత ఆరాధ్య దేవతయనియు ఉపదేశించి, ఇట్లు భగవంతునివలె సర్వ ప్రకారములచేతను ప్రాప్యమై, అప్రాకృతమై,. 'తిరుమలై ఆళ్వార్' అని వ్యవహరింపబడు ఈ పర్వతమును 'ప్రాకృతమైన


నీకంటే పెద్దవారిని గౌరవించడం నేర్చుకో. అప్పడే నీకు పెద్దరికం వస్తుంది.

శరీరము తోడ స్పృశింపము' అని తలచి, ఆ తలంపుతోడనే తిరుమల యడివారమునందేయుండి శ్రీ వేంకటేశ్వరుని మంగళాశాసనము చేయుచుండుటవలనను, వీరి దివ్యోద్దేశమును అనుసరించి శ్రీభాష్యకారులు ఆళ్వారులను తిరుమలకొండపైన అర్చారూప ముగ శ్రీప్రతిష్ఠ చేయింపనందువలనను, ఆళ్వార్ శ్రీదేవివలె బాల్యమునుండి ఆకారత్రయాద్యష్టగుణసంపత్తి కలిగియుండుట వలన శ్రీమన్నారాయణుని దివ్యమంగళ విగ్రహమును అను భవించునపుడు స్వస్వరూపమును విడనాడి ఒక దేవీదశను పొంది బహుభంగులతోడ అనుభవించుటవలన 'నప్పిన్నైకొల్ నిలమామకళ్ కొల్ తిరుమకళ్ కొర్ పిఱన్దిట్టాళ్' (నీలాదేవియో, భూదేవియో, లక్ష్మీదేవియో అవతరించినారు) అనినతీరుగా లక్ష్మీప్రభృతులైన దివ్యమహిషులలో వీరు నొక్కరు అని వికల్పింపదగియుండుటచేతను,

**భోగ్యా వామపి నాంతరీయకతయా పుష్పాంగరాగై స్సమం**
**నిర్వృత్త ప్రణయాతి వాహనవిధౌ నీతాః పరీవాహతామ్,**
**దేవి త్వామను నీలయా సహ మహీ దేవ్యస్సహస్రం తథా**
**యాభిస్త్వం స్తనబాహుదృష్టిభి రివ స్వాభిః ప్రియం శ్లాఘసే.**

(ఓ లక్ష్మీదేవీ! మీ ఇరువురికిని (లక్ష్మీనారాయణులకు) తప్పక యుండవలసిన భోగ్యవస్తువులైన మాలికా చందనాదుల వలె భోగ్యవస్తురూపలై ప్రేమ పరిపూర్ణమై పొంగి ప్రవహింపగా ఆ ప్రేమప్రవాహపు పరీవాహరూపమును అనగా, పొంగి పొరలిన ప్రవాహరూపమును పొందిన నీలాదేవితోబాటు భూదేవియు అట్లే వేలకొలది ఇతర దేవేరులును నిన్ను అనుసరించుచున్నారు. నీవేయగు స్తనములు, బాహువులు, కటాక్షములువలెనున్న ఆ భూనీలాదులతోడ నీవు నీ ప్రియుని సంతోషపెట్టుచున్నావు.)

అని నుడివినరీతిగా లక్ష్మీదేవి తన కుచములతోడను తక్కుంగల దివ్యావయవములతోడను పూవులు మైపూతలతోడు ఇతర దివ్యమహిమలతోడను భేదమే లేకుండ భగవంతుని ఆనందింపజేయునట్లుగ ఆళ్వారులతోడ భగవంతుడు అనుభవించినపుడు తానుకూడ ఆ యనుభవ పరిపాకమునకు దేశికయై ఆ భోగరసమును వర్తింపజేసి భగవంతుని దివ్య హృదయమును ఆహ్లాదపరచెడు వాల్లభ్యాదిగుణవిశిష్టయగుట చేతను

**యదా యదా హి కౌసల్యా దాసీవచ్చ సఖీవ చ**
**భార్యావ ద్భగినీవచ్చ మాతృవచ్చావ తిష్ఠతే**

అన్నట్లు కౌసల్యాదేవి దశరథమహారాజు విషయమున ప్రేమాతిశయముచేత అనేక ధర్మములకు ఆశ్రయమైయుండి యానందమును కలిగించినట్లుగ శ్రీదేవియు అట్లే స్వామి విషయమున ప్రీత్యతిశయముచేత 'నుంగలాన్యభిదుధ్యుషీ' (మంగళవచనములు పలుకుచున్నదై) అనియు 'స్మారయే త్వాం న శిక్షయే' (జ్ఞాపకము చేయుచున్నానేగాని ఆజ్ఞాపించుట లేదు) అనియు ఇట్టి అనేక ధర్మములను అనుష్ఠించి చూపునట్టి దగుటచేతను, ఇచ్చోటకూడ ఆళ్వార్ భగవద్విషయమున చూపెడి ప్రేమ ఉన్మస్తకమై 'పరిచిక్షేప రాఘవమ్' అన్నట్లు ప్రణయకోపముచేత కూర్చి చెప్పెడి గీతములను అనుసరించి భగవంతునకు లీలారసము ప్రవర్తిల్లజేయగలవు కావునను ఆళ్వారులకు ప్రతినిధియై ప్రధానమహిషియు, 'లక్ష్మీప్రియసఖీం దేవీమ్' అనియు, 'మణ్మకళుమ్ తిరువుమ్ నిళల్ పోల్వనర్ (భూదేవియు శ్రీదేవియు నీడవంటివారు) 'ఛాయా మివాభ్యుద యినీ మవనీం చ తస్యాః' అనియు ఇత్యాదులందు చెప్పిన విధముగ ఆమెతోడ ననపాయినియై యుండెడు భూదేవియు, ఈబిడయు 'మిన్నిడై నుడవార్' ప్రణయకలహమును జరిపించు టకు ఆ కాలమునుండియు శ్రీభాష్యకారులే నియమించినారని చిరోపాసితవృద్ధుల సంప్రదాయస్థులైన వేంకటాద్రిని వాస స్థానముగా చేసికొని జీవించెడు పెద్దలు ఆనతిచ్చుచున్నారు.

ఈ విధముగనే తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి సర్వవిధముల శ్రీవేంకటేశ్వరస్వామితోడ తుల్యధర్ముడగుటచేత, తాము దేవేరులును ప్రణయకలహోత్సవము జరిపింతురు.

ఇట్టివానినన్నిటిని గోవిందరాజస్వామికి జరిపించుచు తిరుమలపైనను శ్రీవేంకటాచలపతి సన్నిధియందు తిరుప్పణిపిళ్లై కైంకర్యమగు శ్రీమహామణిమండపము నడుమ ఒక నాలుగు స్తంభముల మండపము ప్రతిష్ఠింపజేసి, ఒక గర్భాలయము నిర్మింపజేసి, ఆ శ్రీమండపమున పెద్దతిరువధ్యయనము జరుగు నట్లుగ ఏర్పాటు చేయించి సమస్తోపచారములును (కట్టియం యాదవరాజు) ప్రత్యహము జరిపించుచునుండినారు.

**(ఇంకా ఉంది)**

నారీలోకం

# రసోద్దీప్త సత్యభామ

– డా॥ మైలవరపు లలితకుమారి

శ్రీకృష్ణుని అష్టభార్యలలో సత్యభామ ఒకరు. ఈమె భూదేవి అంశ అని చెబుతారు. భార్యలందరిలో అత్యంత సౌందర్యరాశి. ఆభిజాత్యం, ధైర్యం, పరాక్రమంగల స్త్రీ. యాదవరాజు సత్రాజిత్తు కుమార్తె. శ్రీకృష్ణునిపై భక్తి, ప్రేమలు ఉన్నప్పటికి ఒకించుక అహంకూడా ఉంది. సత్రాజిత్తు సూర్యుని ప్రార్థించగా సూర్యభగవానుడు శమంతకమణిని వరంగా ఇచ్చాడు. ఆ మణి రోజుకు ఎనిమిదిబారువుల బంగారం ప్రసాదించేది. ఆ బంగారాన్ని ప్రజోపయోగమునకు వినియోగించవచ్చని మణిని తనకిమ్మని కృష్ణుడు అడిగాడు. సత్రాజిత్తు ఆ మణిని తన పూజామందిరంలో ఉంచి నిత్యము అర్చించేవాడు. ఒకసారి సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనజిత్తు ఆ మణిని దాల్చి వేటకు వెళ్ళి తిరిగిరాలేదు. శ్రీకృష్ణుడే తన తమ్ముని

"మణికై పట్టి వధించినాడు హరికిన్ మర్యాద లేదు"

అని నిందించాడు. ఆ అపనిందను బాపుకోవటానికి శ్రీకృష్ణుడు అడవికెళ్ళి మణినితెచ్చి సత్రాజిత్తుకు ఇచ్చాడు. అపుడు సత్రాజిత్తు "మణిని కూతునిచ్చి మాధవు పదములు పట్టుకొంటి నేని బ్రతుకు కలదు" అని సత్యభామను కృష్ణునికి ఇచ్చి వివాహం చేసి మణినికూడా ఆయనకు ఇవ్వగా, 'కుమారీమణి సాలునంచు' శ్రీకృష్ణుడు శమంతకమణిని సత్రాజిత్తుకు ఇచ్చేశాడు. శమంతకమణి కారణంగా సత్యభామ శ్రీకృష్ణుల కల్యాణం జరిగింది. ఆ తరువాత మిగిలినవారినీ వివాహం చేసుకొని ద్వారకానగరం పరిపాలిస్తున్నాడు.

ప్రాగ్జ్యోతిషనగరాన్ని పరిపాలించే నరకాసురుడు దేవతలను, ఋషులను, స్త్రీలను బాధించటమేకాక, యజ్ఞ యాగాదులను ధ్వంసం చేస్తున్నాడు. దేవతల తల్లి అయిన అదితి కర్ణకుండలములను అపహరించుకుపోయినాడని, వాని బారినుంచి కాపాడమని దేవేంద్రుడు శ్రీకృష్ణుని ప్రార్థించగా, అభయమిచ్చి పంపాడు. లోకకంటకుడైన నరకాసురునిపై యుద్ధానికి వెళుతున్న కృష్ణునివద్దకు వచ్చిన సత్యభామ

"దేవా! నీవు నిశాటసంఘముల నుద్దీపించి చెండాడ నీ
ప్రావీణ్యంబు సూడగోరుదు కదా ప్రాణేశ! మన్నించిన
న్నీ వెంటం గొనిపోమ్ము నేడు కరుణన్"

అని ప్రార్థించింది. అంత శ్రీకృష్ణుడు యుద్ధరంగమంటే

"సమద పుష్పంధయ ఝంకారములు కావు
భీషణ కుంభీంద్ర బృంహితములు........
కన్య! నీ వేడ! రణరంగ గమన నేడ?
వత్తు వేగము; నిలువుము వలదు వలదు"

అని ఆమె సుకుమారతత్వమును తెలుసుకొని ఆమెను వారిస్తూ బుజ్జగించే ధోరణి మనకు కనిపిస్తుంది. కానీ నరకాసురసంహారం సత్యభామ చేతులమీదుగానే జరుగవలసి ఉన్నది. అందువలన చివరకు ఆమెను యుద్ధరంగానికి తీసుకెళ్లాడు. సత్యభామ భూదేవిఅంశతో జన్మించింది. మహావిష్ణువు వరాహావతారంలో హిరణ్యాక్షుని సంహరించినప్పుడు భూదేవికి విష్ణువుకు పుట్టినవాడే నరకాసురుడు. అతడు రాక్షసాంశలో పుట్టినందువలన ఎవరివల్లనైనా కుమారునికి మరణం కలుగుతుందేమోనని అలాంటి మరణం లేకుండా వరాన్ని ఇవ్వమని పరమాత్మను కోరింది. అప్పుడు మహావిష్ణువు తల్లిచేత తప్పితే మరెవ్వరిచేతను మరణం కలుగకుండ వరమిచ్చాడు. అందువలన ఆమెను యుద్ధరంగానికి తీసుకురావలసివచ్చింది. భర్తతో యుద్ధానికి వచ్చిన సత్యభామ రథ, గజ, తురగ, పదాతిదళసమూహసైన్యాన్ని చూచి ఏమాత్రం జంకలేదు. శ్రీకృష్ణునితో యుద్ధసన్నద్ధుడైన నరకాసురుని చూచి ఏ మాత్రం కలవరపడలేదు.

"వేణింజొల్లెమువెట్టి సంఘటిత నీవీ బంధయై భూషణ శ్రేణిం దాల్చి ముఖేందు......ప్రాణేశాగ్ర భాగంబునన్" అంటూ ధైర్యంగా నిలబడింది. శ్రీకృష్ణుని, నరకుని చూచునపుడామె చూపులలో గల ద్వైదీభావమును మనకన్నులముందు కనిపింప చేస్తుందీ పద్యము.

పరుజూచున్ వరుచూచునొంప నలరింపన్ రోషరాగోదయః
విరత భ్రుకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్
జరగం గన్నుల కెంపు సొంపు బరగంగా
...................... హేలాగతిన్


దేహమే దేవాలయం. ఇతరులను హింసించి దాన్ని రోగాలబారిన పడెయ్యకు

అంటూ నిలిచింది. నరకుని చూస్తున్నది, నాథుని చూస్తున్నది. కానీ ఆ చూపులలో భేదమున్నది. పరునిపై రోషపు చూపులు, విరతభ్రుకుటి, వీరములతోనూ, కన్నుల కెంపుదనము చండాస్త్ర సందోహమును చూపుతున్నది. వరుని చూచినప్పుడు ఆ చూపులలో ప్రేమ, మందహాసం, శృంగారం, సొంపు, సరసపుదృష్టి సమూహములతో ప్రసరించుచున్నది. ఇరువురి యందు పరస్పర విరుద్ధభావావేశాలు ఆమెయందు ఒక్కసారే ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. ఈ సన్నివేశంలో సత్యభామ శృంగార, వీర, రౌద్ర, భయానక, బీభత్సరస సమంచితమైన రూపాన్ని కవి వర్ణించిన తీరు పరమాద్భుతం. తుదకు నరకాసురుడు దానవాంతకుని చేతి సుదర్శనచక్రపుదెబ్బచే నిహతుడయ్యాడన్న సత్యాన్ని గ్రహించిన తల్లి మనసు తట్టుకోలేక అంతులేని దుఃఖం పొందింది. ఈ సందర్భంలో ఆమె మూర్తీభవించిన శోకదేవతవలె మనకు కనిపిస్తుంది. ఎవరికైనా పుత్రశోకం తట్టుకోవటం అసాధ్యం కదా! ఈ సమయంలో సత్యభామ శోకరసాధిదేవతగా కనిపించింది.

నరకాసురసంహారం జరిగినతరువాత సత్యభామకృష్ణు లిద్దరు విజయోత్సవంతో ద్వారకానగరం చేరుకోగా రాణులు, ప్రజలందరూ స్వాగత సత్కారాలు గావించారు.

నారదమహర్షి దేవలోకంనుండి పారిజాతపుష్ప మొకదానిని తెచ్చి కృష్ణునికిస్తూ నీకు అత్యంత ప్రియమైనవారికి ఆ పుష్పం ఇవ్వాల్సిందిగా పలికాడు. అంతేకాక ఈ పుష్పం ధరించినవారు అపరిమితమైన సౌందర్యంతో విలసిల్లుతారని చెప్పాడు. కృష్ణుడు ఆ పుష్పమును రుక్మిణికివ్వగా ఆమె అత్యంత సౌందర్యముతో ప్రకాశించింది. ఈ మాటలను విన్న సత్యభామ చెలికత్తె వెళ్ళి ఆమెకు చెప్పింది. సౌందర్యవతినని, శ్రీకృష్ణునకు అత్యంత ప్రియమైనదాననని, తన మాటను నాథుడు జవదాటనివాడని గట్టి నమ్మకం కలిగిన సత్యభామ చెలికత్తె మాటలను విని–

**"అనవిని వేటువడ్డ యురగాంగనయుంబలె నేయివోయ**
**భగ్గన దరిగొన్న భీషణహుతాశన కీలయనంగ లేచి హె**
**చ్చిన కనుదోయికెంపు తనచెక్కుల కుంకుమపత్ర భంగ సం**
**జనిత నవీనకాంతి వెదజల్లగ గద్గదఖిన్న కంఠియై"**

అని ఆమెలోని క్రోధమును తిమ్మనగారు చక్కగా వర్ణించి చెప్పారు. ఒకచోట ఆమెను కోపన అనికూడా సంబోధించారు. శ్రీకృష్ణుడు సత్యభామ మందిరానికి పరుగు పరుగున వచ్చాడని చెప్పటంలో ఆమె మనస్తత్వం తెలిసినవ్యక్తిగా పేర్కొన్నాడు. అలా వచ్చిన కృష్ణుడు అలకగృహంలోఉన్న సత్యభామ దగ్గరకు వెళ్ళినప్పుడు స్వాధీనపతికవలె కనిపించింది. భర్త తన కోరిక ప్రకారం నడుచుకుంటాడని నమ్మే నాయిక స్వాధీనపతిక. సత్యభామవద్దకు వచ్చిన కృష్ణుడు ఆమెను అనేక విధాల అనునయించ ప్రయత్నించాడు. అతిశయించిన కోపంతో సత్యభామ చివరకు తన వామపాదంతో కృష్ణుని తలను తాడించినట్లుగా కవి వర్ణన.



కృష్ణుడు ఆమెను అనునయిస్తూ–

**"నను భవదీయదాసుని మనంబున నెయ్యపుకింక బూని తాచిన యది నాకు మన్ననయ చెల్వగు నీ పద పల్లవంబు మత్తను పులకాగ్ర కంటక వితానము తాకిన నొచ్చు నంచు నేననియెద అల్కమానవుగదాయికనైన అరాళకుంతలా!"**

అను పద్యంలో కృష్ణునికి సత్యభామపైగల అమితమైన ప్రేమ వర్ణనీయం. సత్యభామ కృష్ణునితలను తొలగదోచిందని చెప్పటానికి మూలం కృష్ణదేవరాయలకు ఆయన చిన్నభార్య అయిన చిన్నాదేవికి కలిగిన ప్రణయకలహాన్ని ఆధారంగా తీసుకొన్న నందితిమ్మన ఈ విధంగా రచించి ఉండవచ్చని విమర్శకుల అభిప్రాయం. ఇక్కడ శ్రీకృష్ణుని నాయకత్వం మనకు కనిపిస్తుంది.

పారిజాతపుష్పాన్ని కాక స్వర్గలోకంనుండి పారిజాత వృక్షాన్ని తెచ్చి ఆమె ఉద్యానవనంలో పెరటిచెట్టుగా నాటుతానని నచ్చచెప్పాడు. ఆ తరువాత శ్రీకృష్ణుడు సత్యభామాసమేతుడై అదితి కుండలములను ఇవ్వటానికి అమరావతికి బయలుదేరి వెళ్లారు. ఇంద్రుడు వారికి నందనోద్యానవనంలో విడిదిని ఏర్పాటుచేశాడు. ఆ ఉద్యానవనంలో ఉన్న పారిజాతవృక్ష సౌందర్యాన్ని, దాని పరిమళాన్ని ఆఘ్రాణించిన సత్యభామ దానిని తమతోపాటు భూలోకానికి తీసుకువెళదామని కోరింది. ఆమె మనసులోగల దృఢత్వం మనకిక్కడ కనిపిస్తుంది. ఆమె కోరిన కోరికమేరకు పారిజాతాన్ని ఇంద్రుడే ఇచ్చాడనియు; పాలసముద్రంలో పుట్టి స్వర్గసంపద అయిన పారిజాతాన్ని ఇవ్వటానికి ఇంద్రుడు అంగీకరించకపోగా, శ్రీకృష్ణునికి ఇంద్రునికి మధ్య సమరం జరగగా, ఆ సమరంలో శ్రీకృష్ణుడు ఇంద్రుని జయించి పారిజాతవృక్షాన్ని తీసుకువెళ్లాడని పాఠాంతరములు ఉన్నాయి. ఏది ఏమైనా దేవలోకపారిజాతం సత్యభామదేవి తోటకు చేరింది. భూలోకవాసులకు దర్శనీయమైనది.

ఆమె పుణ్యకవ్రతమను ఒక వ్రతమును చేసింది. దీనిని కార్తికమాసంలో సువాసినులు ఆచరిస్తారు. ఇది పుణ్యప్రదం, మహిమాన్వితమైన వ్రతంగా పద్మపురాణంలో ఉంది. దేవతావృక్షం పారిజాతం కర్మభూమి అయిన భూలోకంలో ఉండరాదని ఆ వ్రతసమయాన నారదునికి కృష్ణునితో కలిపి ఆ వృక్షాన్ని దానమిచ్చినట్లుగా కథనం. తరువాత పరమాత్మను భోగమయమైన ధనంతో తులతూచటం సాధ్యంకాక, రుక్మిణీదేవి భక్తితో ఒక్క తులసీదళంతో స్వామిని తూచినట్లుగా చెబుతారు. చివరకు స్వామి అందరికీ, పారిజాతం ఇంద్రునికి దక్కినట్లుగా పద్మపురాణం, స్కాందపురాణంలో చెప్పబడింది. ఇదంతా పరమాత్మను ధనంతోకాక భక్తితో మాత్రమే వశం చేసుకోవచ్చునని తెలియజేస్తున్నది. ఆ తరువాత సత్యభామకూడా కృష్ణభక్తిలో తరించినట్లుగా భాగవతం, హరివంశములలో చెప్పబడింది.

కూచిపూడివారు వారి భామాకలాపంలో **"మీరజాల గలడా నా యానతి"** అని సత్యభామ ఆభిజాత్యమును ఎంతగానో పరిచయం చేశారు. ఈ విధంగా సత్యభామ అందచందాలతోనేకాక వీర పరాక్రమములలోకూడా శ్రేష్ఠురాలనిపించుకున్నది.

స్త్రీలు బేలలుగా కాక ధైర్యసాహసాలతో ఉండాలన్నది సత్యభామ పాత్రద్వారా మనకు విదితం.

అంతేకాక సత్యభామ పూర్వజన్మగురించికూడా కొన్ని కథనాలున్నాయి. కృతయుగంలో మాయానగరంలో దేవశర్మ అనే వేదపండితుడికి గుణవతి అనే కుమార్తె ఉంది. ఆమె వివాహానంతరం మామా అల్లుళ్ళు సమిధలకొరకు వెళ్లి ఆ అడవిలో మరణించారు. అలా మరణించినవారు వైకుంఠం చేరుకున్నారు. కానీ గుణవతి తన సమస్తసంపదలను వ్యయం చేసి భర్తకు, తండ్రికి ఉత్తమగతులు కలగటానికి అనేక పుణ్యకార్యాలు, వ్రతాలు చేసింది. వ్రతాలన్నింటిని చివరకు ఆమె "నారాయణయేతి సమర్పయామి" అని జగన్నాథుడయిన ఆ మహావిష్ణువుకి అర్పించేది. కనుక సాత్రాజితీ! ఆ వ్రతాల ప్రతిఫలంగా నీవు ఇప్పుడు నా భార్యవైనావని ఇది ఆనాటి పుణ్యం అని చెప్పాడు శ్రీకృష్ణుడు. కనుక భూదేవిఅంశతో సత్యభామ జన్మించినప్పటికీ గుణవతి అంశకూడా ఆమెలో ఉన్నదని దీని అర్థం.

సత్యభామలో అందం, అభిజాత్యం, అహంకారమే కాక, ధైర్యసాహసములు, వీరవిక్రమములు, కరుణ, భక్తికూడ కలవని మనకు తెలుస్తోంది. ఏ యుగానికైనా సత్యభామ ఆదర్శ స్త్రీమూర్తి అని చెప్పవచ్చు. నవరసాన్వితమైన స్త్రీమూర్తిగా కవులు తమ కావ్యాలలో సత్యభామ పాత్రను సృష్టించారు. ఆడదంటే ఆదిపరాశక్తియేగానీ బలహీనురాలైన అబలకాదని నిరూపించడమే సత్యభామ పాత్ర ఔచిత్యమని చెప్పవచ్చు.

గృహలక్ష్మి

# దివ్య దివ్య దీపజ్యోతుల వేడుక దీపావళి

- యోగశ్రీ ఆచార్య డా॥సి.ఎస్.రాయుడు,
98486 18095

అక్టోబరు 20, 2025న దీపావళిపండుగ సందర్భంగా...

దీపావళి అత్యంత ఉత్తేజకరమైన ఉత్సాహభరితమైన పర్వదినం. ఇది భారతదేశంలోని ప్రసిద్ధ జాతీయపండుగ. ఇది సనాతనమైన, శక్తివంతమైన అఖండ భారతసంస్కృతియొక్క గొప్పతనాన్ని వర్ణిస్తుంది. భారతీయ సాంస్కృతిక వారసత్వం లోని ఉత్తమవేడుక దీపావళి. మానవజీవితాల్లో చాలా ముఖ్య మైనది. వైభవంగా అనేక ప్రదర్శనలతో దేశవ్యాప్తంగా నిర్వ హించే వేడుకలతో కూడిన పండుగ. ఇది మన సాంస్కృతిక మత ఆధ్యాత్మిక సామాజికపరమైన ప్రాముఖ్యత కలిగి ఉంది. వైదికసంప్రదాయం, వారసత్వవిలువలు మరియు ఐక్యతను కాపాడుకోవడానికి ఉపయోగపడుతుంది.

దేశ నిర్దిష్టసంస్కృతిని సమాజంయొక్క ఆచార వ్యవహారాలను, నమ్మకాలను శాంతి మిత్రత్వం కలయిక సంతోషం మరియు ఆనందమును పెంపొందిస్తుంది. మన సనాతనధర్మం, జీవనవిధానం పూర్వీకులనుండి తరువాతి తరములవారికి సంక్రమించిన అన్నిటిలో ఒకటి దీపావళి. ధర్మజీవితాన్ని ఎలా సుసంపన్నం చేసుకోవాలో నేర్పిస్తుంది ఈ పండుగ. నమ్మకాలను, ఆచారాలను, వారసత్వాలను కొనసాగించడానికి దీపావళి దోహదపడుతుంది. సృజనాత్మకత వ్యక్తీకరణలకు ఒక వేదిక వారధిగా పనిచేస్తుంది.

దీవాలి, దివాలి లేదా దీపావళి అనికూడా పిలుస్తారు. దీపవళి అను సంస్కృతపదంనుండి ఉద్భవించింది. దీని అర్థం దీపాలవరుస. దీపం అంటే వెలుగు, ప్రకాశం, కాంతి, తేజస్సు, జ్ఞానం. ఆవళి అంటే ఒక వరుస. దీపావళిని దీపమాలికగా వర్ణిస్తారు.

కొన్నిప్రాంతాలలో దీపోత్సవంగా జరుపుతారు. చీకటిని తొలగించి వెలుగును ప్రకాశింపజేసే శుభప్రదమైన దీపావళిపండుగ. దీపావళికి ప్రతిరూపమైనదే ఈ దీపాల పండుగ. 16వశతాబ్దకాలంలో దీవాలి అన్న పదం దీపావళి పండుగకు సంకేతంగా ఉపయోగించేవారు. దీపాలను వెలిగించడం, పూజించడం ప్రధానవిశేషం.

దీపాల్లో అనేకరకాలున్నాయి. అవి. మట్టి ప్రమిదలు, ఇత్తడి, బంగారు, కాంస్య, రాగి, వెండి, బంకమట్టి అనే దీపాలను ఎక్కువగా ఉపయోగిస్తారు. దీపాలను అనేక ఆకారాలుగా వివిధరూపాలతో తయారుచేస్తారు. ఐదుఒత్తుల వృత్తాకారం, చేప, తాబేలు, శంఖం, కమలం, హంస, నెమలి, చిలుక, పక్షులు, పాము, సింహము, ఏనుగులు, దీపవృక్షం, కాంతిచెట్లు, దేవతలఅవతారాలు, ప్రకృతి మొదలగు ఆకృతులతో తయారుచేస్తారు. నువ్వులనూనె, ఆవునెయ్యి, చమురుపోసిన శుద్ధమైనవత్తితో దీపాలను తూర్పు లేదా ఉత్తరంవైపు ఉంచుతారు.

దేవాలయంముందు దీపస్తంభం ఏర్పాటుచేస్తారు. లక్ష్మీదేవి తనచేతిలో దీపాన్ని పట్టుకొని ఉన్నట్లు గమనించ వచ్చు. వైదికకర్మలు మొదటిఅడుగు దీపం వెలిగించి దేవతలను ఆవాహనం చేస్తారు. అన్ని యుగాలలో దీపారాధనకు ప్రాముఖ్యత ఉంది. ప్రార్థనలకు, పూజలకు ముందు దీపం వెలిగిస్తారు. దీప అంటే భారతీయ లాంతరు లేదా దీపం.

దీప జ్యోతిః పరబ్రహ్మ,
దీప జ్యోతిర్జనార్దనః

అనగా, దీపంయొక్క ప్రకాశం పరబ్రహ్మరూపం మరియు సంపూర్ణ బ్రహ్మాండం. ఒక వెలుగు. విశ్వానికి అధిపతి అయిన ఆ జనార్దనుణ్ణి సూచిస్తుంది.

అనగా సర్వపాపాలను పోగొట్టుకోవటానికి ఈ క్రింది శ్లోకంతో స్తుతించాలి.

దీపోహారతయే పాపం
దీపజ్యోతిర్నమోస్తుతే

తమసోమా జ్యోతిర్గమయ

అన్న మంత్రం బృహదారణ్యకోపనిషత్తులో ఉంది. అనగా చీకటి, అజ్ఞానం, అంధకారం, వెలుగు, ప్రకాశం, జ్ఞానం వైపు నన్ను నడిపించు అని అర్థం. ఇది అతి పురాతన సనాతన భారతీయమంత్రం.

సర్వ భూతాశమస్థితి
సర్వ భూతానాః హృద్దేశ్
అస్తః శరీరస్థమ్.

జ్యోతిః స్వరూపమైన ఆత్మదేవుడు అందరిలో దేహాంతర్గతమైన పరమాత్ముడే.

శ్లో॥ ఏకో పరాత్మా బహుదేహవర్తిః



సాక్షాత్తు ఆ నారాయణుడే హృదయంనందు ఆత్మజ్యోతిగా స్థితమై ఉన్నాడు.

మన శరీరంలోని ప్రాణంకూడ ప్రకాశించే జ్యోతి. దీనినే ప్రాణజ్యోతి అంటారు. ఈ దీపం ఆరిపోతే మనిషి మరణించినట్లే.

దీపావళిపండుగరోజున ఇళ్ళన్నీ రంగోళి, లైట్లు, దీపమాలకాంతులతో, శోభించే ప్రకాశవంతమైన ఫాన్సిలైట్లు, అలంకారమైన లైటింగ్స్, దీపాలతో అలంకరించబడతాయి. మామిడిఆకులతో, పూలతో తోరణాలు కడతారు. రంగోళి డిజైన్లతో నేలను అలంకరిస్తారు. బొమ్మలకొలువులను ఏర్పాటు చేస్తారు.

దీపావళిపండుగ దన్తేరాస్ అని పిలువబడే మొదటి రోజు పూజతో ప్రారంభమవుతుంది. పండుగ ప్రారంభాన్ని సూచించే సుదీర్ఘపండుగదినాలలో ఒకటి. సాంస్కృతిక సంప్రదాయాలలో ఈ రోజును ధనత్రయోదశి అనికూడా పిలుస్తారు. సంపదలకు అధిపతియైన లక్ష్మి మరియు కుబేరుణ్ణి ఆహ్వానిస్తారు. ఆరాధిస్తారు. ఆశీర్వాదాలు తీసుకుంటారు. భౌతిక సంపదేకాకుండా ఆధ్యాత్మికసమృద్ధి, సామరస్యాన్నికూడ భక్తులు కోరుకుంటారు.

**దిష్టిబొమ్మను కాల్చడం-ప్రదోషకాలం**

ప్రజలంతా గోగునార, చిన్నచిన్న గుడ్డముక్కలు, పాత మరియు దోషపూరితబట్టలు, పొడవైన కట్టెకు కట్టి వెలిగించి దిష్టితీస్తారు. జ్యోతి వెలుగునిచ్చే దీపావళి అని అర్థం. సూర్యాస్తమయసమయమును ప్రదోషసమయం అంటారు. నరకాసురుడిబొమ్మను దహనం చేయటంతో పండుగ ప్రారంభమవుతుంది. ఆనందంతో భారీసంఖ్యలో ప్రజలు ఈ వేడుకలో పాల్గొంటారు.

ఈ ప్రకారం సత్యయుగం మరియు ద్వాపరయుగములకు సంబంధించి నరకాసురుడు అను రాక్షసుని సత్యభామ, శ్రీకృష్ణుడు వధించిన గాథకు సంబంధించినది ఈ ఉత్సవం. నరకాసురుడి మరణసందర్భంగా దీపాలతో ఆనందోత్సవాలు జరుపుకుంటారు. అదే దీపావళిపండుగగా నిలిచి పోయింది.

108 దివ్యదేశాలు

నవతిరుపతులు - 3

# తిరుప్పుళింగుడి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

శ్రీవైకుంఠం అనే దివ్యదేశంనుండి తూత్తుక్కుడి వెళ్ళే మార్గంలో నాలుగుకి.మీలదూరంలో నత్తం విజయాసనస్వామి దేవాలయంనుండి ఒక కి.మీదూరంలో తామ్రపర్ణినది ఉత్తర దిక్కులో రెండుప్రాకారాలతో అద్భుతమైన ప్రకృతిరామణీయ కతతో ఈ తిరుప్పుళింగుడి అనే దివ్యదేశం శోభిల్లుతోంది. ఇక్కడున్న మూలమూర్తి కాయ్శినవేందన్, భూమిపాలుడు అనే పేర్లతో భుజంగశయనుడిగా తూర్పుదిక్కున వేంచేసి ఉన్నాడు. శ్రీమహాలక్ష్మిఅమ్మవారు ప్రత్యేకమైన సన్నిధిలో వెలసి ఉన్నది. మూలమూర్తితోపాటు పెద్దవిగ్రహాలతో మలర్మగళ్నాచ్చియార్ మరియు పూమహళ్నాచ్చియార్ ఉన్నారు. మరొక అద్భుతమైన విషయం ఏమిటంటే మూలమూర్తి నాభినుండి తామరతీగ ఒకటి ప్రత్యేకంగా గోడకి ఆనుకొని బ్రహ్మకు ఆసనంగా పద్మంతోచేరి కనిపిస్తున్నది. ఈ మూలమూర్తి దివ్యపాదార విందములను బయటప్రాకారంలో ఉన్నకిటికీద్వారా మనం దర్శించుకోవచ్చు. వరుణతీర్థం మరియు నిర్ఋతితీర్థములతో, వేదసారవిమానంతో ఈ తిరుప్పుళింగుడి దివ్యదేశం విరాజిల్లుతోంది.

## 1) స్థలపురాణం:

శ్రియఃపతి శ్రీమన్నారాయణుడు మహాలక్ష్మితోపాటు శ్రీవైకుంఠంనుండి తామ్రపర్ణినదితీరంలో వెలసిఉన్న తిరుప్పుళింగుడి దివ్యదేశానికి వేంచేశారు. ఇక్కడున్న ఈ ప్రకృతిసౌందర్యాన్ని వారు ఆస్వాదిస్తూన్నసందర్భంలో హఠాత్తుగా తామ్రపర్ణినది నల్లనినీళ్ళతో అలా ప్రవహిస్తున్నది. పచ్చదనమంతా హరించుకుపోయినది. అన్నిచోట్లకూడా అనన్యమైన ఉష్ణోగ్రత ఏర్పడింది. భగవంతుడికే తెలియనటువంటి విషయం ఏదైనా ఉంటుందా? కానీ దేవదేవుడుకూడా ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఇది ఎవరిలీల అని చింతిస్తుండగా ఇది ఆ భూమాదేవిలీల అని తెలుసుకుని ఆవిడను చూడడానికి భగవంతుడు ప్రయత్నించాడు. కానీ భూమాదేవి ఎల్లప్పుడు స్వామి అమ్మవారితో ఏకాంతంగా ఉన్నాడు అని అలిగి పాతాళలోకానికి వెళ్ళి దాక్కున్నది. ఆ కారణంగానే భూలోకమంతాకూడా పచ్చదనాన్ని పోగొట్టుకుని ఇలా దుర్భిక్షంగా మారిందని భగవంతుడు తెలుసుకొని అమ్మ వారిని వెతుకుతూ పాతాళలోకానికి వెళ్లాడు. అక్కడ అమ్మవారినిచూచి నీవు మరియు మహాలక్ష్మి మీరిద్దరుగూడా ఒకేఅంశయే అని ఆవిడకి తెలియజేసి, జ్ఞానోదయం కలిగించి తిరిగి భూమాదేవిని పాతాళలోకంనుండి యథాస్థానానికి తీసు కునిరాగా మళ్ళీ భూలోకమంతాకూడా సుభిక్షంగా తయారైంది. ఈ ప్రకారంగా భగవంతుడు భూలోకం దుర్భిక్షాన్ని పోగొట్టాడు కనుక ఈ స్వామిని భూమిపాలుడు అని కీర్తిస్తూ వచ్చారు.

| | | |
|---|---|---|
| మూలమూర్తి | : | కాయ్శినవేందన్, భూమిపాలుడు, భుజంగశయనుడు |
| అమ్మవార్లు | : | మలర్మగళ్ నాచ్చియార్, పూమగళ్ నాచ్చియార్ |
| తీర్థాలు | : | వరుణతీర్థం, నిర్ఋతితీర్థం |
| విమానం | : | వేదసారవిమానం |
| ఆగమం | : | వైఖానసఆగమం |
| ప్రత్యక్షం | : | ఇంద్రుడు, యజ్ఞశర్మ మొ॥ |
| మంగళాశాసనం | : | నమ్మాళ్వార్లు-9-2 |

## 2) స్థలపురాణం:

ఇందులో ముఖ్యంగా ఇంద్రుని బ్రహ్మహత్యాదోషాన్ని ఈ తిరుప్పుళింగుడిస్వామి పోగొట్టాడు అనే ఒక వృత్తాంతమిది. ఒకానొకసందర్భంలో యజ్ఞశర్మ అను ఒకతను తనభార్యతో పాటు ఏకాంతంగా ఉన్న సందర్భంలో వశిష్ఠమహర్షి పుత్రుడు శక్తి అనే మహర్షి అనేకమంది ఋషులతో ఆ యజ్ఞశర్మ ఉన్న ప్రదేశానికి వచ్చాడు. తన భార్యతో ఏకాంతంగా ఉన్న యజ్ఞశర్మ మహర్షులెవ్వరినికూడా గౌరవించలేదు, తగిన సత్కారాలుకూడ చెయ్యలేదు. ఈ విషయాన్ని పెద్ద అవమానంగా భావించిన శక్తిమహర్షి అగ్రహోదగ్రుడై ఆ యజ్ఞశర్మను రాక్షసుడిగా మార

మని శపించాడు. అతనిచ్చిన శాపంతో రాక్షసుడిగా మారిన యజ్ఞశర్మ తను చేసిన అపచారాన్ని తెలుసుకుని శాపవిమోచనం కోసం ఆ మహర్షిని వేడుకోగా, మహర్షి భవిష్యత్కాలంలో ఒక సమయంలో ఈ తిరుప్పుళింగుడి అనే దివ్యదేశానికి ఇంద్ర దేవుడు ఒక యజ్ఞంకోసం వస్తాడు. ఆ సమయంలో అతణ్ణి ఇబ్బందిపెట్టే ఒక రాక్షసుడిగా నీవుంటావు. ఇంద్రుడు యాగసంరక్షణంకోసం శ్రియఃపతిని శరణాగతి చేస్తాడు. భగవంతుడుకూడా అతనియందు ఒక ఆదరాతిశయంతో ఇక్కడికొచ్చి తన గదాయుధంతో నిన్ను సంహరిస్తాడు. అప్పుడు నీకు శాపవిమోచనం కలుగుతుంది. నీవు ముక్తిని పొందగలవు అని శాపవిమోచనవృత్తాంతాన్ని తెలియజేశాడు.



## శనిత్రయోదశి (18-10-2025)

**సకలజీవులను స్మరణమాత్రంచే భయభ్రాంతులకు గురిచేసే గ్రహరూపం శ్రీశనీశ్చరుడు. ఈయన కృపాకటాక్షవీక్షణములు గలిగిన వ్యక్తి. తిరుగులేని వ్యక్తిగా ఉంటాడని ప్రతీతి. ఈయన అనుగ్రహం లేకపోతే జాతకచక్రంలో ఎన్ని గ్రహములు అనుకూలంగా ఉన్నప్పటికీ అనేక కష్టాలు అనుభవించవలసి వస్తుంది. జ్యోతిషశాస్త్ర ప్రకారం శ్రీశనీశ్చరుడు స్వతంత్రంగా ఫలితాలు ఇవ్వగలిగిన అత్యంత ప్రభావవంతమైన గ్రహం. నవగ్రహాలలో ఈయన యువరాజు.**

**ప్రతి శనివారం శివాలయంలో ఉమ్మెత్తపువ్వులు సమర్పించటం, నవగ్రహఆలయంలో 19 ప్రదక్షిణలు చేయటం, "ఓం శం శనైశ్చరాయ నమః" అను మంత్రమును జపం చేసుకోవటం, వృద్ధులకు సేవ చేయటం, నువ్వులు బెల్లం కలిపిన ఉండలు పిల్లలకు పంచటం, మంగళవారం పేదదంపతులకు ఎండుఖర్జూరం దానం చేయటం వంటి కార్యక్రమాలు శ్రీశనీశ్చరుని అనుగ్రహం పొందటంలో సహాయం చేస్తాయి. మరీ కష్టమైనస్థితిలో ఉన్నవారు ఎనిమిది శనివారాలు ఒక ఇనుపప్రమిదలో నూపప్పునూనె పోసి, ఒక నల్లనివస్త్రంలో కొన్ని నల్లనువ్వులు మూటకట్టి దానిని వత్తిలా చేసి, దానిని ప్రమిదలో పెట్టి, శివాలయంలోని శ్రీశనీశ్చరుని ఎదుట వెలిగించాలి. నువ్వులనూనెతో శ్రీశనీశ్చరునికి తైలాభిషేకం చేయటంకూడా ఉత్తమం. ఆయన పాదాలవద్ద నువ్వులు ఉంచి, ఒక ఆకులో బెల్లం, నువ్వులు నైవేద్యం పెట్టి, తమ సమస్యలను విన్నవించుకుని విముక్తి కలిగించుమని వేడుకోవటంవల్లకూడా అతి శీఘ్రంగా మంచి ఫలితాలనిస్తుంది.**

### శనిగ్రహస్తోత్రం

నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం ।
ఛాయామార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం ॥

## 3) స్థలపురాణం:

### ఇంద్రుడికి కలిగిన బ్రహ్మహత్యాదోషం

ఇంద్రుడు తన భార్యతో ఒక సరస్సులో ఏకాంతంగా ఉన్నప్పుడు ఆ సరస్సుతీరంలో రెండు జింకలు ఏకాంతంగా ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. వాటినిచూచి ఇంద్రుడు తమ ఏకాంతాన్ని భంగం చేయడానికై ఈ జింకలు ఇక్కడ ఉన్నాయి అని తప్పుగా భావించి అందులో మగజింకను తన వజ్రాయుధంతో కొట్టాడు. వెంటనే ఆ మగజింక ఒక మహర్షిగా మారడం జరిగింది. దీనినిచూచిన ఇంద్రుడు ఆశ్చర్యంతో తనకు తెలియకుండానే జింకరూపంలో ఉన్న ఒకఋషిని సంహరించాను కనుక బ్రహ్మహత్యాదోషమనేది పంచమహాపాతకంలో ఒకటి కనుక బ్రాహ్మణవధను చేశాను అని చెప్పి చాలా బాధపడ్డాడు. ఇక దేవేంద్రుడు బ్రహ్మహత్యాదోషంనుండి తనను విడిపించుకోవడానికై చాలా దేశాలను, చాలా ఊర్లను, దివ్యదేశయాత్రలను చేశాడు.

చివరగా ఇంద్రుడు రాక్షసుడిగా మారిన యజ్ఞశర్మ ఉన్న తిరుప్పుళింగుడి దివ్యదేశానికి వచ్చి చేరాడు. అక్కడున్న వరుణపుష్కరిణిలో స్నానంచేసి ఆ దివ్యదేశస్వామికి నమస్కరించినవెంటనే ఇంద్రుడి బ్రహ్మహత్యాదోషం తొలగింది. ఇలా తన దోషాన్ని పోగొట్టిన భూమిపాలస్వామికి కృతజ్ఞత తెలియజేసేవిధంగా ఒక యాగాన్ని తలపెట్టినసందర్భంలో ఆ యాగాన్ని భంగం చేయడానికై రాక్షసుడు అక్కడికి రావడం జరిగింది. భగవంతుణ్ణి శరణాగతిని చేసినవాడు ఇంద్రుడు. దేవదేవుడు శ్రీమన్నారాయణుడు తనగదతో ఆ రాక్షసుణ్ణి సంహరించగా ఆ రాక్షసుడి శాపం తొలగి యజ్ఞశర్మగా మారి చివరగా ముక్తిని పొందాడు. ఈ ప్రకారంగా ఈ స్వామివైభవం విరాజిల్లుతోంది. కనుక అందరూకూడా కాయ్శినవేందన్స్వామిని సేవించుకుని సకలపాపవిముక్తులై ముఖ్యంగా బ్రహ్మహత్యాదోష విముక్తులై దేహావసానంలో మోక్షసామ్రాజ్యాన్ని పొంది తరించాలని భగవంతుణ్ణి ప్రార్థిద్దాం.

శ్రీమత్ కాయ్చ్చిన భూపతిః స భగవాన్ శ్రీ తింత్రిణీ మందిరే
పూర్వాశావదనః భుజంగశయనః పద్మోద్భవా సంఘుతః।
శ్రేష్ఠే వారుణ తీర్థరాజవిలసత్తీరే దయావారిధిః
రేజే శ్రీశృతిసారశేఖరలసన్ మూర్తిః ప్రచేతశ్రితా॥



క్రమశిక్షణతో మెలిగితే నీ జీవితం క్రమం తప్పక సాఫీగా సాగుతుంది



# శ్రీపద్మావతిఅమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవం, తిరుచానూరు

(17-11-2025 నుండి 25-11-2025 వరకు)

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 17-11-2025 | సోమ | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 18-11-2025 | మంగళ | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 19-11-2025 | బుధ | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 20-11-2025 | గురు | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 21-11-2025 | శుక్ర | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 22-11-2025 | శని | సర్వభూపాలవాహనం స్వర్ణరథోత్సవం | గరుడవాహనం |
| 23-11-2025 | ఆది | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 24-11-2025 | సోమ | రథోత్సవం | అశ్వవాహనం |
| 25-11-2025 | మంగళ | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |







## తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి గజవాహనసేవ

(21-11-2025)

గజము ఐశ్వర్యమునకు ప్రతీక. అలాగే వైభవమునకు కూడ. మదాతిరేకంతో కూడిన అహంకారానికికూడ ఏనుగు ప్రతీక. అనంతైశ్వర్యం, అనన్యసామాన్యమైన వైభవం తన కైవశమై ఉన్నాయని, మదాతిరేక సంభరితమైన మనోవికారాలన్నీ జయింపగలిగిన యోగశక్తిని తాను ప్రసాదింపగలనని నిరూపిస్తూ అలమేలుమంగ గజవాహనంపై ఊరేగుతారు. పైగా అలమేలుమంగ వీరలక్ష్మియైనందువల్ల ఈ గజవాహనసేవకు ఎంతో ప్రాశస్త్యం ఉంది.

"గజవరమధిరూఢా శంఖ చక్రాసిఉ శార్జ్గా
ద్యమిత నిశిత శస్త్రాస్త్రోద్ధృటా శాత్రవేషు
సుమధురదరహాసేనాశ్రితాన్ హర్షయంతీ
రిపు నివహనిరాసం వీరలక్ష్మీ ర్విధత్తామ్"

గజవాహనంపై ఊరేగుతూ ఉన్న వీరలక్ష్మీమూర్తియైన అలమేలుమంగ ఆశ్రితులకు అభయప్రదాతయై, శత్రునాశనం చేసి, చిరునవ్వులు చిందించే అధరాలతో, కరుణాకటాక్షాలతో బిడ్డలైన దాసులను సంరక్షిస్తుంది. అందుకే భక్తులు ఈ వాహనసేవను తిలకించి, తరిస్తారు.



## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవం,
### శ్రీనివాసమంగాపురం

| తేదీలు | వారం | ఉత్సవములు | |
|---|---|---|---|
| 16-10-2025 | గురు | --- | అంకురార్పణ |
| 17-10-2025 | శుక్ర | పవిత్ర ప్రతిష్ఠ | |
| 18-10-2025 | శని | పవిత్ర సమర్పణ | |
| 19-10-2025 | ఆది | పూర్ణాహుతి | |

## శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవం, హృషీకేశ్

| తేదీలు | వారం | ఉత్సవములు | |
|---|---|---|---|
| 05-10-2025 | ఆది | --- | అంకురార్పణ |
| 06-10-2025 | సోమ | పవిత్ర ప్రతిష్ఠ | |
| 07-10-2025 | మంగళ | పవిత్ర సమర్పణ | |
| 08-10-2025 | బుధ | పూర్ణాహుతి | ఆశ్వయుజ మాసంలో జరుగుతాయి |





## శ్రీ పట్టాభిరామస్వామివారి పవిత్రోత్సవం,
### వాల్మీకిపురం (వాయల్పాడు)

| తేదీలు | వారం | ఉత్సవములు | |
|---|---|---|---|
| 04-10-2025 | శని | --- | అంకురార్పణ |
| 05-10-2025 | ఆది | పవిత్ర ప్రతిష్ఠ | |
| 06-10-2025 | సోమ | పవిత్ర సమర్పణ | |
| 07-10-2025 | మంగళ | పూర్ణాహుతి | ఆశ్వయుజ పూర్ణిమకు జరుగుతాయి |

సదాచారం

# సనాతనధర్మం ఆచారవ్యవహారాలు

- శ్రీ అవసరాల లక్ష్మీపతిరావు,



సనాతనధర్మం అంటే ప్రాచీనధర్మం. పూర్వంనుండి వస్తున్న ఆచారవ్యవహారాలు ఒక్కసారి మననం చేసుకోవడం ఈ వ్యాసం సారాంశం. మన పెద్దవాళ్లు మాటిమాటికి కొన్ని చెపుతూనే ఉంటారు. కాని, యువత వాటిని లెక్కలోకి తీసుకోకుండా ఎడముఖం పెడముఖంగా మూఢాచారాలని కొట్టి పారేస్తూ ఉంటారు. పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకుని మరీ సనాతనధర్మం, పండుగలవిశిష్టత, పురాణాలఔన్నత్యం, రామాయణ, భారత, భాగవతాలు, ధర్మం, ధర్మసూక్ష్మాలగురించి చెప్తూ ఉండాలి. చెప్పగా చెప్పగా వాళ్లకి అర్థమౌతుంది. ఇది మన బాధ్యత.

సత్కర్మాచరణతో సన్మార్గంలో ప్రవర్తించే మానవులు దీర్ఘాయుష్షును, యశస్సు, సిరిసంపదలు పొందుతారు. దురాచారుడు అల్పాయుష్కుడౌతాడు. సదాచారసంపన్నులే సత్పురుషులు. నిజకర్మాచరణమనేది వినడంవలనే తెలుస్తుంది. క్రోధంలేనివాడు, అసూయారహితుడు, సత్యవాది, ఋజు వర్తనుడు చిరకాలం జీవిస్తాడు. సదాచారం పాటించనివాడు అల్పాయుష్కుడౌతాడు.

బ్రహ్మముహూర్తంలో మేల్కొని నిత్యం ప్రాతఃకాలంలో దైవచింతనతో స్నానంచేసి సంధ్య ఉపాసించాలి. మూడు పూటలా స్నానంచేసి శుచిగా ఉండాలి. గోళ్లు కొరకడం, ఎంగిలి భుజించడం, అస్థిరచిత్తం ఉండడం మంచిది కాదు. స్నానం చేసేముందు దంతధావనం చేసుకోవాలి.

పరోపకారం, సంయమనం, ప్రాణాయామం అనుష్ఠించాలి. స్నానం చేసేటప్పుడు కాలుమీద కాలువేసి రుద్దరాదు. ఒళ్లు తుడుచుకునేటప్పుడు పైనుండి క్రిందికి తుడుచుకోవాలి. అన్ని నదులను ఆహ్వానించి ఆ జలాలతో స్నానం చేస్తున్నట్లు భావన చేసుకోవాలి. శరీరంక్రిందనుండి మీదికి తుడుచుకొనరాదు.

మూత్రపురీష విసర్జనసమయాల్లో మౌనం పాటించాలి. గోవులుండే ప్రదేశాల్లోనూ, బొగ్గులున్నప్రదేశాల్లోను, వృక్షమూలాల్లోను, నీళ్లనూ, దేవాలయాలను చూస్తూ మూత్రపురీషాలు విసర్జించరాదు. ఉత్తరాభిముఖంగా శౌచం చేయాలి. సూర్యునికి, గోవుకి ఎదురుగా మూత్రవిసర్జన చెయ్యడం, ఉమ్మివేయడం చేయరాదు. అగ్ని ఎదుటకూడా చేయరాదు. అన్నిజాతులకు అన్నిధర్మాలు ఉన్నాయి. ఎవరికులాన్నిబట్టి వారు సనాతనధర్మం పాటించాలి. అన్ని జాతులవారు ఇంద్రియనిగ్రహం కలిగి ఉండాలి. సురాపానం మహాపాపం. స్వధర్మాన్ని విడిచి పరధర్మానికి ప్రాకులాడకూడదు. ధర్మకార్యాల్లో, పితృకార్యంలో శిరస్స్నానం చేయాలి. తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు నెత్తిమీద నీళ్లు జల్లుకుని ముమ్మారు ఆచమనం చేయాలి.

బయటకు వెళ్లి వచ్చినప్పుడల్లా కాళ్లు కడుక్కోవాలి. దైవారాధనకు ప్రత్యేకంగా ధోవతి పెట్టుకోవాలి. ధోవతిని కండువాగా, కండువాను ధోవతిగా ఉపయోగించరాదు.

సభలో అధర్మాన్ని ప్రశ్నించని వారు బ్రతికి ఉన్నా మరణించినట్లే!

ఉత్తరం, పశ్చిమం దిక్కుల్లో శిరస్సు పెట్టుకుని పరుండరాదు. తూర్పు, దక్షిణదిక్కులలో తలపెట్టుకుని పడుకోవాలి. శిథిలమైన శయ్యపై పరుండరాదు. చీకటిగా ఉన్నచోట, స్త్రీలు సంచరించే ప్రదేశాల్లో పరుండరాదు.

ఒకరు చూస్తున్నప్పుడు వారికి పెట్టకుండా భుజించ రాదు. తూర్పుదిశగా కూర్చొని భోజనాన్ని ఆస్వాధిస్తూ భుజించాలి. నిలుచుని పాదరక్షలతో భుజించరాదు. దక్షిణ ముఖంగా కూర్చొని భుజించరాదు. నడుస్తూ భుజించరాదు. భోజనానంతరం క్షురకర్మ కూడదు.

ద్వాదశిరోజు ఉపవాసం శ్రేష్ఠమైనది. పుణ్యప్రదమైనది. ఒకరు వాడిన వస్తువులు, దుస్తులు మరొకరు వాడరాదు.

ధర్మకర్మ చేసినవాడు సుఖము, అధర్మకర్మ చేసినవాడు దుఃఖము అనుభవిస్తాడు. మానవునకు తను చేసిన సుకృత దుష్కృత్యాలే తోడుగా వస్తాయి. ప్రతిమనిషికి తానుచేసిన పాపపుణ్యాలే తోడునీడ. మరణించిన పిదప బంధుమిత్రులు కొంచెంసేపు శోకించి ఎవరిదారిన వారు వెడతారు. తోడు నీడగా ఎవరూ రారు. తను చేసిన ధర్మమొక్కటే తనవెంట వస్తుంది.

దూడలకు పాలు మిగల్చకుండా ఆవుపాలు పూర్తిగా పిండేసుకుంటే సంతానం నశిస్తుంది. అమావాస్యనాడు తిల తర్పణం, దీపారాధనవల్ల పితృఋణం తీర్చిన వారవుతారు. విప్రుని, గోవుని, మండుతున్న అగ్నిని, స్త్రీలను కాలితో తన్నరాదు. అమావాస్యనాడు వృక్షాన్ని నరికితే బ్రహ్మహత్యా పాతకం. ఏ గృహంలో స్త్రీలు బాధించబడతారో ఆ ఇంట లక్ష్మీదేవి ఉండదు.

అగ్నిని, గోవుని, విప్రుణ్ణి అపవిత్రంగా తాకరాదు. రాత్రిపూట లవణం ఉపయోగించరాదు. లవణం చేతిలో వేయించుకోకూడదు. పగిలిన ఆసనంపై కూర్చుండరాదు. రెండుచేతులతో తల గోక్కోకూడదు. పాదాల తడి ఆరి పోకుండా భోజనం చేసేవారు నూరేళ్ల జీవిస్తారు. పావురాలు, గోరువంకలను పెంచుకోవచ్చు. గ్రద్దలు, తుమ్మెదలు, లకుముకి, పిట్టలు ఇంటిలో ప్రవేశించినప్పుడు శాంతి చేయించాలి.

దగ్గినా, తుమ్మినా జలాన్ని తాకి శుచికావాలి. బరువు మోస్తున్నవారిని, గర్భిణులకు, బాలురకు, బ్రాహ్మణులకు, రాజులకు, గోవులకు దారి ఇవ్వాలి. వారిని దాటి వెళ్లిపోవడానికి ప్రయత్నం చేయరాదు.

మానవుడు ప్రతివిషయంలో యథాశక్తి ప్రయత్నం చేయాలి. ప్రయత్నం చేసినా సిద్ధించనప్పుడు దైవసహాయం కోరాలి. కాలం అనుకూలించినప్పుడు, ఏ కార్యమైనా అప్రయత్నంగా నెరవేరుతుంది. ధర్మాధర్మాలు తెలుసుకుని అనుష్ఠించినప్పుడు వారికి కాలం అనుకూలిస్తుంది. నడిపించేది, రక్షించేదీ, ఉత్తమగతిని తీసుకుపోయేది కాలమే.

తుమ్మినప్పుడు 'చిరంజీవ' అనాలి. వ్యాధిగ్రస్తుని చూచి నప్పుడు ఆతనికి ఆరోగ్యాన్ని, ఆయుష్షునూ కోరుకోవాలి. ఆపదలో ఉన్నవాడిని 'నీవు' అని సంబోధించరాదు. ఈ నియమాలు పాటించినవాడికి కీర్తి, సంపద లభిస్తాయి.

భక్తితో విష్ణు సహస్రనామాలు పారాయణచేసినవారికి భయం ఉండదు. పాపం అంటదు. బ్రాహ్మణుడు పఠిస్తే వేదాంతి, క్షత్రియుడు పఠిస్తే రాజ్యప్రాప్తి, వైశ్యుడు పఠిస్తే ధనం, శూద్రుడు పఠిస్తే సుఖి అవుతాడు. ఆపదలు తొలగిపోతాయి. ఈ సదాచారాలే మన జీవనానికి ప్రతీకలు.

**గ్రంథసమీక్ష**

## శ్రీరామశతకం

**కవయిత్రి**–కీ.శే.భాస్కర త్రిపురాంబ; **పేజీలు**– 52; **సైజు**– 1/8 డెమ్మీ; **మూల్యం**–అమూల్యం; **ప్రతులకు**– "భాస్కర" పబ్లికేషన్స్, తిరుపతి. సెల్: 94412 76050.


శ్రీరామగాథ మన సంస్కృతికి మూలకందమైనది. కీ.శే.భాస్కర త్రిపురాంబ లేఖినినుండి వెలువడిన శ్రీరామ శతకం తెలుగువారికి ప్రీతిపాత్రమైన కందఛందస్సులో రూపు దిద్దుకోవడం దైవసంకల్పమే. రామాయణం తొలినుండి నేటి వరకు ఎందరు రచించినా వారిని వాహికలుగా చేసుకొని దైవమే ధర్మరక్షణకోసం తనకు తానుగా కవితారూపంలో వ్యక్తమౌతోంది. ఈ కందపద్యరామాయణంలో పదం పదంలోను కవయిత్రి సహజమైన, నిష్కల్మషమైన భక్తి, నిబద్ధత తొణికిసలాడుతున్నాయి. రామాయణ పారాయణదీక్ష, బహుగ్రంథ పరిశీలనాదక్షతలతో ఈ శతకం రూపుదిద్దుకుంది. ఈ శతకం సుగంధమై ప్రతి పాఠకుని మనస్సు వరిస్తుంది. మకరందమై ప్రతి భక్తుని బుద్ధిని ఆవరిస్తుంది.

*– శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు.*

యువత

# 'నరకాసురవధ' సందేశం

– శ్రీ యం.రవితేజ



ప్రాగ్జ్యోతిషనగరాన్ని పరిపాలించే నరకాసురుడు రాజైనప్పటికీ అతడు రాక్షసుడు. ఒకప్పుడు హిరణ్యాక్షుడు భూదేవిని సముద్రంలో దాచిపెట్టాడు. అప్పుడు భూదేవిని రక్షించటానికి మహావిష్ణువు వరాహావతారాన్ని ధరించి రాక్షససంహారం చేశాడు. ఆ తరువాత స్వామికి భూదేవికి కలిగిన పుత్రుడే ఈ నరకాసురుడు. దేవపుత్రుడయినప్పటికి రాక్షసలక్షణాలు కలవాడు. అనేక రాజ్యాలమీద దండయాత్రలుచేసి పదహారువేలమంది రాజకుమార్తెలను చెఱసాలలో బంధించాడు. అంతేకాక సాధుసత్పురుషులను హింసించటం, యజ్ఞయాగాదులను ధ్వంసం చేయడం, దేవతలను హింసించడం మొదలుగాగల దుర్మార్గాలు చేసేవాడు. దేవతల ప్రార్థనమేరకు మహావిష్ణువు శ్రీకృష్ణుడిగా భూమిపై అవతరించాడు. నరకాసురునికి మరణం తల్లిచేతనే కలుగుతుందని మహావిష్ణువు భూదేవికి వరం ఇచ్చాడు. అందువలన భూదేవి సత్యభామగా అవతరించి నరకాసురసంహారం చేసిందన్నది భాగవతపురాణకథనం.

ఆధునికయుగంలో చెడుపై మంచి సాధించిన విజయాన్ని "నరకాసురవధ" అని మనం చెప్పవచ్చు. "నరకాసుర" అనే పదాన్ని నేటి కాలాన్నిబట్టి మనం ఇలా విభజించి చెప్పవచ్చు. "నర" అంటే "మానవుడు" "కాసు" అంటే "ధనం" "సుర" అంటే "మద్యము". మానవుడు కాసుకు, సురకు బానిసగా మారి మానవసంబంధాలను, అనుబంధాలను, స్నేహబంధాలను, కడకు మానవత్వాన్ని, తల్లి, తండ్రి, భార్య, బిడ్డలు, సోదరసంబంధాలకుకూడా దూరమవుతున్నాడు. శారీరక, మానసికరుగ్మతలకు దగ్గరవుతున్నాడు.

"జంతూనాం నరజన్మ దుర్లభం" అంటారు కదా! సృష్టిలోని 84లక్షల జీవరాశులలో ఎన్నో జన్మలను ఎత్తిన తరువాత మానవజన్మ లభిస్తుంది. భగవత్ప్రసాదంగా లభించిన ఆ మానవజన్మను సార్థకపరచుకోవడం మనిషిగా పుట్టిన ప్రతివారి లక్షణం. కాని మనిషి స్వార్థపరుడయి తాను తన సుఖంతప్పితే ఇతరులగురించిన ఆలోచన చేయటం లేదు.

"నర" అంటే మనిషిగా జన్మించినందుకు ఇతరులకు కలిగిన కష్టాన్ని తీర్చగలగాలి. ఇతరులకు సాయపడాలన్నా, వారి కష్టాన్ని తీర్చాలన్నా ధనం అవసరం. "ధనం" అంటే "కాసు" కదా! ఆ ధనం సంపాదించడానికి మనిషి నేడు ఎన్నో అవినీతిమార్గాలను అనుసరిస్తున్నాడు. ధనసంపాదనే ధ్యేయంగా బ్రతుకుతున్నాడు.

"ధన మూల మిదం జగత్" అన్నది సూక్తి. కానీ ఆ డబ్బే లోకం కాకూడదు. మనిషి డబ్బును సంపాదించాలేగాని దానికి దాసోహం అనరాదు. న్యాయంగా సంపాదించిన ధనానికి ఉన్న విలువ, సంతృప్తి చెప్పడం అసాధ్యం. సంపాదించిన ధనాన్ని సద్వినియోగం చేసుకోగలగాలి. అప్పుడే కీర్తిప్రతిష్ఠలను పొందగలుగుతాడు. అలాకాకుండా దుర్వ్యసనాల పాలయితే తాను మాత్రమేకాక తన వారందరు బాధలకు లోనవుతారని గుర్తించాలి.

నేటి సమాజంలో మనిషి చెడిపోవడానికి పలు కారణాలు కనబడుతున్నాయి. అనేక చెడువ్యసనాలకు లోనవు తున్నారు. అనారోగ్యంపాలుచేసేది, అపవాదులపాలుచేసేది, కడకు మృత్యువుకు దగ్గరచేసేది సురాపానము లేక మద్య పానమే అని గట్టిగా చెప్పొచ్చు.

"సుర" అంటే యజ్ఞయాగాదులలో దేవతలు త్రాగేదం టారు. కాని దానిని సోమపానము అంటారు. సురాపానమంటే రాక్షసులు త్రాగేది. కనుకనే సురాపానం చేయగానే మనిషి రాక్షసుడుగా మారుతున్నాడు. "సుర" అంటేనే దేవతలు అని అర్థం. "సురాపానం" మాత్రం రాక్షసప్రవృత్తికి సంబంధించినది. సురాపానం ముందు నలుగురికోసం ప్రారంభమై, ఆ తరువాత అలవాటుగా మారి వ్యసనంగా రూపాంతరం చెందుతుంది. ప్రారంభంలోనే నిగ్రహంతో ఉంటే వ్యసనంపాలుకాకుండా మనిషి తనను తాను కాపాడుకోవచ్చు.

సురాపానం చేసినవారికి పంచమహాపాతకాలు చుట్టు కుంటాయని శుక్రాచార్యుని శాపం. బ్రహ్మహత్యాపాతకం, భ్రూణహత్య, సువర్ణస్తేయం, గురుపత్నీసాంగత్యం, పై నాలిగింటిని సమర్థించడం అనేవి పంచమహాపాతకాలు అంటారు. కానీ ఒక్క సురాపానంతోనే ఇన్ని పాతకాలు మనిషిని చుట్టుముడతాయి. సురను త్రాగినవారు మనోనిగ్రహాన్ని కోల్పోయి ఏం మాట్లాడతారో తెలియనిస్థితికి వెళతారు. ఏమి చేస్తున్నారో వారికి తెలియకుండా అనేక అకృత్యాలకు పాల్పడుతున్నారు. ఒకసారి మద్యపానానికి అలవాటైన మనిషి మారటం, దాన్ని మానటం చాలా కష్టం. అది వ్యసనంగా మారితే మరీ ప్రమాదం. ముందు తనను నవ్వులపాలు చేస్తుంది. ఆ తర్వాత తన కుటుంబం, తన భార్యాపిల్లలను కడగండ్లపాలు చేయడమేకాక మృత్యువుకు దగ్గరచేస్తుంది. సురాపానానికి దూరంగా ఉన్న మనిషి జీవితం ఆనందంగా సాగుతుందన్నది నిర్వివాదాంశం. కనుక అవివేకంతో సురను సేవించటంవలన నైతికతను కోల్పోతున్నారు. మనలో దాక్కు న్నటువంటి "నర+కాసు+సుర"ని వధించడం మనిషి కర్తవ్యం.

నరకాసురుడు అంటే ఎక్కడో యుగాలపూర్వం ఉన్న రాక్షసుడు కాదు. మనిషిలో అంతర్లీనంగా ఉన్నటువంటి ప్రవృత్తే నరకాసురుడు. నరకాసురుడు అంటే మరొకఅర్థాన్నికూడా చెప్పవచ్చు. "నరక+అసురుడు"అనగా "నరక" అంటే "నరకము", "అసుర" అంటే రాక్షసత్వం. మనిషిలోని అవినీతే "నరకం", మత్తుకు లోనవడమే "రాక్షసత్వం" అనికూడ సమర్థించవచ్చు. మద్యమనే రాక్షసుని బారినపడి మనిషి తన జీవితాన్ని కోల్పోతున్నాడు. ఇటువంటి పరిస్థితి రాకుండా సంయమనంతో జీవితాన్ని గడుపుకుంటూ పదుగురికి ఉపకారం చేస్తూ మానవతతో జీవిస్తూ "పరోపకారార్థం ఇదం శరీరం" అన్న సూక్తిని సార్థకం చేసుకోగలగాలి. అప్పుడే భగవంతుడు ప్రసాదించిన ఈ మానవజన్మ సార్థకమవుతుంది. మానవజన్మ ఎత్తటం గొప్పకాదు. ఆ జన్మకు పరిపూర్ణతను సంపాదించుకోవ టానికి మన శక్తియుక్తులను, బుద్ధికుశలతను ఉపయోగించి నపుడు మాత్రమే మనిషి మనీషిగామారి మహత్తరకార్యాలను సాధించగలడు. ఇదే యువత గుర్తుంచుకోవలసిన ఉత్తమ లక్షణం.

"సుర నరుణ్ణి అసురుడిగామారిస్తే
బుద్ధి అతణ్ణి మానవుడిగామార్చి
యుక్తితో మహనీయుడిగా ఎదగ"

వచ్చునన్నది దీనిద్వారా మనకు తెలుస్తోంది.

## ఆగష్టు నెల క్విజ్-37 సమాధానాలు

| | |
|---|---|
| 01) మహేంద్రుడు | 09) మధుకైటభులు |
| 02) హేమకంరుడు | 10) అగస్త్యమహర్షి |
| 03) భూకైలాసం | 11) ముళ్ల ఉచ్చింతకూర |
| 04) శ్రీవైకుంఠంలో | 12) ఋషిపంచమీ వ్రతం |
| 05) కశ్యప ప్రజాపతి | 13) రవీంద్రనాథఠాకూర్ |
| 06) అబద్ధాలాడేవారిండ్లలో | 14) భగవద్గీత |
| 07) దేవకి | 15) గుండేపల్లి కుప్పయ్య శర్మ |
| 08) మాధవుడు | |

**సరైన సమాధానాలు వ్రాసినవారు-**

1)జె.లక్ష్మణ్‌వీర్, కుప్పం 2)బి.సూర్యక్రిష్ణవిరాజ్ శర్మ, బెంగళూరు 3)శ్రీకృతి, హైదరాబాదు 4)కె.దుర్గ, యానాం 5)కె.లిఖిత్, హైదరాబాదు 6)పి.లక్ష్మిశ్రీ అన్విత, విశాఖపట్నం 7)ఎన్.గౌతమ్ మహేష్, తూర్పుగోదావరి 8)ఎన్.సత్యసూర్యహరిశ్చంద్రప్రసాద్, పశ్చిమగోదావరి 9)ఎస్.సాత్విక్, మెదక్ 10)కె.పూజిత్, విజయవాడ 11)పి.హంసిని, విజయవాడ 12)డి.కావ్య, విజయవాడ 13)కె.అభికృష్ణ, హైదరాబాదు 14)ఎమ్.లక్ష్మీఅమృత్, విజయవాడ 15)కె.శ్రీచరణ్, సూర్యాపేట 16)బి.సాయిసాహిత్య, కుప్పం 17)టి.నాగలక్ష్మి, తిరుపతి 18)ఎమ్.కీర్తిక, అనపర్తి 19)జి.అతులిత్‌రెడ్డి, హైదరాబాదు 20)ఎం.అభిజ్ఞ, హైదరాబాదు 21)ఎన్.వెంకటనాగవీక్షిత్, గుంటూరు 22)జి.కౌండిన్య క్రిష్ణం నాయుడు, శ్రీకాకుళం.

జ్యోతిషం

# చంద్రగ్రహారాధన-మనోవైకల్యనివారణ


- శ్రీ సదాశివుని లక్ష్మణరావు,
92477 83307

మానవులమనసుపై ప్రభావం చూపే గ్రహం చంద్ర గ్రహం. సంపూర్ణ మానసికఆరోగ్యం చంద్రగ్రహారాధనతో సాధ్యం.

సమస్తజీవులలో మానవజాతి సర్వోత్కృష్టమైనది. అటువంటి మానవులకు మనసే ప్రధానమైనది. మానవుల మనసుపై ప్రభావం చూపే గ్రహం నవగ్రహాలలో ఒకటైన చంద్రగ్రహం. (జ్యోతిషశాస్త్రప్రకారం ఆదిత్యాది నవగ్రహాలలో రెండవది చంద్రగ్రహం. నిజానికి ఖగోళశాస్త్రప్రకారం ఇది ఉపగ్రహమే). చంద్రగ్రహప్రభావంతోనే వివిధరకాల ఓషధులు, వనమూలికలు తమ ఔషధగుణాలను పొందగలుగుతున్నాయి. ఈ ఓషధులు మానవుల శారీరకఆరోగ్యానికి విరివిగా వాడడం జరుగుతోంది.

చంద్రుని గ్రహసంచారం మేషాది 12 రాశుల్లో ఒక్కొక్క రాశిలో 2 రోజుల 6 గంటలు మాత్రమే.. రెండుంబావు రోజులన్నమాట. కానీ ప్రతీ 30 రోజులకోసారి మళ్ళీ మళ్ళీ సంచారం చేస్తుంటాడు. అందువలన చంద్రగ్రహప్రభావం విస్మరించలేనిది.

మానవుల మానసికరుగ్మతలు తొలగడానికీ.. సంపూర్ణ మానసికఆరోగ్యానికి.. మనోబలానికి.. ప్రతిఒక్కరూ తమ గురించిగానీ, కుటుంబసభ్యులలో ఏ ఒక్కరిగురించిగానీ మానసికఆరోగ్యం పొందడానికి చంద్రారాధన చేస్తారు. ఈ క్రింద వివరంగా తెలిపినవిధంగా చంద్రారాధన చేస్తే సత్ఫలితాలను పొందుతాం.



1) పౌర్ణమినాడు చంద్రోదయసమయంలో రాగి పాత్రయందు తేనె కలిపిన పాయసం వండి చంద్రునికి సమర్పించిన చంద్రుడు తృప్తి చెందుతాడు. ఇతడు తృప్తిచెందితే ఆదిత్యుడు, విశ్వదేవ, వాయుదేవ, మరుద్గణములు తృప్తి చెందుతారు.

2) చంద్రశాంతికొరకు సోమవారవ్రతం, శివోపాసన, శివస్తుతి, దుర్గాపూజ చేయాలి.

3) బియ్యం, తెల్లనివస్త్రం, వెండిని దానంగా ఇవ్వాలి. ముత్యములను, ఎద్దును బ్రాహ్మణునికి దానంగా ఇవ్వాలి. ముత్యమును ధరించాలి.

4) సోమనాథ్‌చంద్రదోష నివారణార్థం జ్యోతిర్లింగ క్షేత్రం దర్శించాల్సిన క్షేత్రం. (తూర్పుగోదావరిజిల్లా కోటిపల్లి లోని చంద్రప్రతిష్ఠ సోమేశ్వరస్వామివారి క్షేత్రం.)

5) చంద్రగ్రహానికి సంబంధించిన వివిధప్రార్థనల్లో ఏదోఒకటి ప్రతినిత్యమూ పఠించిన మానసికఆరోగ్యాన్ని పొంద గలం. అవే ఇవి:

### చంద్రగ్రహ జపమంత్రం

**ఆప్యాయస్వ, సమేతుతే, విశ్వతస్సోమ వృష్ణియం, భవా వాజస్య సంగథే**

ఓం శ్రాం శ్రీం శ్రౌం సః చంద్రమసే నమః

## ప్రార్థనలు

1) శ్లో॥ దధిశంఖ తుషారాభం, క్షీరోదార్ణవ సమ్భవమ్
నమామి శశినం సోమం, శంభోర్మకుట భూషణమ్

2) శ్లో॥ జటాధర శిరోరత్నం, శ్వేతవర్ణం నిశాకరం
వాసుదేవస్య నయనం, శంకరస్య చ భూషణమ్

3) శ్లో॥ గదాధర ధరం దేవమ్, శ్వేతవర్ణం నిశాకరం
ధ్యాయేదమృత సంభూతమ్ సర్వకామ ఫలప్రదం

4) శ్లో॥ సోమం ద్విభుజ పద్మంచ, శుక్లాంబరధరం శుభమ్
శ్వేత గంధానులేపంచ, ముక్తాభరణ భూషణమ్

5) శ్లో॥ వసంత బాంధవప్రియో, సితాంశో స్వస్తినః కురు
గగనార్ణవ మాణిక్య, చంద్ర దాక్షాయిణా పతే
(పౌర్ణమి చంద్రుడు)

6) శ్లో॥ క్షీరసాగర సంపన్న, లక్ష్మీ ప్రియ సహోదర
హిరణ్య మకుటాభాస్య, బాలచంద్ర నమోస్తుతే
(నెల పొడువు చంద్రుడు)

7) శ్లో॥ శ్వేతాంబరాన్విత వపుః, పరిశుభ్ర వర్ణం
శ్వేతాశ్వయుక్త రథగం, సురసేవితాంఘ్రిం
దోర్భ్యాం ధృతాభయగదం వరదం సుధాంశుం
శ్రీవత్స మౌక్తిక ధరం, ప్రణమామి చంద్రమ్

## చంద్రగాయత్రిమంత్రం

1) ఓం సుధాకరాయ విద్మహే,
ఓషధీశాయ ధీమహి
తన్నో స్సోమః ప్రచోదయాత్

2) ఓం పద్మధ్వజాయ విద్మహే,
కాలనాథాయ ధీమహి
తన్నో స్సోమః ప్రచోదయాత్

3) ఓం క్షీర పుత్రాయ విద్మహే,
అమృత తత్వాయ ధీమహి
తన్నో శ్చంద్రః ప్రచోదయాత్.



## చన్ద్రాష్టావింశతినామస్తోత్రమ్

శ్రీగణేశాయ నమః

అస్య శ్రీచన్ద్రాష్టావింశతినామస్తోత్రస్య గౌతమ ఋషిః,
సోమో దేవతా, విరాట ఛన్దః, చన్ద్రప్రీత్యర్థే జపే వినియోగః ।

చన్ద్రస్య శృణు నామాని శుభదాని మహీపతే।
యాని శృత్వానరో దుఃఖాన్ముచ్యతే నాత్ర సంశయః॥ 1

సుధాకరశ్చ సోమశ్చ గ్లౌరబ్జః కుముదప్రియః।
లోకప్రియః శుభ్రభానుశ్చన్ద్రమా రోహిణీపతిః॥ 2

శశీ హిమకరో రాజా ద్విజరాజో నిశాకరః।
ఆత్రేయ ఇన్దుః శీతాంశురోషధీష కలానిధిః॥ 3

జైవాతృకో రమాభ్రాతా క్షీరోదార్ణవసమ్భవః।
నక్షత్రనాయకః శమ్భుశిరశ్చూడామణిర్విభుః॥ 4

తాపహర్తా నభోదీపో నామాన్యేతాని యః పఠేత్।
ప్రత్యహం భక్తిసంయుక్తస్తస్య పీడా వినశ్యతి॥ 5

తద్దినే చ పఠేద్యస్తు లభేత్సర్వం సమీహితమ్।
గ్రహాదీనాం చ సర్వేషాం భవేచ్చన్ద్రబలం సదా॥ 6

ఇతి శ్రీచన్ద్రాష్టావింశతినామస్తోత్రం సమ్పూర్ణమ్

## శ్రీచంద్ర అష్టోత్తర శతనామస్తోత్రము

01) శ్రీమాన్ శశిధరశ్చంద్రో తారాధీశో నిశాకరః
సుధానిధిస్సదారాధ్య స్సత్పతిస్సాధు పూజితః

02) జితేంద్రియో జగద్యోనిర్జ్యోతిశ్చక్ర ప్రవర్తకః
వికర్తనానుజో వీరో విశ్వేశో విదుషాంపతిః

03) దోషాకరో దుష్టదూరః పుష్టిమాన్ శిష్టపాలకః
అష్టమూర్తి ప్రియోనంతః కష్టదారు కుఠారకః

04) స్వప్రకాశః ప్రకాశాత్మా ద్యుచరో దేవభోజనః
కళాధరః కాలహేతుః కామకృత్కామదాయకః

05) మృత్యు సంహారకోఽ మర్త్యో నిత్యానుష్ఠాన దాయకః
కృపాకరః క్షీణపాపః క్షయవృద్ధి సమన్వితః

06) జైవాకృతశ్శుశీ శుభ్రో జయాజయఫలప్రదః
సుధామయస్సురస్వామీ భక్తానామిష్ట దాయకః

07) భుక్తిదో ముక్తిదో భద్రో భక్త దారిద్ర్య భంజకః
సామగాన ప్రియస్సర్వ రక్షక స్సాగరోద్భవః

08) భయాంతకృద్భక్తి గమ్యోభవబంధ విమోచకః
జగత్ప్రకాశ కిరణో జగదానందకారణః

09) నిస్సపత్నో నిరాహారో నిర్వికారో నిరామయః
భూచ్ఛాయచ్ఛాదితో భవ్యో భువన ప్రతిపాలకః

10) సకలార్తిహరస్సౌమ్య జనకస్సాధు వందితః
సర్వాగమజ్ఞ స్సర్వజ్ఞో సనకాది మునిస్తుతః

11) సితచ్ఛత్ర ధ్వజోపేత శ్శీతాంగశ్శీతభూషణః
శ్వేతమాల్యాంబరధర శ్శ్వేత మాల్యాను లేపనః

12) దశాశ్వరథ సంరూఢో దండపాణి ర్ధనుర్ధరః
కుందపుష్పో జ్వలాకారో నయనాబ్జ సముద్భవః

13) ఆత్రేయ గోత్రజోఽ_త్యంత వినయః ప్రియదాయకః
కరుణారస సంపూర్ణః కర్కట ప్రభురవ్యయః

14) చతురస్రా పనారూఢశ్చ తురోదివ్యవాహనః
వివస్వన్మండలాగ్నేయ వాసోవసు సమృద్ధిదః

15) మహేశ్వర ప్రియో దాంతో మేరుగోత్ర ప్రదక్షిణః
గ్రహమండల మధ్యస్తో గ్రసితార్కో గ్రహాధిపః

16) ద్విజరాజో ద్యుతిలకో ద్విభుజో ద్విజపూజితః
ఔదుంబర నగావాస ఉదారో రోహిణీపతిః

17) నిత్యోదయో మునిస్తుత్యో నిత్యానంద ఫలప్రదః
సకలాహ్లాదన కరో పలాశ సమిధప్రియ:


18) ఏవం నక్షత్రనాథస్య నామ్నామష్టోత్తర శతం సంపూర్ణం

## చంద్రగ్రహ మంగళస్తోత్రం

శ్లో॥ చంద్ర కర్కటక ప్రభు స్సిత నిభశ్చా త్రేయ గోత్రోద్భవ
శ్చాత్రేయ శ్చతుర శ్రవారణ ముఖశ్చాపే ఉమాధీశ్వరః
షట్సప్తాగ్ని దశైక శోభన ఫలో నోరిర్బుధార్క ప్రియ
స్స్వామీ యాముని దేశపర్ణ సమిధః కుర్యాత్సదా మంగళం

సమాప్తము

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



## కానివానిస్నేహం తగదు

కానివానితోడ కలిసి వర్తించెనా,
హాని వచ్చు నెంతవాని కైన;
తాటికింద పాలు తాగినచందమౌ;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** కానివాడు = తనకు తగనివాడు; హాని = చెడు; తాటికింద= తాటిచెట్టుక్రింద; చందము= వలె.

**భావం:** కానివానితో కలిసి నడిస్తే ఎంతటివానికైనా ఆపదలు కలుగుతాయి. తాటిచెట్టుక్రింద పాలు త్రాగినా కల్లు త్రాగినట్లే అవుతుంది.

**వివరణ:** వివాహమూ, వివాదమూవలె స్నేహంకూడ తగినవాళ్లతోనే చేయాలి. యోగ్యత కలిగినవాడు యోగ్యత లేనివాడితో కలిసి తిరిగితే ఎప్పటి కయినా కీడు తప్పదు. అయోగ్యుడు తనలాభం తాను చూసుకుంటాడు. అందుచేత అవసర మయితే తనతో ఆత్మీయంగా తిరుగుతున్నవాడి కయినా అపకారం చేస్తాడు. పైగా అయోగ్యు లతో కలిసి తిరుగుతుండడం చూసినవాళ్లు వీడుకూడ అయోగ్యుడే అనుకుంటారు. పాలే అయినా, తాటిచెట్టుక్రింద కూర్చుని త్రాగితే, అది తాటికల్లే అనుకుంటారు కాని, పాలు అనుకోరు కదా. అందుకే దుష్టులతో స్నేహం, వారితో కలిసి తిరగడం పనికిరాదు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు



భగవద్గీత సందేశం

# ఇదే ఐశ్వర్యం!!


– శ్రీ పింగళి పాండురంగారావు,
94405 54114


భగవద్గీత హిందువులకు పరమపవిత్రగ్రంథం. ఈ గ్రంథాన్ని శ్రద్ధ, భక్తినిష్ఠలతో చదివి మానవుడు తన కర్తవ్యాన్ని గుర్తించి, పరోపకారభావంతో, యుక్తాయుక్తవిచక్షణతో ప్రవర్తించి, జీవితం సార్థకం చేసుకోవాలన్నదే గీతాహృదయం.

గీత మానవుణ్ణి మాధవునిస్థాయికి చేర్చి, ముక్తిని ప్రసాదిస్తుంది. భవబంధాల్ని తొలగించి. ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించి ఆశీర్వదిస్తుంది. శాంతిని ప్రసాదిస్తుంది. గీత ముక్తిప్రదాయక దివ్యగీత.

గీతలో ముఖ్యంగా ఈశ్వరరూపుడైన శ్రీకృష్ణ నిబోధలు మనకు లభిస్తాయి. మానవునిమనసుకు అందని ఈశ్వరుణ్ణి భగవద్గీతలో నిర్వచించినతీరు మరేఇతర పవిత్రగ్రంథంలో కనపడదు. ఈశ్వరుడు శ్రీకృష్ణునిఅవతారంలో ఈ భూమ్మీదకి దిగి తానెవరో మానవునికి అనేకవిధాలుగా తెలియజేశాడు.

నిజానికి ఈశ్వరుడు ప్రతిహృదయంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. కాని మానవునిమాటలకు, ఇంద్రియానుభవాలకు, మనసుకు మించిన అనుభవంగా అవ్యక్తుడై ఉంటాడు. ఈశ్వరుడు మానసాతీతుడు, రూపరహితుడు. ఆయన ఉనికి నిర్ధారించలేం. కారణం మనిషిజ్ఞానం మానసికం. ఆయన నీ హృదయంలో వెలుగుతున్నాడనే అనుభవం మనసుకు అందదు. ఆత్మస్వరూపుడై పరమాత్మను దర్శించాలంటే నీమనసుతెరను తొలగించాల్సిందే. అపుడే నీ దుఃఖం తొలగిపోతుంది. నీ స్వప్నాలు సాకారమౌతాయి. అంతటితో నీ అన్వేషణ ఆగిపోతుందని చెప్తుంది– భగవద్గీత.

నీ ఆశకు, నీ ప్రశ్నలకు జవాబు ఈశ్వరుడొక్కడే. ఆయన్ని చేరుకుంటేనేగాని శాశ్వతసుఖం లేదు. నీ సంశయాలు తీరవు. వీటన్నింటిని దాటి ఈశ్వరుణ్ణి ఎలా చేరుకోవాలో చెపుతాను విను అంటుంది– విశ్వమతగ్రంథం భగవద్గీత.

ఈశ్వరుణ్ణి చేరుకోవడానికి దారి చూపేవారున్నారు. చేయూత ఇచ్చి సాయం చేయగల్గేవారున్నారు. కాని వారు ఆయన్ని మాత్రం ఇవ్వలేరు. జ్ఞానులు తమకు అంతా తెలుసంటారు. కాని వారు చెప్పింది మనకు అర్థం కాదు. భక్తుల విషయంకూడా అంతే. వారికి భక్తిద్వారా లభించిన తృప్తిని, ఆ మహదానందాన్ని మనకు అందివ్వలేరు. కనుకనే ఎవరికి వారు ఆ ఈశ్వరుని విశ్వసించి, శరణువేడి సాధనద్వారా ఆయన అనుగ్రహంతోనే దర్శనం సాధించాలి. శాంతిని పొందాలి.

పరమాత్మతత్త్వాన్నిగురించి శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు– ఆరు శ్లోకాల్లో– సర్వభూతహృదయస్థితుడైన ఆత్మను నేనే. సర్వభూతాలకు ఆదిమధ్యాంతాన్ని నేనే "ఈ జగత్తుకు తండ్రిని, తల్లిని, ఓంకారాన్ని, ఋగ్యజుస్సామధర్వేదాల్ని, అఖిలజగత్తు భావింపజేసే అర్కద్యుతి, చంద్రకాంతి, అగ్నిజ్వలనం– ఇవన్నీ నా తేజస్సులేనని. తెలుసుకో. నేనే పరమగతి, భరించే వాణ్ణి, ప్రభువును, అన్నింటినీ చూచేవాణ్ణి, నివాసస్థానం, శరణ్యుడను, హితుణ్ణి, ప్రళయకారణం, స్థితికి ఆధారం, రక్షకుణ్ణి, శాశ్వతమైనవాణ్ణి. జ్యోతులన్నింటికి జ్యోతి, తమస్సుకు అతీతుడు. అతడే జ్ఞానం, జ్ఞేయం, జ్ఞానగమ్యం, సూర్యచంద్రుల్లో కాంతి, అన్ని వేదాలలోని ప్రణవం, ఆకాశంలోని శబ్దం, మనుష్యుల్లోని పౌరుషం నేను.

అర్జునుడు శ్రీకృష్ణభక్తుడు, సఖుడు. ఇద్దరూ ఆడుతూ, పాడుతూ తిరిగినవారు. అప్పటివరకు తనమనస్సులో స్థిరీకరించుకున్న స్నేహితుడు ఒక్కసారిగా చేసిన ఈ అద్భుతబోధ విన్న అర్జునుని మనఃస్థితి ఎలా ఉండి ఉంటుందో ఊహించగలమా?

కనుక వేదాంతపరంగా, శాస్త్రపరంగా, నీతిపరంగా, బుద్ధిపరంగా, ఆశపరంగా, అవమానభీతిపరంగా తన ప్రియస్నేహితుణ్ణి లోకోత్తరకాంతిని దర్శించడానికై కనులు తెరిపించటమే శ్రీకృష్ణుని లక్ష్యం, గీతాసారం. అదే ఐశ్వర్యం. అదే శ్రీనివాసం.

*గత సంచిక తరువాయి భాగం....*

శ్రీకరస్వామి ఆ మరునాడు తమ ఆచార్యులు మేల్కోటే వస్తున్నారని, సెల్వ(చెలువ) నారాయణస్వామికి మంగళా శాసనం సమర్పించి, తమ శిష్యుల ఉపన్యాసాన్ని విని ఆశీర్వదించదలచారని ప్రకటించారు. మరునాడు మరి కొన్ని సన్నిధులు దర్శించి సంస్కృతభవనప్రాంగణంలో గుమికూడిన తరువాత మేల్కోటేమాహాత్మ్యంగురించి ఉపన్యసిస్తానని, యాత్ర ముగింపుకు వస్తుందని ప్రకటించారు. ప్రసాదవినియోగం జరిగింది. అదే రాత్రి భోజనం. దివ్యయాత్రికులు ప్రసాదాన్ని ప్రీతితో స్వీకరించారు. కర్ణాటకప్రాంతం పులిహోర ఎంతో రుచిగా, మధురంగా ఉంటుంది. చక్రపొంగలి, వెణ్‌పొంగలి కూడా రుచి చూచి ఎంతో ఆనందించారు.

శ్రీవైష్ణవఆలయ సన్నిధులలో ప్రసాదం చేతులతో నోటిలో పెట్టుకోవటం సంప్రదాయవిరుద్ధం. ఆరోగ్యరీత్యాకూడా మంచిదికాదు. ప్రసాదం గ్రహించి కొందరు అదేవిధంగా నోటిలో పెట్టుకున్నతరువాత బయటికివెళ్లి చేతులు కడుక్కో కుండా ఆలయస్థంభాలకు పులమడం నారదులవారు చూచి మానవులను సరిదిద్దటం సాధ్యం కాదు అని భావించారు. శ్రీకరస్వామి వాళ్ళకు అది అపచారమని తెలియజెప్పగా వాళ్ళు బయటికివెళ్లి చేతులు కడుక్కుని వచ్చారు.

శ్రీకరస్వామి కుమారుడు ఐదేళ్ల వరదవేదాంత దేశికన్ నోటికి చెయ్యి తగలకుండా ప్రసాదం ఆరగించి, బయటికివెళ్లి అరిటాకు పారవేసి, చెయ్యి, నోరు శుభ్రం చేసుకుని, కాళ్ళు కడుక్కుని సన్నిధిలోనికి రావటం చూచి నారదుడు ఎంతో సంతోషించారు. ఆ బాలుడిదగ్గరకు వారు వెళ్ళినప్పుడు ఎంతో వినమ్రంగా నమస్కరించాడు. నారదులవారు బాలుడిని దీవిం చారు. ఈ బాలుడు తండ్రిని మించిన తనయుడు అవుతాడని నారదుడు అనుకున్నారు. దివ్యయాత్రికులు కనుచూపులతోనే శ్రీ శ్రీ శఠకోపరామానుజజీయర్‌ను కుశలప్రశ్నలు వెయ్యటం శ్రీకరస్వామి గమనించారు. వారు దివ్యస్వరూపులని బ్రహ్మజ్ఞాని జీయర్ గుర్తించారు. యతివరులు దివ్యజ్ఞానపరిపూర్ణులని శ్రీకరస్వామికి తెలుసు.

శ్రీకరస్వామి అందరిదగ్గర సెలవు తీసుకున్నారు. సంస్కృతఅకాడమీ అతిథిగృహంలో, బంగారు ధర్మశాల అహోబిలమఠంలో వసతి ఏర్పాటైంది. చక్కటి ఏర్పాట్లను చేసిన శ్రీకరస్వామికి అందరూ ధన్యవాదాలు అర్పించారు. ధర్మశాల

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు


ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్
97388 59553


ఎదురుగా ఉన్న మఠంలో శ్రీ శ్రీ జీయర్ దర్శనం కోసం శ్రీకరస్వామి వెళ్లారు.

**శ్రీ శ్రీ రంగప్రియ రామానుజస్వామి ఆగమనం-** మరునాడు ఉదయాన్నే అందరూ కల్యాణిపుష్కరిణిలో స్నానం చేశారు. శ్రీకరస్వామి అందరికీ మేల్కోటేలోని అష్టతీర్థ ప్రాశస్త్యం వివరించారు. వెనుకకు మరలి వచ్చాక తిరునారా యణస్వామి, యదుగిరి నాచ్చియార్, ఎమ్పెరుమానార్, పిళ్ళై లోకాచార్యుల దర్శనం చేసుకున్నారు. బయటికివచ్చి ప్రధానసన్నిధి ఎదుట నున్న శ్రీబదరీనారాయణసన్నిధిలో దర్శనం చేసుకున్నారు. అటుపై వరుసగా స్వామి దేశికసన్నిధి, నంజియ్యర్‌తిరుమాళిగ, ఎమ్పెరుమానార్ నివసించి, స్థాపించిన యతిరాజమఠం, మేల్కోటే వాస్తవ్యులైన శ్రీఆదివణ్ శఠకోపజియ్యర్ స్వామి స్థాపించిన అహోబిలమఠం దర్శించారు.

సంస్కృతఅకాడమీ ఆవరణలో అర్సి బియ్యపురవ్వ ఉప్మా, వడ, కాఫీలతో ఉదయాహారం ఏర్పాటైంది. శ్రీశ్రీ రంగ ప్రియస్వామి వస్తున్నారని సహాయకులు తెలియజేశారు. అందరూ సన్నిధికి చేరుకున్నారు. శ్రీశ్రీ రంగప్రియస్వామికి ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం చెప్పారు. శ్రీకరస్వామి గోమాతను చేరుకున్న వత్సంలాగా తమ ఆచార్యులను అనుసరించారు. తమ గురువు ఎదుట ఉపన్యాసం ఇవ్వటం ఆయనకు కొద్దిపాటి ఆందోళన కలిగించింది.

తాయార్‌సన్నిధికి చేరుకోగానే శ్రీశ్రీ రంగప్రియస్వామి 'హే జగన్మాతా! మహాలక్ష్మీ!' అని మంగళాశాసనం చేశారు. పెరుమాళ్‌సన్నిధిలో భక్తిపారవశ్యంలో 'హే నారాయణా!' అని పెరుమాళ్, సెల్వపిళ్ళైలిద్దరికీ మంగళాశాసనం చేశారు. పేశుమ్ యతిరాజులసన్నిధి చేరుకొని ధ్యానస్థితిలో మైమరచిపోయి ఆనందబాష్పాలు విడిచారు. పిళ్ళైలోకాచార్యులకు నమస్కరించి సన్నిధి ప్రాంగణం బయట బదరీనారాయణసన్నిధికి చేరుకున్నారు. భగవానుడు తన ప్రియపుత్రునికి మంత్రోపదేశం చేసిన పవిత్రప్రదేశం కావటంచేత ఈ స్థలం 'దక్షిణబదరి'గా ప్రసిద్ధమైందని శ్రీకరస్వామి యాత్రికులకు వివరించారు.

శ్రీశ్రీ రంగప్రియస్వామి దేశికసన్నిధిలో మంగళాశాసనం సమర్పించారు. భగవానుని ఏకాంతసేవలో దివ్య యాత్రికులు పాలుపంచుకున్నారు. ఆ తరువాత మఠస్థాపకులైన ఆదివణ్ శఠకోప జియ్యర్ సన్నిధికి చేరుకొని మంగళాశాసనం అర్పించి శ్రీశ్రీ శఠకోప రామానుజజీయర్‌సన్నిధికి చేరుకున్నారు. ఇరువురూ సంస్కృతఅకాడమీ చేరుకున్నారు. అకాడమీ నిర్దేశకులు డాక్టర్ భాష్యం స్వామి వారిద్దరికీ పూర్ణకుంభ మర్యాద జరిపారు. శ్రీవైష్ణవ సంప్రదాయ విద్వాంసులు, ఇతర మేల్కొటే పండితులు, దివ్యయాత్రికులు, అందరికీ నిర్దేశకులు స్వాగతం పలికారు.

పద్మపురాణంలో యదుగిరిమాహాత్మ్యప్రసక్తి ఉన్నది. ఈ పవిత్రక్షేత్రం కృతయుగంనుండి ఉనికిలో ఉన్నది. దీని పేరే తిరునారాయణపురం. మూలవరులు సెల్వనారాయణుడు తిరునారాయణుడిగా ప్రసిద్ధుడు. బ్రహ్మదేవుడు ఆరాధించిన మూర్తి.

**ప్రహ్లాదునిశకం-** కళ్యాణీతీర్థంప్రక్కనే యదుగిరిపర్వతముపై అద్భుత కేసరి యోగనృసింహ భగవానుడు సుందరదరహాసంతో దర్శనమిస్తాడు చూడమని శ్రీకరస్వామి యాత్రికులతో చెప్పాడు. తన ప్రియభక్తుడు ప్రహ్లాదునికోసం ఈ అవతారంలో ప్రకటమైనాడు. హిరణ్యకశిపువధతరువాత నరహరి ప్రహ్లాదునికి పట్టాభిషేకం చేయగా ప్రహ్లాదుడు సమర్థతతో రాజ్యపాలన చేశాడు. కానీ ప్రహ్లాదుని మనసులో తాను తండ్రి మరణానికి కారకుడినని, పితృహత్య చేశానని అపరాధభావం నిలువనీయక బాధ పెడుతుండగా భగవానుడు ప్రహ్లాదుడిని యదుగిరిలోని కళ్యాణితీర్థంలో స్నానం చేస్తే మనస్తాపం తొలగిపోతుందని చెప్పగా ప్రహ్లాదుడు తన నిత్యారాధన సాలగ్రామంతో కళ్యాణి తీర్థంలో స్నానంచేసి, యదుగిరిపైకి చేరుకొని అచ్చటి ప్రశాంతతకు ముగ్ధుడై సాలగ్రామ ఆరాధన నిర్వహించగా హఠాత్తుగా సాలగ్రామంనుండి నరసింహమూర్తి ఉద్భవించి అక్కడ స్వయంభువుగా కొలువైనాడు.

ఆ మూర్తి ఇప్పుడు మనం చూస్తున్న యోగనరసింహ మూర్తి. తండ్రి మరణంగురించి బాధపడుతున్న ప్రహ్లాదునికి అసురుడిగతాన్ని విప్పి చెప్పాడు నృసింహుడు. 'నీ తండ్రి నా ద్వారపాలకుడు జయుడు. శాపవశాన అసురజన్మ కలిగింది. నా చేతులలో మరణాన్ని కోరుకున్నాడు. భవిష్యత్తులో రామావతారంలో నేను పితృవాక్యపరిపాలనాధర్మం పాటించబోతున్నాను. నా తండ్రి అగ్నిలో దూకమన్నా, విషపానం చేయ మన్నా, నదిలో దూకమన్నా సిద్ధమని చెబుతాను. ప్రహ్లాదా, నీవు అవన్నీ నాకన్నా ముందే చేశావు కదా. అలా పితృవాక్యాన్ని పాటించిన నిన్ను నేను కాపాడాను. నీవు పితృవాక్యపరిపాలన చేశావు తప్ప నీ తప్పేమీ లేదు' అని ప్రహ్లాదుని అనునయించి మేల్కొటేలో భక్తజనుల కన్నులపండువుగా పూజలందుకుంటున్నాడు.

**రామావతార కాలం-** మేల్కొటే యాదవాద్రి లేదా యదుగిరిగా సుప్రసిద్ధం. ఈ పుణ్యతీర్థానికి త్రేతాయుగంలో రామావతారంతో, ద్వాపరంలో కృష్ణావతారంతో సంబంధం ఉన్నది. విభీషణునికి తమ కులధనం శ్రీరంగనాథునిమూర్తి కానుక చేసిన తరువాత అయోధ్యలో పూజామందిరంలో శూన్యాన్ని పూరించడానికి శ్రీరాముడు ఒక విష్ణుభగవానుని అర్చామూర్తిని ఆరాధన నిమిత్తం ప్రతిష్ఠించాడు. రామావతార పరిసమాప్తి తరువాత ఆ అర్చామూర్తిని కుశలవులు 'రామప్రియ'గా ఆరాధించారు. ఇది అయోధ్యలో ద్వాపరయుగంవరకు పూజలు అందుకున్నది.

*(ఇంకా ఉంది)*



# శ్రీవేంకటేశ్వరలీలలు

# కల్యాణస్వామి

- శ్రీమతి కె. అలేఖ్య, 98498 11755

మాది అమలాపురం, తూర్పుగోదావరిజిల్లా. మాది మధ్యతరగతి కుటుంబం. మా నాన్నగారు చిన్న వ్యాపారి. నాకు ఇద్దరు అన్నయ్యలు. మాకు వేంకటేశ్వరస్వామి అంటే అపారమైన భక్తి. మాకు తిరుపతి వెళ్ళాలి అని మొక్కు ఉంది. అది నా చిన్నతనంలో, మా ఆర్థికపరిస్థితివలన వెళ్లలేకపోయాం.

అది నేను పుట్టినప్పుడు మొక్కు అంట. అది నా 14వఏట తీరింది. మొత్తంమీద కొంత డబ్బులు కూడబెట్టుకుని కుటుంబమంతా తిరుపతి బయలుదేరాం. ఇది జరిగింది 1990లో. అప్పుడు అక్కడ ఆన్‌లైన్ బుకింగ్స్ వగైరా లేవు. మేము క్షేమంగా కొండకి చేరాం. కల్యాణకట్టదగ్గర తలనీలాలు సమర్పించి స్వామిదర్శనం చేసుకున్నాం. ఇంకా మాకు కల్యాణంమొక్కు ఉంది. అయితే, అక్కడ క్యూలో నిలబడి ఉన్నాం. మొదటిసారి మాకు కల్యాణంటిక్కెట్టు దొరకలేదు. చాలా నిరుత్సాహపడ్డాం. మాకు రెండురోజులు మాత్రమే ఉంది. మళ్లీ ప్రయత్నం చేద్దాం అని మా నాన్నగారు, మా అన్నయ్యలు ముగ్గురు విడివిడిగా క్యూలో ఉన్నారు.

నేను మా అమ్మ బయట నిలబడి నారాయణ, నారాయణ అని స్వామిని కల్యాణంటిక్కెట్టు ఇప్పించు అని ప్రార్థిస్తున్నాం. ఇంతలో ఎవరో వెనకనుంచి అమ్మ అని పిలిచారు. వెనకకి తిరిగిచూస్తే ఎవ్వరూ లేరు. ముందుకు తిరగ్గానే మా పెద్దన్నయ్య కల్యాణంటిక్కెట్టు దొరికింది అని చెప్పాడు. అంతే మా ఆనందానికి అంతులేదు. ఆ స్వామే స్వయంగా అమ్మా నేను ఉన్నాను అని పిలిచి కల్యాణంటిక్కెట్టు ఇప్పించాడు అని అనుకున్నాం. తర్వాత ఎంతో సంతోషంతో కల్యాణంలో పాల్గొన్నారు మా తల్లిదండ్రులు. నమ్మినవాళ్లకి ఆ స్వామి ఎప్పుడు అండదండలు ఉంటాయి అనే నిదర్శనం మాకు ఆ రోజు కలిగిన ఆనందంతో తెలిసింది. తిరుపతి వెళ్లి వచ్చినతర్వాత మా కుటుంబం అంచలంచలుగా ఎంతో ఎదిగి స్థిరపడ్డాం.

ఇది జరిగి 25 సంవత్సరాలు అయ్యింది. ఇంకా నా కళ్లముందు ప్రతీది గుర్తుంది. నేను మా అన్నయ్యలు పిల్ల పాపలతో మంచిగా ఉన్నాం అంటే ఆ స్వామి ముందుండి నడిపిస్తున్నాడని నమ్ముతాం. అందులో ఎలాంటి సందేహము లేదు.

నా అదృష్టంకొద్దీ నా భర్తకూడ స్వామి ఆరాధకులు. మా పెళ్లి ఆయనే జరిపించాడు అనుకుంటాం. మేము ప్రతి సంవత్సరం తిరుపతికి వెళ్లి ఆ స్వామిని దర్శించుకుంటాం. నేను ఆ స్వామిముందుకు వెళ్లగానే నాలో ఇప్పటికి ఏదో తెలియని తన్మయత్వం. నా కంట కన్నీరు అలా ధారలుగా వస్తుంది. అది ఏమిటో నాకు ఇప్పటికి తెలియదు మా మీద నీకు ఎంత దయ స్వామి అని, గోవింద గోవింద అని కన్నీరుతో స్వామి దర్శనం చేసుకొని ఆనందంతో బయటకు వస్తాను. నమ్మినవాళ్లకి ఆ స్వామి అన్నీ తానై చూసుకుంటారు. అందరికి ఆ స్వామి కృపాకటాక్షాలు ఉండాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

గోవిందా హరి గోవిందా.. వేంకటరమణ గోవిందా!



# తిథులు వాటి దేవతలు

- శ్రీమతి కె.నిర్మల, 78930 42878

నెలకు రెండు పక్షాలుంటాయి. ఒక్కొక్కపక్షంలో 15 తిథులు ఉంటాయి. ఆ రెండు పక్షాలను శుక్లపక్షం, కృష్ణపక్షం అంటారు. పాడ్యమినుంచి అమావాస్య లేదా పౌర్ణమి అనే తిథులవరకూ ఏ పక్షంలో వస్తే, ఆ పక్షం పేరు, తిథి పేరు చెప్పారు. ఆ 15 తిథులకు 15మంది అధిదేవతలు ఉన్నారు. అవే ఇవి:

### 01) పాడ్యమి

పాడ్యమి తిథులలో మొదటిది. పాడ్యమికి అధిదేవత అగ్నిదేవుడు. దేవతలలో మొదట ఆవిర్భవించాడు అగ్ని. ఆ రోజున అగ్నిదేవుని పూజించడం మంచిది. యజ్ఞాలలో, హోమాలలో అగ్నిహోత్రం తప్పకుండా ఉంటుంది. ఆహారం తయారవ్వాలంటే తప్పనిసరిగా అగ్ని ఉండవలసిందే.

### 02) విదియ

విదియ తిథికి బ్రహ్మ అధిపతి. బ్రహ్మ సృష్టికార్యాన్ని నిర్వర్తిస్తాడు. ఈయన చతుర్ముఖుడు. త్రిమూర్తులలో ఒకరు.

### 03) తదియ

తదియకు పార్వతీదేవి అధిపతి. ఈ తిథినాడే గౌరీ కల్యాణం జరిగింది. తదియనాడు పార్వతీదేవిని పూజిస్తే స్త్రీలకు సౌభాగ్యం పెంపొందుతుంది. అట్లతద్దె, ఉండ్రాళ్లతద్దె తదియ తిథినాడే వస్తాయి.

### 04) చవితి

వినాయకుడు చవితికి అధినాయకుడు. ఇది వినాయకుడు పుట్టిన తిథి కనుక, ఈ రోజు వినాయకుని గరికతో పూజించి ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యంగా ఆ స్వామికి సమర్పిస్తే, జీవితంలోని ఒడిదుడుకులు, పనులజాప్యం, చేపట్టిన పనులకు ఏర్పడే అవరోధాలు తొలగిపోతాయి. ప్రతి చవితికి వినాయకుడిని పూజించడంవల్ల, ఆ స్వామి అనుగ్రహాన్ని పొందవచ్చు.

### 05) పంచమి

పంచమికి ఆదిశేషుడు అధిపతి. పంచమినాడే నాగులకు జన్మ లభించింది. నాగులకు చవితి, పంచమి, షష్ఠి తిథులు ప్రీతికరమైనవి. సంతానం లేనివారు పుట్టలో పాలు పోసి, నాగపూజ చేస్తే, వారికి సంతానభాగ్యం ప్రాప్తిస్తుంది. నాగలోకం నాగుల నివాసస్థలం. భూగర్భంలో పుట్టలో పాములు నివసిస్తాయి. పంచమికి అధిపతి అయిన ఆదిశేషుడు విష్ణువుకు తల్పంగా ఉన్నాడు.

### 06) షష్ఠి

షష్ఠి కుమారస్వామి జన్మతిథి. ఈయనకే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అనే మరోపేరు ఉంది. కుమారస్వామి షష్ఠితిథికి అధిపతి. షష్ఠినాడు కుమారస్వామిని దర్శించి పూజిస్తే పుత్ర సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.

### 07) సప్తమి

సప్తమి సూర్యభగవానుని జన్మదినం. సూర్యుని ఆరాధించి, పూజించే దినం రథసప్తమి. ఆ రోజు పరమాన్నాన్ని సూర్యునికి నైవేద్యంగా సమర్పిస్తారు. సప్తమికి అధిపతి సూర్యుడు. జగానికి ప్రత్యక్షదైవం సూర్యభగవానుడు. సమస్త జీవరాశి జీవించటానికేకాక, మొక్కల ఎదుగుదలకు, అవి పుష్పించి, ఫలించటానికి భూమి, నీరుతోపాటుగా సూర్యుడు ప్రసాదించే సూర్యరశ్మి చాలా ముఖ్యం. ఆదిత్యహృదయం, సూర్యాష్టకం చదివితే అనారోగ్యాలు తొలగిపోయి ఆరోగ్యవంతులవుతారు. సూర్యనమస్కారాలు చేస్తే భోగభాగ్యాలు, ఆరోగ్యం, ఆయుష్షు వృద్ధి చెందుతాయి.

### 08) అష్టమి

అష్టమితిథికి దుర్గాదేవి అధిదేవత. అష్టమాతృకలు, శ్రీకృష్ణుడు, దుర్గాదేవి జన్మించిన తిథి ఇది. కనుక, ఈ రోజు దుర్గాదేవిని పూజించాలి. దుర్గాదేవి వివిధపేర్లతో, అనేక నామాలతో ఆవిర్భవించి, ఎందరో రాక్షసులను సంహరించింది. స్త్రీ శక్తికి ప్రతీక దుర్గాదేవి. అష్టమినాడు దుర్గాదేవిని భక్తి శ్రద్ధలతో పూజిస్తే సిరిసంపదలు, ధనధాన్యాలు, సౌభాగ్యం పెంపొందుతాయి.

### 09) నవమి

నవమినాడు సీతారాములకల్యాణాన్ని జరుపుతారు. నవమి శ్రీరాముని జన్మదినం. నవమితిథి దుర్గామాతకు ప్రీతి

కరమైనది. నవమినాడు దుర్గాదేవిని, శ్రీరాముని పూజించి, వారి అనుగ్రహాన్ని పొందాలి. నవమికి అష్టవసువులు అధిపతులు.

**10) దశమి**

దశమి శుభప్రదమైన తిథి. దశమినాడు దిక్కుల సృష్టి జరిగింది. కనుక దిక్పాలకులు ఈ తిథికి అధిపతులు. దిక్పాలకులను పూజిస్తే పాపాలు తొలగిపోతాయి.

**11) ఏకాదశి**

ఏకాదశి కుబేరుడి జన్మదినం. ఏకాదశి ఒక పుణ్య తిథి. ఏకాదశికి యమధర్మరాజు అధిపతి. ఏకాదశిరోజున కుబేరుని పూజిస్తే, సిరిసంపదలు, ధనధాన్యాలు వృద్ధి చెందుతాయి. ఏకాదశిరోజున యమధర్మరాజును మనసారా స్మరించి, నమస్కరిస్తే అకాలమృత్యువు ఏర్పడదు.

**12) ద్వాదశి**

శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన తిథి ఇది. ఈ తిథిరోజున విష్ణుమూర్తి వామనుని అవతారాన్ని ధరించాడు. ద్వాదశికి విష్ణుమూర్తి అధినాయకుడు. ద్వాదశినాడు ఆవునేతితో దీపం పెట్టి, విష్ణుమూర్తిని పూజించాలి. 'ఓం నమో నారాయణాయ' అన్న అష్టాక్షరీమంత్రాన్ని పఠిస్తే, ఇహలోకంలో సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు లభిస్తాయి. మరణానంతరం ముక్తిని పొందుతారు.

**13) త్రయోదశి**

త్రయోదశి తిథికి అధిపతి మన్మథుడు. ఈ రోజున మన్మథుడిని స్మరించి పూజిస్తే, భార్యాభర్తలబంధం బలపడుతుంది. లోగడ ఏవైనా కలతలు, అపార్థాలు, కలహాలు ఏర్పడినా, ఆలుమగలు దూరంగా ఉన్నా అవి తొలగిపోయి, ఆ దంపతులకు అనుకూలదాంపత్యం ఏర్పడుతుంది.

**14) చతుర్దశి**

ఇది శివుని తిథి. ఈ తిథికి శివుడు అధిపతి. ఈ తిథినాడు పరమేశ్వరుడిని బిల్వదళాలతో పూజను, పంచామృతాలతో అభిషేకాన్ని చేయడంవల్ల అమితపుణ్యాన్ని పొందుతారు.


**15) అమావాస్య**

అమావాస్య పితృదేవతల తిథి. ఈ రోజుకు పితృదేవతలు అధిపతులు. పితృదేవతాకార్యాలు అమావాస్యనాడు తప్పకుండా చేయాలి. పితృదేవతలకు తిలోదకాలు సమర్పించాలి. కాకులకు ఆహారం పెట్టాలి. పితృదేవతలను ఈ రోజు సంతృప్తిపరచి, వారి ఆశీర్వాదాలను పొందాలి.

**16) పౌర్ణమి**

పౌర్ణమికి చంద్రుడు అధిపతి. పౌర్ణమినాడు ఉదయం ఉపవాసం చేసి రాత్రి దోసెలను చంద్రునికి నైవేద్యంగా సమర్పించి, వాటిని భుజించాలి. అందువలన వారికి శుభం కలుగుతుంది. ఉపవాసం చేయలేనివారు ఉదయం శాకాహారాన్ని భుజించి, రాత్రి చంద్రదర్శనం చేసుకుని, వెన్నెల ప్రసరించే ప్రదేశంలో దీపారాధన చేసి, దోసెలు తింటే వారికి మనోధైర్యం పెరిగి, మానసికప్రశాంతత కలుగుతుంది. చంద్రుడు మనో కారకుడు. మానవుల భావాలకు, నిర్ణయాలకు, ఆలోచనలకు, ప్రవర్తనకు చంద్రుడే కారకుడు.

ఉత్తమతిథులు రెండు పక్షాలలోనూ ఉన్నాయి. అవి శుక్లపక్షంలో ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ. కృష్ణపక్షంలో విదియ, తదియ, చవితి, పంచమి మంచి తిథులుగా పరిగణించబడినాయి. వేద సమయ గణితాన్ని అనుసరించి, చాంద్రమానములో ఒక రోజును తిథి అంటారు.



వ్యక్తిత్వ వికాసం

# భగవన్నామస్మరణమహిమ

-శ్రీ ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్, 98490 13002

మానవుడిగా జన్మించిన తరువాత జన్మ, మృత్యు, జరణ, వ్యాధిభయం అనివార్యం. కొందరు మహానుభావులు, కారణజన్ములు మాత్రం జన్మతః ఆ భయాన్ని పరిహరించు కోగలరు. సామాన్యమానవులుకూడా అచంచల దైవభక్తితో, మానవప్రయత్నంతో వాటిని అధిగమించగలరు అని శాస్త్రాలు వక్కాణిస్తు న్నాయి. భగవంతునియందు విశ్వాసం అతి ముఖ్యం. ఆ ప్రయత్నానికి మొక్కవోని సంకల్పం, గాఢమైనవిశ్వాసం అంతర్భాగమై ఉండాలి. మానవుడు జన్మించినప్పుడు మృత్యువు తప్పదని, మరణించినవానికి జన్మము తప్పదని శ్రీమద్భగవద్గీతద్వారా భగవంతుడు అర్జునుడికి ఉపదేశించాడు. అప్పుడు అర్జునుడి సందేహానికి సమాధానంగా ఆ నిరంతర పరిభ్రమణాన్ని నివారించగల మార్గంకూడా ఉపదేశించాడు. మనిషి పర మాత్మయందు విశ్వాసం కలిగి, నిరంతరం ఆయననే స్మరిస్తూ, ఆయనవైపే దృష్టి కేంద్రీ



కృతమై ఉండాలన్నాడు. ఆయన మెచ్చి పునర్జన్మ లేకుండా అనుగ్రహిస్తాడని ఉపాయం కూడా చెప్పాడు.

సగటు మానవుడికి మృత్యుభయం అత్యంత దుర్లభమైనది అంటారు పెద్దలు. అది అందరికీ అనుభవమే. భారతంలో ధర్మరాజు యక్షుడడిగిన ఒకప్రశ్నకి చెప్పిన సమాధానంలో, తన బంధువులు, స్నేహితులు, వయస్సుతో నిమిత్తంలేకుండా మరణించడం నిత్యం చూస్తున్నాకూడా తనకి మాత్రం మృత్యువులేదనీ, రాదనీ అనుకుంటాడట మానవుడు. కానీ అసురులు, మానవులు మృత్యువుని తప్పించుకోడానికి విశ్వప్రయత్నం చేస్తారు. అసురులు ఎన్నో భయంకరమైన, ఘోరమైన తపస్సులు; మానవులు పూజలు, వ్రతాలు చేసి మృత్యువునుంచి దూరంగా పారిపోవాలని యత్నిస్తారు. అనుక్షణం నీడలా వెన్నంటిఉండే మృత్యువునుంచి తప్పించుకోవాలనుకోవడం అవివేకం, మూర్ఖత్వం అని అర్థం చేసుకోలేరు. అసలు మృత్యుదేవత తన ఒడికి తీసుకుని సేద తీర్చితేగాని, పుట్టినప్పటినుండీ గిట్టేవరకూ మనం పడే తపనకు అంతం లేదు.

పుట్టినవ్యక్తికి బాల్యం, కౌమారం, యవ్వనం, ముసలితనం తప్పవు. అలాగే శిథిలమైనదేహాన్ని వదలి, ఆత్మ వేరొకదేహం ప్రవేశించడం సహజమేనని భగవంతుడు అర్జునుడికి చెప్పాడు. ముసలితనం వద్దనుకున్నా మీద పడడం తథ్యం. గత జన్మల పాపకృత్యాలు, ఈ జన్మలో వ్యాధిరూపంలో పీడించడం అనివార్యం. వాటినిగూర్చి దిగులుపడుతూ కూర్చోవడంకన్నా సకలకాలాల్లో, సర్వావస్థల్లో భగవంతుణ్ణి స్మరించుకుంటే బాధలు తగ్గి, కనీసం బాధలు భరించే శక్తి మనకు వచ్చే అవకాశం ఉంటుంది. మరణానికి భయపడేస్థానంలో దానిని ఆహ్వానించేస్థితికి చేరుకునేస్థితి వస్తుంది. జరాభీరత్వం తొలగిపోతుంది.

మృత్యుభయం మీద పడినప్పుడు పరీక్షిత్తుమహారాజు భాగవతశ్రవణంతో హరినిగురించిన పుణ్యకథలు వింటూ శాంతి, ముక్తి పొందాడు. హిరణ్యకశిపుడు హరిని దూషిస్తూ, నిరంతరం హరినామస్మరణే చేస్తూ మోక్షం పొందాడు. ప్రహ్లాదుడు తన తండ్రి పెట్టే సమస్తబాధలను హరినామస్మరణతో తప్పించుకున్నాడు. భక్త మార్కండేయుడు హరుణ్ణి ఆలింగనం చేసుకుని యముడిమీద విజయం పొందాడు.

కర్తృత్వభావమనే అహంకారం వదిలివేసి, కర్మఫలత్యాగం చేసి, నిరంతరం భగవంతుడిని స్మరిస్తే, మానసిక ఇహ బంధాలు పూర్తిగా తొలగిపోయి పరం సిద్ధిస్తుంది. కలికాలంలో భగవంతుడి నామస్మరణే అత్యంత ఫలదాయకమైనదని ఋషులు, పెద్దలు అనేక సందర్భాలలో చెప్పారు. మానవుడికి భగవంతుడిని స్మరించడంలోనే ఆధ్యాత్మికత, ఆనందం, ఇహం, పరం అన్నీ పొదగబడి ఉన్నాయి.

సదా భగవన్నామస్మరణతో పునర్జన్మ, మృత్యువు, ముసలితనం, వ్యాధి భయాలు శాశ్వతంగా తొలగిపోతాయి.

# అర్జున గర్వభంగం

- శ్రీమతి ఆసూరి ఉషారాణి,
94416 46016

ఒకరోజు అర్జునుడికి ఒక సందేహం వచ్చింది. సరాసరి కృష్ణపరమాత్మదగ్గరికి వెళ్లి "కృష్ణా! అందరూ కర్ణుడిని దానకర్ణుడు అంటుంటారు. నేను దానం చేస్తున్నా దాన అర్జునుడు అని ఎందుకనరు? ప్రజలకు దానం విరివిగా చేసి దానఆర్జున అని నిరూపించుకుంటా" అన్నాడు గర్వంగా.

అలాగేనంటూ మరుసటిరోజు శ్రీకృష్ణుడు పెద్ద బంగారుకొండను సృష్టించి అర్జునుణ్ణి పిలిచి "ఇదిగో బంగారం. ప్రజలను పిలిచి పంచిపెట్టు" అన్నారు. వెంటనే అర్జునుడు దండోరా మూలకంగా ప్రచారం చేసి అందరిని దానం పుచ్చుకోమని ప్రకటించాడు.

ప్రజలందరూ పెద్దపెద్ద గోనెసంచులతో వచ్చి నిలబడ్డారు. అర్జునుడు విజయగర్వంతో దోసిళ్లతో బంగారాన్ని తీసి వారి గోనెసంచుల్లో పోయసాగాడు. పోస్తున్నాడు.. పోస్తున్నాడు... సాయంత్రంవరకు. రెండుచేతులకు విపరీతమైన నొప్పి పుట్టాయి. ఇంక తనవల్ల కాదని అలసి కూర్చుండిపోయాడు.



"కృష్ణా! ఇక నావల్ల కాదు. ఇంకా ఇంతమంది ఉన్నారు. వాళ్ళకి నే పంచలేను" అన్నాడు అర్జునుడు.

కృష్ణుడు చిరునవ్వు నవ్వి మరుసటిరోజు అంతే కొండను సృష్టించి కర్ణుడిని రమ్మని పిలిచి ప్రజలకు పంచమన్నాడు. కర్ణుడు ప్రజలకు ఎలా పంచుతాడో చూద్దామని అర్జునుడు ఉబలాటంతో ఉన్నాడు. ప్రజలందరు తండోపతండాలుగా వస్తున్నారు. వెంటనే కర్ణుడు కృష్ణపరమాత్మునికి నమస్కరించి బంగారుకొండపైకి ఎక్కి "ప్రజలారా ఇదిగో బంగారం. మీకు ఎంత కావాలో అంత మీరు తీసుకెళ్లండి" అని ప్రకటించాడు. ప్రజలందరూ తమకు ఎంత కావాలో అంత పట్టుకెళ్లారు. మధ్యాహ్నానికంతా కొండ ఖాళీ అయిపోయింది. అర్జునుడు ఆశ్చర్యచకితుడయ్యాడు. శ్రీకృష్ణునితో "పరమాత్మ! నేను సాయంత్రం అయినా సగంకొండనుకూడా పూర్తి చేయలేదే అలాంటిది కర్ణుడు మధ్యాహ్నానికంతా కొండ మొత్తం ఖాళీ చేసేశాడు అంటే దీని అర్థం? అంటూ సందేహంగా కృష్ణుడివంక చూశాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి "అర్జునా! నీవు చేతితో పంచినప్పుడే నీకు ఆ బంగారం మీద ఇంకా వ్యామోహం ఉందని అర్థం. కర్ణుడికి బంగారంమీద వ్యామోహం లేదు. ఇష్టం వచ్చినట్టు తీసుకోమని ప్రజలకి ఇచ్చేశాడు. అదే తేడా. అందుకే అతను దాన కర్ణుడు అయ్యాడు. ఇప్పుడు అర్థమైందా? అని భగవానుడు అనేసరికి అర్జునుడు ఎంతో వినమ్రతతో నమస్కరించి అక్కడినుంచి నిష్క్రమించాడు.



# బాలనీతి



# గున్నను రక్షించిన గణపతి



– తమ్మవరపు వెంకట సాయి సుచిత్ర, 94923 09100

తెల్లవారింది. అడవిలో ఓ గున్నఏనుగు ఇంకా గుర్రు పెడుతూనే ఉంది. ఇంతలో సూర్యకిరణాలు దానిమీద పడ్డాయి. ఎండకు గున్నఏనుగు చర్మం మండసాగింది. దాంతో నిద్ర వదిలింది. బలవంతంగా కళ్లు తెరిచింది. చుట్టూరా చూసింది. కుందేళ్లు, జింకలు ఆడుకుంటున్నాయి. పక్షులు చెట్లపై కిచకిచ మని అరుస్తున్నాయి. పక్కకు తిరిగి చూసింది. తల్లిఏనుగు కనపడలేదు. తను లేవటం ఆలస్యమైంది. అందుకే అమ్మ తనను వదిలి ఆహారంకోసం అడవిలోకి వెళ్లిందని భావించింది.

ఇలా అప్పుడప్పుడూ జరగటం గున్నకు మామూలే. ఇంతలో దానికి బాగా ఆకలి వేసింది. తన చిన్నపాటి శరీరాన్ని అటూఇటూ కదిలించింది. మెల్లగా లేచి నిలబడింది. అమ్మ దగ్గరకు వెళ్లాలనుకుంది. ఆహారంకోసం అమ్మ ఎక్కడికి వెళుతుందో దానికి తెలుసు. కుందేళ్లు, నెమళ్లకు అమ్మ దగ్గరకు పోతున్నానని చెప్పి బయలుదేరింది. దారిలో చెట్లకొమ్మలు విరుస్తూ.. సందడిచేస్తూ నడక సాగించింది. ఇంతలో దానికి ఒక చెట్టు కనపడింది. ఆ చెట్టు ఆకులంటే గున్నఏనుగుకు బాగా ఇష్టం. వెంటనే తొండానికి పని చెప్పింది. తొండంతో చెట్టు కొమ్మలను విరిచి వాటి ఆకులను నోట్లో పెట్టుకొని నమలసాగింది. చెట్ల ఆకులు తియ్యగా ఉండటంతో ఇష్టంగా తినసాగింది.

ఇంతలో గున్నఏనుగుకు దాహం వేసింది. నీటికోసం చెరువువైపు నడవసాగింది. ఎంతదూరం నడుస్తున్నా చెరువు కనపడటం లేదు. దారి తప్పినట్లు గుర్తించింది. ఒకవైపు దాహం వేస్తోంది. మరోవైపు దారి తప్పటంతో భయం వేయసాగింది. ఇంతలో దూరంగా ఒక నీటిమడుగు కనిపించింది. ఆ మడుగును అది ఎప్పుడూ చూడలేదు. ఆ ప్రదేశం కొత్తగా ఉంది. అయినా దాహం తీర్చుకోవాలనుకుంది. ఆనందంగా తొండం ఊపుతూ మడుగువైపు నడవసాగింది. ఇంతలో ఓ చెట్టుక్రింద విగ్రహం కనపడింది. ఆ విగ్రహం అచ్చం తనలాగే ఉంది. దాహం మర్చిపోయింది. కన్నార్పకుండా దానికేసి చూడసాగింది. తొండంతో విగ్రహాన్ని తాకి చూసింది. అది కదల్లేదు.. మెదల్లేదు. విగ్రహంచుట్టూ తిరిగింది. కానీ ఏమీ కనపడలేదు. విగ్రహాన్ని చూస్తూ మడుగు వైపు నడిచింది.

మడుగులో కాలుపెట్టి తొండంతో నీళ్లు తీసుకోబోయింది. ఒకవైపు తొండంతో నీళ్లు పీల్చుతుండగా, మరోవైపు దాని శరీరం మడుగులో దిగబడిపోసాగింది. కాళ్లు కదలటం లేదు. ఒడ్డుకి రాలేక పోతోంది. ఎంత ప్రయత్నించినా ఊబి బయటకు రాలేకపోయింది. అప్పుడు దానికి అర్థమైంది. అది మడుగు కాదు ఊబి అని. భయం వేసింది. అమ్మ గుర్తుకు వచ్చింది. గట్టిగా ఘీంకరించింది. చుట్టూ చూసింది. తనను రక్షించే ఒక్క జంతువూ కనపడలేదు. మెల్లమెల్లగా గున్నఏనుగు ఊబిలో దిగబడిపోతోంది. ఇంతలో భగవంతుడు గుర్తొచ్చాడు. రక్షించమని పదేపదే మనసులో వేడుకుంది. దేవుడ్ని ప్రార్థిస్తున్న గున్న దృష్టి అక్కడున్న విగ్రహంపై పడింది. విగ్రహాన్ని చూస్తూ ఊబిలోంచి రక్షించమని వేడుకుంది.

దిక్కులేనివారికి దేవుడే దిక్కని అమ్మ చెప్పే ఈ సమయంలో నువ్వు తప్ప వేరెవరూ రక్షించలేరు. గున్న ప్రార్థన విగ్రహం ఆలకించింది. విగ్రహంనుంచి ఓ వెలుగు గున్న ఏనుగు కంటపడింది. గున్నను ఉద్దేశించి నిన్ను రక్షించే బాధ్యత నాది. ఇక్కడినుంచే నిన్ను ఊబినుంచి తప్పిస్తాను. విగ్రహం నుంచి నా తొండం నీకు దగ్గరగా వస్తుంది. నీ తొండంతో నా తొండాన్ని గట్టిగా పట్టుకో. ఊబినుంచి బయటపడొచ్చు అన్నాడు గణపతి. మొర ఆలకించినందుకు గణపతికి దండం పెట్టింది. విగ్రహంనుంచి గణపతితొండం ఊబిదగ్గరగా వెళ్లింది. ఊబి దగ్గరగా వచ్చిన గణపతితొండాన్ని తన తొండంతో గట్టిగా పట్టుకుంది. గణపతి తొండం సహాయంతో గున్న ఊబినుంచి బయటపడింది. ప్రాణాలతో బయటపడిన గున్న గణపతి ముందు రెండుకాళ్లు ఎత్తి నమస్కరించింది. విగ్రహంలోంచి గణపతి తనను దీవిస్తున్నట్లు గున్న భావించింది. అనంతరం అమ్మకోసం అడవిలోకి పరుగుతీసింది.

**నీతి:** కష్టాల్లో ఉన్నప్పుడు, వేరే ఏ దిక్కూ లేనప్పుడు దేవుడే దిక్కని ఎలుగెత్తి ప్రార్థిస్తే ఆ దేవుడే మనల్ని కాపాడతాడు. అదే పై కథలోని నీతి సారాంశం.

ఆయుర్వేదం

# ముల్లంగి

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ముల్లంగిదుంప, పత్రాలు పొడవుగా ఉండటంవల్ల దీర్ఘమూలక, దీర్ఘపత్ర అనే సంస్కృతనామాలతో వ్యవహరిస్తారు. బ్రాసెకేసి అను వృక్షకుటుంబానికి చెందిన ఈ ముల్లంగి శాస్త్రీయనామం రఫానస్ సెటైవస్. ఆంగ్లంలో రాడిష్‌గాను, హిందీలో మూలీ అనేపేర్లతో పిలుస్తారు. ముల్లంగిదుంపను కూర, సాంబారు, పచ్చడిలాంటి ఆహారపదార్థాలతయారీలో వాడటం అందరికి విదితమే. అద్భుతమైన ఔషధశక్తులుండటంవల్ల వివిధరకాలవ్యాధుల్లోకూడా దీన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఎలాంటి అనారోగ్యసమస్యల్లో ఈ ముల్లంగిని ఎలా వాడుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**దగ్గు త్వరగా తగ్గేందుకు:** రోజూ రెండుపూటలా పూటకి ఒక టీస్పూన్ ముల్లంగిరసం, ఒకటీస్పూన్ తేనె, ఒక చిటికెడు సైంధవలవణంపొడి కలిపి సేవిస్తుంటే దగ్గునుంచి త్వరగా ఉపశమనం కలుగుతుంది. కళ్లె తెగుతుంది. గొంతు, రొమ్ము భాగాల్లో భారం తగ్గుతుంది.

**మూలశంకవ్యాధికి:** రోజూ ఉదయం పరగడుపున 100 మి.లీ. తాజాపెరుగులో రెండుటీస్పూన్‌లవంతున ముల్లంగిముక్కలు, ఉల్లిపాయముక్కలు చేర్చి సేవిస్తున్నను (లేదా) రోజూ ఉదయం, సాయంత్రం 200మి.లీ. తాజామజ్జిగలో 25మి.లీ. ముల్లంగి రసం కలిపి సేవిస్తున్నను, అర్శమొలలవ్యాధిగా పేర్కొనే పైల్స్ వ్యాధిలో కలిగే నొప్పి, బాధ, మంట, రక్తంపడటంలాంటి వివిధబాధలు తగ్గుతాయి.

**తేలుకాటుకి :** ముల్లంగిదుంపముక్కల్లో కాస్త ఉప్పువేసి మెత్తగానూరి దట్టంగా లేపనంచేసి పైన తమలపాకులలాంటివి పెట్టి కట్టుకడితే అతిత్వరగా తేలు విషప్రభావం నిర్వీర్యమై తేలుకాటువల్ల సంభవించే మంట, నొప్పి, బాధ, పోటు ఇత్యాది లక్షణాలు తగ్గుతాయి.

**కామెర్లు తగ్గేందుకు:** రోజూ ఉదయం, రాత్రి ఆహారానికి అర గంటముందు పూటకు 10-20మి.లీ. ముల్లంగిఆకులరసంలో తగినంత పంచదార వేసి సేవిస్తుంటే వేధించే కామెర్లవ్యాధి నుంచి బయటపడవచ్చు.

**ఆకలి అయ్యేందుకు:** రోజూ ఒకసారి ఒకమీడియంసైజు ముల్లంగిగడ్డను సన్నటిముక్కలుగా చేసి 200 మి.లీ.నీటిలో వేసి సన్నమంటపై 100 మి.లీ.నీరు మిగిలేలా మరగించి దించి చల్లార్చి వడగట్టి ఒకగ్రాము పిప్పళ్ళచూర్ణం కలిపి సేవిస్తుంటే జీర్ణరసాలు బాగా ఉత్పత్తి అయి, ఆకలి బాగా అయి జీర్ణశక్తి బాగా ఉంటుంది.

**తెల్లమచ్చలకు:** రోజూ ఒకసారి తగినన్ని ముల్లంగిగింజలకు తగినంత ఉత్తరేణిఆకురసం కలిపి మెత్తగానూరి లేపనం చేస్తుంటే ల్యూకోడెర్మ లేదా విటిలిగో లేదా బొల్లివ్యాధిగా పిలువబడే ఈ సమస్య తగ్గుతుంది.

**మలబద్ధకం:** రోజూ రెండు లేదా మూడుసార్లు పూటకి ఒక టీస్పూన్ ముల్లంగిముక్కల్లో తగినంత ఉప్పు, మిరియాలపొడి, నిమ్మరసం కలిపి సేవిస్తుంటే ప్రేవుల కదలికలు బాగా జరిగి విరేచనం సాఫీగా అవుతుంది.

**కిడ్నీస్టోన్స్:** రోజూ ఉదయం, రాత్రి ఆహారానికి అరగంటముందు పూటకు 20 మి.లీ. ముల్లంగిరసంలో ఒకగ్రాము ఉలవలపొడి కలిపి సేవిస్తుంటే మూత్రవ్యవస్థలో రాళ్ళు కరిగిపోతాయి.

**అధికబరువు తగ్గేందుకు:** రోజూ ఉదయం పరగడుపున 150 మి.లీ. పలుచటి తాజామజ్జిగలో 25 మి.లీ. ముల్లంగిరసం, ఒకగ్రాము జీలకర్రపొడి, అరబద్ద నిమ్మరసం కలిపి సేవిస్తుంటే శరీరంలో అధికంగా సంచితమైన క్రొవ్వు క్రమక్రమంగా కరిగి శరీరం తేలికబడి నాజూగ్గా తయారవుతారు.

**కీళ్ళనొప్పులు:** ఎండిన ముల్లంగిగింజలపొడికి సమానంగా పటికబెల్లంపొడికలిపి ఉదయం, సాయంత్రం పూటకి 1-2 గ్రాములవంతున 50 మి.లీ. నీటిలో కలిపి సేవిస్తుంటే కీళ్ళ నొప్పులు, సలుపు, పోటు, బాధలు తగ్గుతాయి.



# చిత్ర కథ గురువులను గౌరవిద్దాం!!

కథ- మొలకా ఉత్తరఫల్గుణి
చిత్రాలు- డా॥ శ్రీధరన్ కాలికి






**నీతి:**గురువులను హింసిచ్చొద్దు. అన్ని ధర్మాల్లోకి అహింస గొప్పధర్మం. దీనిని ఆచరించేవారు దేవజన్మను పొందుతారు. అలా లేనివారు ఏ రాక్షసులుగానో, క్రూరజంతువులుగానో పుట్టి దుఃఖాలపాలౌతారు. కాబట్టి అహింసను పాటిద్దాం. మంచి జన్మను పొందుదాం.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-37(ఆ)

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

## अकारन्तस्त्रीलिङ्गनामवाचकानि
(ఆకారాన్త స్త్రీలింగనామవాకకములు)

| | | | | | |
|---|---|---|---|---|---|
| अम्बा | = అమ్మ | डोला | = ఊయల | वत्सा | = పెయ్యదూడ |
| विद्या | = చదువు | शिञा | = గజ్జి | पिपीलिका | = చీమ |
| लता | = తీగె | भस्त्रा | = తిత్తి | जलका | = జలగ |
| अङ्गना | = అడవి | स्तनपा | = చంటిపిల్ల | नासिका | = ముక్కు |
| पुत्रिका | = కూతురు | बहुला | = ఆవు | दूषिका | = పుసి |
| बालिका | = ఆడపిల్ల | दार्विका | = బెండ | अग्रजा | = అక్క |
| गोधा | = బల్లి | रसना | = నాలుక | अनुजा | = చెల్లెలు |
| मक्षिका | = ఈగ | झल्लिका | = కీచురాయి | कनिष्ठिका | = చిటికెన వ్రేలు |
| घण्टा | = గంట | तैलपायिका | = గబ్బిలం | मध्यमा | = నడిమవ్రేలు |

## अव्ययानि लिङ्गविभक्तिवचनशून्यानि, एतानि अध:स्थानि अव्ययानि
అద్యయములకు లింగవచన విభక్తులుండవు ఈ క్రిందివి అవ్యయములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| किञ्च अपिच | = ఇంతేకాకుండ | बहुधा | = పలువిధములుగా | अद्यापि | = నేటికిని |
| पर्श्वत: | = ప్రక్కగా | समीपं | = దగ్గరగా | आ | = మొదలకొని, వఱకును |
| कथमपि | = అతికష్టముగా ఎట్లాగో | अतीव | = మిక్కిలి | सुतरां | = బొత్తుగా, ఎంతమాత్రము |
| आहा | = ఔరా | तिर्यक् | = అడ్డముగా | प्रति | = కూర్చి |
| अघ: | = క్రింద | साकं | = తో, కూడ | दूरं | = దూరముగా |
| परित: | = అన్నివైపుల | परुत् | = గత సంవత్సరమున | सत्यं | = నిజముగా |
| बाढं | = సరేమంచిది | वक्रं | = వంకరగా | अब्रह्मण्यं | = అయ్యోపాపము |
| हेभो: | = ఓ | नाम | = అను, అనగా | हञ्जे | = అసే |
| उप | = దగ్గఱ | इताऽपि: | = ఇంకను | ऋजु | = సరిగా |
| | | उपरि | = పైనమీద | | |

# క్విజ్ 39

01) యముడి మీద విజయం పొందిన బాలభక్తుడు? జ)..........

02) వృషభాద్రిపై కొలువున్న స్వామి? జ)..........

03) మోకాళ్లతో కొండనెక్కిన అపరభక్తులు? జ)..........

04) శివపార్వతుల నివాసపర్వతం? జ)..........

05) మహాభాగవత రచన కవి? జ)..........

06) సనాతనధర్మం అంటే...? జ)..........

07) సృష్టిలో జీవరాశుల సంఖ్య? జ)..........

08) మానవుల మనసుపై ప్రభావం చూపే గ్రహం? జ)..........

09) తన లాభం తాను చూసుకునేవాడు? జ)..........

10) శ్రీకృష్ణభక్తుడు, సఖుడు? జ)..........

11) 'త్రయోదశి' తిథికి అధిపతి? జ)..........

12) నరకాసురుణ్ణి వధించిన స్త్రీమూర్తి? జ)..........

13) సృష్టికార్య నిర్వాహకుడు? జ)..........

14) హోమాల్లో ముఖ్యమైనది? జ)..........

15) జగానికి ప్రత్యక్షదైవం? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-10-2025.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........

పాఠశాల: .......... తరగతి: ..........

పేరు: ..........

చిరునామా: ..........

..........

..........

.......... పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.



## ఏకాదశ అప్రకాశిత గుణములు


| | | |
|---|---|---|
| 01) కామము | (చేత) | వ్రతనాశనం |
| 02) కోపము | (చేత) | జీవహింస |
| 03) లోభము | (చేత) | దొంగతనం |
| 04) వంచన | (చేత) | అసత్యం |
| 05) శౌర్యము | (హింసచేత) | భయం |
| 06) అజ్ఞానము | (చేత) | అవివేకం |
| 07) దుష్టత్వము | (చేత) | శతృత్వం |
| 08) దుష్టకార్యము | (చేత) | ప్రాణభయం |
| 09) గర్వము | (చేత) | అపజయం |
| 10) చేతకానిపని | (చేత) | అపాయం |
| 11) చెడుపని | (చేత) | అపకీర్తి |

## చతుర్దశ చాటువుల్లో ఏ చాటువుకు ఎన్ని పద్యాలు ఉంటాయో క్రింద తెలుపబడ్డాయి. వాటిని జతపరచండి

| చాటువు | - | పద్యములు |
|---|---|---|
| 01) ముక్తము | - | అ)100 |
| 02) లోక్యము | - | ఆ) 96 |
| 03) వారధిమాల | - | ఇ) 64 |
| 04) పంచరత్నములు | - | ఈ) 32 |
| 05) వారణమాల | - | ఉ) 27 |
| 06) నవరత్నములు | - | ఊ) 16 |
| 07) అవతారమాల | - | ఋ) 12 |
| 08) భాస్కరమాల | - | ౠ) 10 |
| 09) శశికళ | - | ఎ) 9 |
| 10) నక్షత్రమాల (లేక) తారావళి | - | ఏ) 8 |
| 11) రాగమాల | - | ఐ) 5 |
| 12) విద్యామాల | - | ఒ) 4 |
| 13) తత్త్వమాల | - | ఓ) 3 |
| 14) శతకము | - | ఔ) 1 |



జవాబులు: 1)ఔ 2)ఓ 3)ఒ 4)ఐ 5)ఏ 6)ఎ 7)ౠ 8)ఋ 9)ఊ 10)ఉ 11)ఈ 12)ఇ 13)ఆ 14) అ



ఈ వృద్ధదంపతులు తిరుమల శ్రీవారి చక్రస్నానానికి వెళ్లాలంట. దారి చూపుదామా మరి!!

## రంగులు వేద్దాం..!!

క్రింది చిత్రాన్ని చూసి రంగులు వేయండి



# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** సంతోషంగా ఉంటారు మరియు సమాజంలో గౌరవాన్ని పొందుతారు. న్యాయ పరమైన సమస్యలు మరియు వ్యాజ్యాలకు సంబంధించిన విషయాలు మీకు అనుకూలంగా వస్తాయి.



**వృషభం-** స్పెక్యులేషన్ మరియు పెట్టుబడులలో లాభాలను పొందుతారు. ఈ రాశివారికి మానసికఒత్తిడి, మనోవేదన, ఆందోళన తొలగి ఆనందమయమైన జీవితం ఆస్వాదిస్తారు. ఇది అదృష్ట వంతంగా ఉండేకాలం.



**మిథునం-** సహోద్యోగులు మీకు మద్దతు ఇస్తారు. ఈ సమయంలో మీరుచేసే పని విషయంలో అధికశ్రద్ధతో ముందుకు వెళతారు. ఈ సమయంలో, కొన్ని శారీరకసమస్యలు మీ తోబుట్టువు లను ఇబ్బందిపెట్టవచ్చు.



**కర్కాటకం-** తలపెట్టినపనులు సకాలంలో పూర్తి అవుతాయి. ధైర్యంతో వ్యవహార జయము, ఉద్యోగ విషయాలలో ముందంజ, అన్ని వృత్తులవారికి జీవనవృద్ధి, వ్యక్తిగతలాభం, స్థాయి పెరగడం, పుష్కలమైన ఆరోగ్యం ఉంటుంది.



**సింహం-** చేసే పనిమీద పూర్తి అవగాహన, ఖచ్చితమైన ప్రణాళిక వీరికి ఉంటుంది. ఆశయసిద్ధికోసం నిర్విరామంగా కృషిచేసి సాధిస్తారు. సోదరబలం ఉంటుంది. ఇతరులకు తమవంతు సహకారం అందిస్తారు.



**కన్య-** దురుసుతనంవలన ఇబ్బందులు తెచ్చుకుంటారు. మతపరమైన కార్యక్రమాల్లో ఆసక్తి చూపిస్తారు. ఆధ్యాత్మికంగా ఉన్నతి కలుగుతుంది. విందుభోజనాల్లో పాల్గొంటారు.



**తుల-** ఈ నెలలో వైద్యవృత్తివారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అహంకారం, అహంభావం తగ్గించుకుని లక్ష్యసాధనవైపు దూసుకుపోగల్గుతారు. అనైతికపనులకు అడ్డుకట్ట వేస్తారు.



**వృశ్చికం-** మీరు పనిచేసేచోట ప్రమాదాలు సంభవించేవిధంగా పరిస్థితులుంటాయి. శారీరకంగా కష్టపడి పనిచేస్తారు, తరచుగా వివాదాలు తప్పవు.



**ధనుస్సు-** వ్యాపారులకు అనుకూలం. లాభాలను ఇబ్బడిముబ్బడిగా పొందుతారు. విద్యార్థులు చదువులలో ముందంజ వేస్తారు. ప్రముఖవ్యక్తుల అండదండలు ఉంటాయి.



**మకరం-** శుభఫలితాలు కలుగుతాయి. ఈ కాలంలో ప్రయత్నాలనుబట్టి విజయాన్ని పొందుతారు. సంపద పెరుగుతుంది. కీర్తి మరియు ప్రతిష్ఠలుకూడా పెరుగుతాయి.



**కుంభం-** కుటుంబంలో శిశుజననంవలన ఆనందం. సరైన నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. బంధుమిత్రుల కలయిక, ఆనందమయమైన జీవనం అనుభవిస్తారు.



**మీనం-** దైవకార్యాల్లో పాల్గొని తనవంతు సహాయం చేస్తారు. కుజసంచార ప్రభావం అధిగమించుటకు ప్రతి మంగళవారం ఋణ విమోచక అంగారకస్తోత్రం చదవాలి.

ఇతరులను మోసగించకుండా ఉంటే నీ జాతకచక్రం దానంతటదే మారుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :


**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
...................................................................... తేది :....................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# శ్రీపదకేళి

117



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)ఆశ్వీయుజశుద్ధదశమిన జరిగే పెద్దపండుగ(6); 4)ఆశ్వీయుజశుద్ధఏకాదశి(4); 6)ప్రస్తుతం జరుగుచున్న యుగం(2); 7)ఈ కవి ఆస్థానంలో నన్నయ్య ఉండెను(8); 10)దశరథుని భార్య(2); 11)ఆశ్వీయుజబహుళ ఏకాదశి(2); 12)అంగుష్ఠప్రమాణ దేహము కల మహర్షులు(5); 14)సహదేవునిభార్య(3); 16)త్రేతా యుగమునాటి ఒకమహర్షి(4); 17)శివుని భార్య(3); 19)దిలీపుని భార్య(4); 21)వేటాడగా అలసిన పరీక్షిత్తుకు దాహం తీర్చని ముని(4)

**నిలువు** 1)దేవతల శిల్పి(4); 2)ఆశ్వీయుజశుద్ధపాడ్యమినుండి దశమివరకు జరుగు ఉత్సవాలు(3); 3)స్నేహితు రాలు(4); 5)ఇతని సారధ్యము పనికిరాదు(3); 8)దీపావళికి ముందు రోజు(7); 9)కార్తికశుద్ధచవితి(6); 13)ఆశ్వీయుజబహుళ అమావాస్య రోజున ఈ పండుగ జరుపుతారు(4); 15)కృష్ణుణ్ణి పెంచిన తల్లి(3); 18)ధర్ముడను మనువు పుత్రుడు(3); 20)భూమి(2);

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri R.V.Vijaya Kumar, B.A., B.Ed., and Published by Dr.V.G.Chokkalingam, M.A., Ph.D. on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా (15-08-2025న)
తి.తి.దే. పరిపాలనాభవన ప్రాంగణమైదానంలో జెండావందనం చేస్తున్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు,
మాజీ కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సిహెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్.



చెన్నై టి.నగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీపద్మావతి అమ్మవార్లను
16-08-2025న దర్శించుకున్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు



ఆడికృత్తిక పండుగ సందర్భంగా 16-08-2025న
తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి తి.తి.దే. తరపున
తిరుమల శ్రీవారి సారె సమర్పించిన
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడు




గోకులాష్టమి పండుగ సందర్భంగా 16-08-2025న
తి.తి.దే. గోసంరక్షణశాలను సందర్శించి
గోవుకు పశుగ్రాసం తినిపిస్తున్న తి.తి.దే.
మాజీ కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.





తిరుచానూరు, శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థానమండపంలో 08-08-2025న అత్యంత వైభవంగా జరిగిన వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న తి.తి.దే. మాజీ కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., దంపతులు, సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్., దంపతులు మరియు తి.తి.దే. పాలకమండలి సభ్యులు శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams Printing on 25-09-2025 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 1st of Every Month.



మనవాళమహామునుల శాత్తుమొఱ

(27-10-2025)